RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS
We undertake
Printing of
Daily News Papers

హైదరాబాద్ 8 ఆగస్ట్ 2025 శుక్రవారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:21 | సంచిక:58

## ఈసీ చేతిలో ప్రజాస్వామ్యం ఖూనీ... మోదీ కోసమే!:

# రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు



సీసీటీవీ ఫుటేజ్, డేటా ఇవ్వట్లేదన్న రాహుల్‌కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ)పై కాంగ్రెస్ అగ్ర నేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు చేశారు. ఈసీ ఇప్పుడు ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే సంస్థగా కాకుండా, దాన్ని ఓ క్రమపద్ధతిలో కూల్చివేయడానికి సహకరిస్తోందని ఆయన తీవ్రంగా విమర్శించారు. బీజేపీతో ఈసీ కుమ్మక్కై ఎన్నికల ప్రక్రియను పూర్తిగా తారుమారు చేస్తోందని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ధ్వజమెత్తారు.

ఎన్నికల ప్రక్రియ, ఓటర్ల జాబితా విశ్వసనీయతపై ఆయన తీవ్ర అనుమానాలు వ్యక్తం చేశారు. "అసలు ఓటర్ల జాబితా కచ్చితంగా ఉందా? సరైన వ్యక్తులు ఓటు వేయగలుగుతున్నారా? ప్రజల్లో తీవ్రమైన అనుమానాలు ఉన్నాయి, వాటికి బలమైన కారణాలు కూడా ఉన్నాయి" అని రాహుల్ అన్నారు. మహారాష్ట్రలో లోక్‌సభ ఎన్నికలు, అసెంబ్లీ ఎన్నికల మధ్య కేవలం ఐదు నెలల వ్యవధిలో ఏకంగా కోటి మంది కొత్త ఓటర్లు ఎలా పెరిగారని ఆయన ప్రశ్నించారు. "లోక్‌సభ ఎన్నికల్లో మహారాష్ట్రలో మేము ఘన విజయం సాధించాం. కానీ కొన్ని నెలల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తుడిచిపెట్టుకుపోయాం. ఈ మధ్యలో కోటి మంది కొత్త ఓటర్లు పుట్టుకొచ్చారు. దీనిపై వివరణ ఇవ్వాలని ఈసీని కోరినా వారి నుంచి సమాధానం లేదు" అని ఆయన పేర్కొన్నారు.

అంతేకాకుండా, హర్యానా, మధ్యప్రదేశ్‌లలో ఒపీనియన్ పోల్స్‌కు, తమ అంతర్గత సర్వేలకు, వాస్తవ ఫలితాలకు మధ్య భారీ వ్యత్యాసం ఉందని, ఫలితాలను ముందుగానే నిర్దేశించినట్లుగా ఉందని రాహుల్ ఆరోపించారు. మహారాష్ట్రలో పోలింగ్ కేంద్రాల వద్ద పెద్దగా క్యూలు లేనప్పటికీ, సాయంత్రం 5 గంటల తర్వాత పోలింగ్ శాతం అమాంతం పెరిగిపోవడం వెనుక ఆంతర్యమేమిటని నిలదీశారు.

విశ్లేషణ కోసం ఓటర్ల జాబితా సాఫ్ట్ కాపీలను ఈసీ ఉద్దేశపూర్వకంగా నిరాకరిస్తోందని, సీసీటీవీ ఫుటేజ్‌ను ధ్వంసం చేస్తోందని రాహుల్ ఆరోపించారు. "ప్రధాని మోదీ కేవలం 25 సీట్ల మెజారిటీతో ఉన్న ప్రధాని. ఆయన అధికారంలో కొనసాగాలంటే 25 సీట్లను దొంగిలిస్తే సరిపోతుంది. అందుకే ఎన్నికల సంఘం నిజాలను కప్పిపుచ్చుతోంది" అని రాహుల్ గాంధీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

## మల్లికార్జున్ ఖర్గే ను కలిసిన రేవంత్ బృందం



సీలకు స్థానిక సంస్థల ఎన్నికలు, విద్యా, ఉద్యోగ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్ల బిల్లులకు ఆమోదం తెలిపేలా కేంద్ర ప్రభుత్వంపై పార్లమెంట్‌లో ఒత్తిడి తేవాలని ఏఐసీసీ అధ్యక్షుడు, రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే ని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి మరియు సహచర మంత్రులతో కలిసి విజ్ఞప్తి చేయడం జరిగింది . రాష్ట్రంలో కుల సర్వే తీరు... తర్వాత రాష్ట్ర శాసనసభలో బిల్లుల ఆమోదం విషయాలను ఖర్గేతో పార్టీ సీనియర్ నేతలు జైరాం రమేశ్ తదితరులకు సీఎం, పీసీసీ అధ్యక్షుడు గార్లతో కలిసి వివరించడం జరిగింది.రాష్ట్రంలో రిజర్వేషన్ల సవరణకు సంబంధించిన ఆర్డినెన్స్‌ను గవర్నర్ ఆమోదించకుండా నెలల తరబడి పెండింగ్ లో ఉంచిన విషయాన్ని ఖర్గే దృష్టికి తీసుకెళ్లడం జరిగింది . బిల్లులను ఆమోదించాలని కోరుతూ రాష్ట్రపతి అపాయింట్‌మెంట్‌కు ప్రయత్నిస్తున్నామని తెలపడం జరిగింది . బిల్లుల ఆమోదం కోరుతూ రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ ఛైర్మన్‌లు, బీసీ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో జంతర్‌మంతర్‌లో బుధవారం రోజంతా ధర్నా నిర్వహించిన విషయాన్ని, ఇండియా కూటమిలోని పార్టీల ఎంపీలు సంఘీభావం తెలిపిన విషయాన్ని సీఎం గారు ఖర్గే గారికి తెలియజేశారు

# ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వాసులకు ఎలాంటి ఇబ్బంది రానీయొద్దు

వార్తా 2 లో

అప్రమత్తంగా ఉండండి.. సమన్వయంతో వ్యవహరించండి లిలిలి
ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వాసులకు ఎలాంటి ఇబ్బంది రానీయొద్దు
వర్షాభావ పరిస్థితులు, వరద సహాయక చర్యలపై ఉన్నతస్థాయి సమీక్ష
అలసత్వం వహించొద్దని ఉన్నతాధికారులకు మంత్రి శ్రీధర్ బాబు హెచ్చరిక

## హిమాయత్ సాగర్ రిజర్వాయర్ గేటు ఎత్తిన జలమండలి అధికారులు




వర్షాలతో జంట జలాశయాలకు జలకళ
క్రమంగా చేరుతున్న వరద నీరు
హిమాయత్ సాగర్ రిజర్వాయర్ ఒక గేట్ అడుగు మేర ఎత్తివేత
మూసీ నదిలోకి 339 క్యూసెక్కుల వరద నీరు విడుదల
అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎండీ అశోక్ రెడ్డి సూచన

కొన్ని రోజులుగా ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో జంట జలాశయాలైన హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ కు వరద నీరు వస్తోంది. దీంతో హిమాయత్ సాగర్ రిజర్వాయర్ ఒక గేట్ ను నేడు (గురు వారం) రాత్రి 10 గంటలకు జలమండలి అధికారులు ఎత్తారు.

రిజర్వాయర్ ఒక్క గేటును ఒక ఫీటు మేర ఎత్తి వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం హిమాయత్ సాగర్ కు 1000 క్యూసెక్కుల ఇన్ ఫ్లో రాగా.. 339 క్యూసెక్కుల అవుట్ ఫ్లో ఉంది.

జలాశయాల గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేసినందున ఎండీ అశోక్ రెడ్డి సంబంధిత జలమండలి అధికారులతో పాటు హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిపాలనా యంత్రాంగాలు, హైడ్రా, జీహెచ్ఎంసీ, పోలీసు అధికారులతో సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు.

హిమాయత్ సాగర్ రిజర్వాయర్ వివరాలు:
పూర్తి స్థాయి నీటి మట్టం : 1763.50 అడుగులు
ప్రస్తుత నీటి స్థాయి : 1762.70 అడుగులు
రిజర్వాయర్ పూర్తి సామర్థ్యం : 2.970 టీఎంసీలు
ప్రస్తుత సామర్థ్యం : 2.734 టీఎంసీలు
ఇన్ ఫ్లో : 1000 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో : 339 క్యూసెక్కులు
మొత్తం గేట్ల సంఖ్య : 17
ఎత్తిన గేట్ల సంఖ్య : 01



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి** చీకటిని, వర్షంలో సైతం విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో పనిచేస్తున్న TGSPDCL సిబ్బంది

# నగర ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటికి రావొద్దు

**నగరంలో ఈ రోజు, రేపు భారీ వర్షాలు కురిసే అవకాశం**
**ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూసేందుకు ghmc అధికారులు, హైడ్రా అధికారుల సమన్వయం చేసుకోవాలి**
**వాతావరణ శాఖ హెచ్చరిక ల నేపథ్యంలో జీహెచ్ఎంసీ అధికారులు అప్రమత్తంగా ఉండాలి: మేయర్ శ్రీమతి గద్వాల విజయలక్ష్మి**



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి** హైదరాబాద్, ఆగస్ట్ 07,2025: గ్రేటర్ హైదరాబాద్ నగరంలో గురువారం సాయంత్రం నుంచి శుక్రవారం ఉదయం వరకు
భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ముందస్తు హెచ్చరికల నేపథ్యంలో
జీహెచ్ఎంసీ అధికారులు అప్రమత్తంగా ఉండాలని మేయర్ గద్వాల విజయలక్ష్మి ఆదేశించారు.

నగరంలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో దృష్ట్యా గురువారం సాయంత్రం మేయర్ శ్రీమతి గద్వాల విజయలక్ష్మి జోనల్ కమిషనర్‌లు, ghmc విభాగాల ఉన్నతాధికారులు, డిప్యూటీ కమిషనర్ లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు.
అధికారులకు దిశా నిర్దేశం చేశారు.
వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం, నగరంలో ఈ రోజు, రేపు వర్షాలు కురిసే అవకాశం ఉందని మేయర్ తెలిపారు. ఈ నేపథ్యంలో జోనల్ కమిషనర్‌లు,
ghmc విభాగాల ఉన్నతాధికారులు, డిప్యూటీ కమిషనర్ లు, క్షేత్రస్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండి, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులకు తక్షణమే స్పందించాలని సూచించారు.

హైడ్రా (HYDRAA)తో సమన్వయం చేసుకుంటూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.



వర్షం కారణంగా వెంగళరావు park దగ్గర ఎలక్ట్రికల్ పోలె పడిపోవడం తో అక్కడికి చేరుకొన్నారు నగర మేయర్. అధికారులను అప్రమత్తం చేసిన నగర మేయర్

వర్షం వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా, నీటి నిలిచే ప్రాంతాల (వాటర్ లాగింగ్ పాయింట్స్)పై ప్రత్యేక దృష్టి సారించాలని మేయర్ గద్వాల విజయలక్ష్మి ఆదేశించారు. వర్షానికి సంబంధించిన ఫిర్యాదులు లేదా సహాయం కోసం ప్రజలు జీహెచ్ఎంసీ-డీఆర్ఎఫ్‌ను 040-29555500, 040-21111111 లేదా 9000113667 నంబర్‌లలో సంప్రదించాలని, లేదా హైడ్రాకు ఫిర్యాదు చేయాలని సూచించారు. వర్షాల వల్ల ప్రజలకు అసౌకర్యం కలగకుండా జీహెచ్ఎంసీ అవసరమైన చర్యలు తీసుకుంటుందని మేయర్ స్పష్టం చేశారు.
ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్ళవద్దని మేయర్ విజ్ఞప్తి చేశారు

ప్రజాబలం

8 ఆగస్ట్ 2025 శుక్రవారం

# ఫుడ్ పాయిజనింగ్ బాధ్యులెవరు?

తెలంగాణ పాఠశాలల్లో ఫుడ్ పాయిజనింగ్ కేసులు క్రమంగా పెరుగుతున్నాయి. ఈ ఫుడ్ పాయిజనింగ్ వ్యవహారం ఈనాటిది కాదు. ఎంతో కాలంగా ఈ సమస్య ఉన్నప్పటికీ గత ఏడాది కాలంగా ఆ సంఖ్య పెరిగింది. జడ్చర్ల, నాగర్‌కర్నూల్, భువనగిరి, మంచిర్యాల, ఉయ్యాల వాడ, కెజిబివిలు, మాగనూర్ ఉన్నత పాఠశాల ఇలా చెప్పుకుంటూపోతే గత ఏడాది కాలంగా తెలంగాణ పాఠశాలల్లో వేయి మంది విద్యార్థుల వరకు ఫుడ్ పాయిజనింగ్‌కు గురయ్యారని, 50 మంది వరకు ప్రాణాలు కోల్పోయారనే సమాచారం ఉంది. ఈ సంఖ్య చిన్నదేమీ కాదు. అయితే తెలంగాణ రాష్ట్రంలోని రెసిడెన్షియల్ పాఠశాలలు, ఉన్నత పాఠశాలలు, కస్తూర్బా బాలికా విద్యాలయాలులో ఫుడ్ పాయిజనింగ్ కేసులు నమోదు వెనుక కారణాలు ఏమిటి? పాఠశాలల ఆహారభద్రతా వైఫల్యం పాపంలో ఎవరి పాలు ఎంత ఖచ్చితంగా నిర్ధారించవలసిన అవసరం ఉంది. ఏదోఒక సంఘటనలో స్థానిక సిబ్బందిపై నేరం మోపి, సంజాయిషీ చెప్పుకొని మళ్ళీ అదే సంఘటనలు పదేపదే పునరావృతం కావడం ఎంతమాత్రం సరైనది కాదు? దాని మూలాల్లోకి వెళ్ళవలసిన అవసరం ఉంది. విద్యార్థుల ఫుడ్‌పాయిజనింగ్ కేసుల్లో మొదటి ముద్దాయి మాత్రం ప్రభుత్వాలే అనడంలో అతిశయోక్తి లేదు. ఎందుకంటే 2020, ఏప్రిల్ 1న నిర్ణయించిన తలసరి కేటాయింపుల ప్రకారం నేడు పిల్లలకు వండివార్చడం సాధ్యం అవుతుందా? ఆనాడు రోజుకు ఒక్కింటికి కళాశాల విద్యార్థులకు తలకు 36 రూపాయలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, కెజిబివిలకు తలకు 33 రూపాయలు కేటాయించారు. రెండు పూటల భోజనం, ఉదయం అల్పాహారం, వారంలో నాలుగు రోజులు కోడిగుడ్డు, 1, 3 ఆదివారాలు చికెన్, 2, 4 ఆదివారాలు మటన్, 6 రకాల కూరగాయలతో మార్చి మార్చి పెట్టాలి. ఇక ప్రాథమిక పాఠశాల అయితే ఒక్కో విద్యార్థికి గుడ్డుతో కలిపి మధ్యాహ్న భోజనానికి 9-97 పైసలు, మాధ్యమిక పాఠశాలో అయితే రూ. 10.17 పైసలు, ఉన్నత పాఠశాలకైతే రూ. 9-95 పైసలు మెనుగా జిఒఎంఎస్ 75 ప్రకారం ప్రభుత్వం ఇస్తుంది. ఇటీవల కోడిగుడ్డు ధర పెరగడంతో తలకు ఉన్నత పాఠశాలలో 3 రూపాయలు పెంచి రూ. 13.17 పైసలు ఇచ్చి ప్రభుత్వం చేతులు దులుపుకుంది. 2020 నుండి 2025 నాటికి ఆరు సంవత్సరాల కాలంలో నిత్యావసర వస్తువులు, కూరగాయలు, పప్పులు, నూనెల ధరలు ఎన్ని రెట్లు పెరిగి ఉంటాయి. ఆరేళ్ళనాటి మెనూ రేట్లు ప్రకారం భోజన వసతి కల్పించడం ఎలా సాధ్యం? పైగా సరకులు సరఫరాకు టెండర్ల ప్రక్రియ మూలంగా సరఫరాదారు, అంటే మధ్యదళారు తన లాభం, ఇచ్చే మామూళ్ళు లెక్కచూసుకొని నాసిరకం సరుకులు, తక్కువ ధర ఉన్న కూరగాయలు, చనిపోయిన జంతువుల మాంసం, నాసిరకం కోడిగుడ్లు, చికెన్ సరఫరా చేస్తున్నారు. ఆయా వ్యవస్థలకు అందిన సరకులు కొంత మాయం అవగా మిగిలిన కొద్ది భాగం మాత్రమే పిల్లలకు చేరుతుంది. ఇదంతా పాఠశాల యాజమాన్యం, ప్రభుత్వ వర్గాలకు తెలిసి జరుగుతున్న తంతే. కనుక ఫుడ్ పాయిజనింగ్ కేసులు వెలుగు చూసినప్పుడు ఎక్కడి దొంగలు అక్కడే గప్‌చుప్‌గా మారుతున్నారు. ఎవరో ఒకరిపై వేటువేసి పాపం కడుక్కుంటున్నారు తప్ప సమస్య మూలాలు గురించి ఆలోచన చేయడం లేదు. అందుకే పాఠశాల మధ్యాహ్నం భోజనం వర్కర్లు ఏ వారానికి ఆ వారం నాణ్యమైన సరుకు ప్రభుత్వమే నేరుగా అందజేయాలనే డిమాండ్‌ను ఇటీవల ముందుకుతెచ్చారు. అందులో న్యాయబద్ధత ఉంది. ఇక మధ్యాహ్న భోజనం వంట వారికి నెలకు తలకు వెయ్యి రూపాయలు హానరోరియం ఇస్తున్నారు. ఇటీవలనే రూ. 3 వేలకు పెంచారు. ఒక్కో మనిషి దినసరి కూలి రోజుకు 700 రూపాయలు ఉంటే మధ్యాహ్నం భోజనం ఏజెన్సీలు రోజుకు 100 రూపాయలతో మొత్తం భోజనాలకు జవాబుదారీ కావలసి వస్తుంది. వంట మనిషికి ఇచ్చే హానరోరియంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో భరిస్తాయి. అసలే ఉత్పత్తిలో మందులు వాడటం వలన బాయిలర్ కోడిగుడ్లు, చికెన్ ఆరోగ్యానికి హానికరం అనే భావన సమాజంలో విస్తృతమవుతున్న దశలో నాసిరకం గుడ్లు, నిల్వ ఉంచిన నాసిరకం చికెన్, మాంసం వండి వడ్డించడం వలన విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారు. దీనికి తోడు ఫ్రిజ్‌లో దాచిపెట్టిన ఆహార పదార్థాలు, సాంబారు లాంటివి తిరిగి వేడిచేసి పిల్లలకు పెట్టడం వలన సైతం ఫుడ్ పాయిజనింగ్ అవుతున్నది. వాడిన నూనెనే తిరిగి వంటల్లో వాడడం, ఇలాంటి నాణ్యత లేని, రుచి శుచి లేని ఆహారం తినలేకనే రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతం క్రమంగా పడిపోతున్నది. ఉద్యోగులకు పెరిగిన ధరల ప్రకారం ఏడాదికి రెండుసార్లు కరువు భత్యం ప్రకటిస్తున్న ప్రభుత్వం, ఆరేళ్ళ క్రితం రేట్లు ప్రకారం విద్యార్థులకు నిధులు కేటాయించడం ఎంత వరకు సబబు? కనీసం ఏడాదికి ఒకసారైనా రేట్లు రివిజన్ అవసరం కాదా! పైగా మధ్య దళారీ వ్యవస్థను సరఫరాదారుగా పెట్టి బాధ్యతనుండి తప్పుకోవడంతో ఆంతర్యం ఏమిటి? ఇవన్నీ పాలకవర్గం పాపాలు చిట్టాలోకి ఎందుకురావు? ఇంకా ప్రభుత్వ పాఠశాలల్లో తక్కువ మంది పిల్లలు ఉన్న సందర్భంలో కేవలం తలకు పది రూపాయల కేటాయింపులతో రూ. 5 గుడ్డుకుపోతే, కేవలం మిగిలిన 5 రూపాయలతో నూనె, ఉప్పు, పప్పు, కారం, కూరగాయలు కొనుగోలు, గ్యాస్ వినియోగం మధ్యాహ్న భోజనం ఏజెన్సీలకు వండివార్చడం తలకుమించిన భారం అవుతుంది. రెసిడెన్షియల్ పాఠశాలలు, కెజిబివిలు, బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీ వసతి గృహాలలో కూడా ఇవే సమస్యలు పునరావృతం అవుతున్నాయి. ఎదిగే పిల్లలకు సరైన పౌష్టికాహారం అందించే కనీస బాధ్యత ప్రభుత్వాలదే. కానీ, విద్యార్థుల భోజనాలు పర్యవేక్షణ సక్రమంగా లేకపోవడం కూడా మరో రకమైన సమస్యలకు కారణం అవుతున్నది. కనుక పెరుగుతున్న నిత్యావసర వస్తువులు, కూరగాయల ధరలు, రవాణా ఛార్జీలు, ప్రతి ఏటా రివిజన్ చేసి ఉన్నరేట్లు ప్రకారం యేఏడుకాయేడు విద్యార్థుల తలసరి కేటాయింపులు పాఠశాల పునర్ ప్రారంభానికి ముందే ఉత్తర్వులు ఇవ్వడంతో పాటు, భోజన ఏజెన్సీలకు నేరుగా ప్రభుత్వమే సరుకులు తాజాగా ఎప్పటికప్పుడు సరఫరా చేయాలి. రుచి, శుచిలో తేడా లేకుండా పర్యవేక్షణ కమిటీ లను సామాజిక భాగస్వామ్యంతో ఏర్పరచడం, అధికారులు కూడా విద్యతో పాటు భోజన లోటు పాట్లు గురించి విద్యార్థులను ఎప్పటికప్పుడు అడిగి తెలుసుకోవాలసిన అవసరం ఉంది .అంతేకాదు, ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, వార్డెన్లు విద్యార్థులతో కలిసి భోజనం చేసిన పక్షంలో మరింత నమ్మకం పెరిగి, మానిటరింగ్ ప్రక్రియ బాగుండే అవకాశం ఉంది. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, వసతి గృహ భోజనం వరం లాంటిది. కనుక సరైన లెక్కలో విద్యార్థులకు భోజనం అందించాల్సిన బాధ్యత మాత్రం ప్రధానంగా ప్రభుత్వానిదే? మధ్యాహ్న భోజనం, వసతి గృహాల్లో భోజనాలు అత్యవసర సేవలుగా భావించాలి. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం ఏజెన్సీలకు చెల్లించాల్సిన నిధులు కూడా నెలల తరబడి పెండింగ్‌లో పెట్టకుండా ఏ వారానికి ఆ వారం ఖర్చు చేసిన నిధులు వెంటనే అందజేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వ బడుల్లో, సంస్థల్లో ఫుడ్ పాయిజనింగ్ అరికట్టాలంటే సరుకులు సరఫరాలో నాణ్యత, ఎప్పటికప్పుడు తాజా భోజనం ఏర్పాట్లు, పెరుగుతున్న ధరల ప్రకారం ప్రతి ఏటా శాస్త్రీయంగా ధరలు నిర్ణయం చేసి తలసరి ఖర్చులు నిర్ణయం చేయడం, మధ్య దళారీ వ్యవస్థలను ఆహార పంపిణీలో తొలగించడం అనే చర్యలు ప్రభుత్వాలు చేయాల్సిన అత్యవసర పని కూడా. కనుక ఆ దిశగా ప్రభుత్వం అడుగులు వేసి విద్యార్థుల భోజన సౌకర్యాలలో భద్రతా లోపం తలెత్తకుండా చూడాల్సిన కనీస కర్తవ్యం కూడా ప్రభుత్వంపైనే ప్రధానంగా ఉంది.

# రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ బీసీల అంశంలో మోసం చేస్తున్నాయని మండిపడ్డ కేటీఆర్

**రేవంత్ రెడ్డికి కేసీఆర్ ఫోబియా పట్టుకుందని విమర్శ**
**రేవంత్ రెడ్డి చేస్తున్నది ముమ్మాటికి డ్రామానే**
**అధికారంలోకి వస్తే బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత ఇస్తామని చెప్పిన కాంగ్రెస్. రాహుల్ ప్రధానమంత్రి అయితేనే బీసీ రిజర్వేషన్లు అంటూ మోసం**



పరిగి నియోజకవర్గం నుంచి భారత రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్) పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలను తెలంగాణ భవన్‌లో వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్వాగతించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు గుప్పించారు.

**బీసీ రిజర్వేషన్ల పేరుతో కాంగ్రెస్ మోసం**

బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేస్తోందని కేటీఆర్ మండిపడ్డారు. 42% రిజర్వేషన్లు ఇచ్చి, వాటికి చట్టబద్ధత కల్పిస్తామని చెప్పి ఓట్లు వేయించుకున్నారని, ఇప్పుడు మాత్రం రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయిన తర్వాతే ఇస్తామని రేవంత్ రెడ్డి చెబుతున్నారని ఆరోపించారు. బీసీ డిక్లరేషన్‌లో ఈ షరతు ఉందా అని ప్రశ్నించారు. "గతంలో కేసీఆర్ ఢిల్లీకి వెళ్లి తెలంగాణ ఏర్పాటుతోనే తిరిగి వస్తానని ప్రకటించి రాష్ట్రాన్ని సాధించిండు. మరి రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్లి బీసీల రిజర్వేషన్లు సాధించిండా లేదా అనేది చెప్పాలి" అని కేటీఆర్ సవాలు విసిరారు.

**రేవంత్ రెడ్డికి కేసీఆర్ ఫోబియా**

ఢిల్లీకి వెళ్లిన తర్వాత కూడా రేవంత్ రెడ్డి కేసీఆర్ గురించే మాట్లాడుతున్నారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. "కేసీఆర్ పేరు తీయకుండా ఉండలేని మానసిక రుగ్మత రేవంత్ రెడ్డికి ఉన్నట్లు కనిపిస్తుంది. రేవంత్ రెడ్డికి కేసీఆర్ ఫోబియా పట్టుకుంది" అని విమర్శించారు. బీసీ రిజర్వేషన్ల పేరుతో కాలయాపన చేస్తున్న కాంగ్రెస్, బీసీ డిక్లరేషన్‌లోని ఇతర హామీలను పూర్తిగా పక్కన పెట్టిందని ఆరోపించారు.

**రేవంత్ రెడ్డి చేస్తున్నది అంతా 'డ్రామా'నే**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్నది అంతా డ్రామా అని కేటీఆర్ తీవ్రంగా ఆరోపించారు. "బీసీలను మోసం చేస్తున్నావు, డ్రామా చేస్తున్నావు అని నేనంటే... రేవంత్ రెడ్డి నన్ను మాటలు అంటున్నాడు" అని కేటీఆర్ పేర్కొన్నారు. మోదీతోనూ, రాహుల్ గాంధీతోనూ రేవంత్ రెడ్డి చేస్తున్నది డ్రామా అని ఆయన వ్యాఖ్యానించారు. చంద్రబాబు కోసం తెలంగాణ ప్రయోజనాలను పక్కన పెడుతూ ఆయన చేస్తున్నది డ్రామానేనని, అలాగే ప్రజలకు ఇచ్చిన 420 హామీల అమలు గురించి అడిగితే స్పందించకపోవడం కూడా డ్రామానే అని చెప్పారు. చివరికి కాంగ్రెస్ పార్టీలో చివరిదాకా ఉంటానని రేవంత్ రెడ్డి చెబుతున్న మాటలు కూడా డ్రామానే అని కేటీఆర్ మండిపడ్డారు. రేవంత్ రెడ్డి డ్రామాలు చేస్తూ ఇతరులను విమర్శిస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు.

**పార్టీ మారిన నేతల దౌర్భాగ్య పరిస్థితి**

"పార్టీ మారిన ఎమ్మెల్యేలు ఏ పార్టీలో ఉన్నారో చెప్పుకోలేని దౌర్భాగ్య పరిస్థితిలో ఉన్నారు" అని కేటీఆర్ అన్నారు. "కండువాలు కప్పుకొని ఇప్పుడు దేవుడి కండువాలు కప్పుకునమ్మని... ఏ పార్టీలో ఉన్నారో చెప్పుకోలేని పరిస్థితిలో ఉన్నారు" అని వ్యాఖ్యానించారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలు ఏ పార్టీలో ఉన్నారో రాష్ట్రంలో చిన్న పిల్లవాడిని అడిగినా చెప్తారని, కానీ శాసనసభ స్పీకర్ గారికి మాత్రం ఇంకా తెలియడం లేదని విమర్శించారు.

**స్థానిక సంస్థల ఎన్నికల్లో ఖర్చుకు కాంగ్రెస్ అడ్డగోలు నిధులు**

స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్నాయని, కాంగ్రెస్ నాయకులు గత 20 నెలలుగా సంపాదించిన 'అడ్డగోలు అవినీతి పైసలను' ప్రజలకు భారీగా పంచబోతున్నారని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అరాచకాలు తగ్గాలంటే, అధికారులు ప్రజల మాట వినాలంటే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని గెలిపించాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు.

**అన్ని వర్గాలను మోసం చేసిన కాంగ్రెస్**

కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అన్ని వర్గాలను మోసం చేసిందని కేటీఆర్ అన్నారు. తెలంగాణలో కరెంటు కోతలు, ఎరువుల కొరత, గ్రామాలు సంక్షోభంలోకి పోవడం, పట్టణాల్లో పాలన పడకేయడం వంటి అన్యాయాలు జరుగుతున్నాయని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం 10 సంవత్సరాల వెనక్కి కాంగ్రెస్ పాలనలో వెళ్లిపోతున్నదని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు పోగానే రైతుబంధును కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేస్తుందని ఆయన జోస్యం చెప్పారు. "తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేతిలో మోసపోని వ్యక్తి గానీ, వర్గం గానీ ఒక్కటి కూడా లేదు" అని ఆయన తీవ్ర స్థాయిలో విమర్శించారు.

**బీఆర్ఎస్ నేతలకు కేటీఆర్ పిలుపు**

గత పది సంవత్సరాలలో తెలంగాణ అభివృద్ధిపై మాత్రమే దృష్టి సారించామని, పార్టీ కార్యకర్తలకు తగినంత చేయలేకపోయామని కేటీఆర్ అంగీకరించారు. అయితే, మళ్లీ అధికారంలోకి రాగానే కార్యకర్తలను అన్ని విధాలుగా అభివృద్ధి పరుచుకుంటామని హామీ ఇచ్చారు. ప్రతి ఒక్క బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుల నుంచి మొదలుకొని ప్రతి కార్యకర్త వరకు తమ తమ పరిధిలో ఉన్న గ్రామాలలో స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీని గెలిపించేందుకు గట్టిగా కష్టపడాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. "తెలంగాణ ఉన్నంత కాలం గులాబీ కండువా ఉంటుంది... కాంగ్రెస్, బీజేపీ పార్టీలను మట్టికరిపించి మళ్లీ కేసీఆర్ గారిని ముఖ్యమంత్రిగా ఎన్నుకుంటాం" అని కేటీఆర్ తన ప్రసంగాన్ని ముగించారు.

# అప్రమత్తంగా ఉండండి.. సమన్వయంతో వ్యవహరించండి

**ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వాసులకు ఎలాంటి ఇబ్బంది రానీయొద్దు**
**వర్షాభావ పరిస్థితులు, వరద సహాయక చర్యలపై ఉన్నతస్థాయి సమీక్ష**
**అలసత్వం వహించొద్దని ఉన్నతాధికారులకు మంత్రి శ్రీధర్ బాబు హెచ్చరిక**



భారీ వర్షాల నేపథ్యంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వాసులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని సంబంధిత ఉన్నతాధికారులను జిల్లా ఇంఛార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశించారు. గురువారం రాత్రి వర్షాభావ పరిస్థితులు, వరద సహాయక చర్యలపై ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలోని కలెక్టర్లు, జీహెచ్ఎంసీ, జలమండలి, టీజీఎస్పీడీసీఎల్, సైబరాబాద్, రాచకొండ పోలీసు ఉన్నతాధికారులతో సమీక్షించారు. శేరిలింగంపల్లి, హైటెక్ సిటీ పరిసరాలు, సరూర్ నగర్, ఉప్పల్, షేక్ పేట్, కూకట్ పల్లి, బాలానగర్, మల్కాజ్ గిరి, బండ్లగూడ, నాగోల్, మూసీ నది పరివాహక ప్రాంతాల్లో వాస్తవ పరిస్థితిని అడిగి తెలుసుకుని మార్గనిర్దేశం చేశారు. కేవలం కార్యాలయాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ వాస్తవ పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, అందుకు అనుగుణంగా సిబ్బందికి సూచనలు, సలహాలు ఇవ్వాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. రాత్రిపూట కూడా విధులు నిర్వర్తించి, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. ప్రజలు తమ ఇబ్బందులను తెలియజేసేందుకు వీలుగా తక్షణమే కంట్రోల్ రూంలను ఏర్పాటు చేసి, వాటిపై ప్రసార, సామాజిక మాధ్యమాల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు. ట్రాఫిక్ కు ఇబ్బంది కలగకుండా రోడ్లపై నిలిచిన నీటిని వెంటనే తొలగించాలన్నారు. హైటెక్ సిటీ పరిసర ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి, అక్కడ నివసించే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి సిద్ధంగా ఉండాలన్నారు. అక్కడ వారికి కావాల్సిన అన్ని రకాల సదుపాయాలను కల్పించాలన్నారు. ప్రజలకు అత్యవసర సేవలు అందించడంలో ఏమాత్రం అలసత్వం వహించొద్దని హెచ్చరించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ప్రతి సమస్యకూ తక్షణ పరిష్కారం చూపించాలన్నారు. ఎలాంటి ఆందోళనకు గురి కావొద్దని ప్రభుత్వం మీ వెంట ఉందని, అవసరమైతే తప్ప బయటకు రావొద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# బీసీలకు 42శాతం రిజర్వేషన్ బిల్లు కోసం పోరాడుతాం: సీఎం రేవంత్‌రెడ్డి



న్యూఢిల్లీ, ఆగస్ట్ 7బీసీలకు 42శాతం రిజర్వేషన్ బిల్లు కోసం పోరాడుతామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. గురువారం దిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ బిల్లును రాష్ట్రపతి ఆమోదించేలా కేంద్రంపై ఒత్తిడి తెస్తున్నామన్నారు. రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ కోసం సాయంత్రం వరకు వేచి చూసా_మని వెల్లడించారు. రాష్ట్రపతి స్వతంత్రంగా నిర్ణయం తీసుకుంటా రని భావిస్తున్నామని చెప్పారు. ఆమె సమయం ఇవ్వలేదంటే ప్రధాని ఒత్తిడి చేసినట్టు భావించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. 42 శాతం రిజర్వేషన్ల అమలుకు ఉన్న మార్గాలన్నింటిని ప్రయత్నించామన్న కుదరనప్పుడు ప్రత్యామ్నాయ మార్గాల్లో స్థానిక ఎన్నికలకు వెళ్లాలన్నారు.

బీసీ రిజర్వేషన్ల అమలుకు తమ వద్ద 3 మార్గాలు ఉన్నాయని వెల్లడించారు. 50శాతం సీలింగ్‌పై గత ప్రభుత్వం తెచ్చిన చట్టాన్ని పక్కన పెట్టి జీవో ఇవ్వాలని అన్నారు. జీవో ఇస్తే ఎవరైనా న్యాయస్థానానికి వెళ్తే స్టే వస్తుందని, జీవో ఇచ్చి ఎన్నికలకు వెళ్లే మొదటి మార్గం సాధ్యం కాదని ఆయన వివరించారు. ఇప్పుడే స్థానిక ఎన్నికలు పెట్టకుండా ఆపడం రెండో మార్గమని చెప్పారు. స్థానిక ఎన్నికలు ఆపితే కేంద్రం నుంచి రావాల్సిన నిధులు ఆగుతాయన్నారు. కేంద్ర నిధులు రాకుంటే గ్రామాల్లో వ్యవస్థలు కుప్పకూలుతాయని వివరించారు. మూడవ మార్గం పార్టీ పరంగా బీసీలకు 42శాతం సీట్లు ఇవ్వడమని రేవంత్ అన్నారు. బీసీలకు 42శాతం సీట్లపై ఇతర పార్టీలపైనా ఒత్తిడి తెస్తామని ఆయన వెల్లడించారు.

**కేంద్రమంత్రి కిషన్? రెడ్డిపై ధ్వజం**

విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లలో మాత్రమే ఏబీసీడీ వర్గీకరణ ఉందని అన్నారు. రాజకీయ రిజర్వేషన్లలో ఉపవర్గీకరణ లేదని వెల్లడించారు. బీసీలందరికీ కలిపి 42 శాతం రిజర్వేషన్లు చేశామన్న ఆయన ఒక వర్గానికి ప్రత్యేకంగా రిజర్వేషన్లు లేవని వివరించారు. కిషన్‌రెడ్డి అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని అన్నారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ముందుగా చట్టం చదవాలి అని హితవు పలికారు. రాజకీయంగా ఓబీసీ రిజర్వేషన్లలో వర్గీకరణ లేదని ఆయన తెలిపారు. బీసీ-ఈ వర్గానికి ఇప్పటికే 4శాతం రిజర్వేషన్లు ఉన్నాయన్నరు కొత్తగా 10 శాతం రిజర్వేషన్లు ఎక్కడి నుంచి వచ్చాయని ప్రశ్నించారు.ఏఐసీసీ అధ్యక్షుడితో భేటీ ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేతో పార్లమెంటులో రాజ్యసభ విపక్షనేత ఛాంబర్?లో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు భేటీ అయ్యారు. ఈ కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్?బాబు, పొంగులేటి శ్రీనివాస్?రెడ్డి, కొండా సురేఖ, వివేక్?, అడ్లూరి లక్ష్మణ్?, పొన్నం ప్రభాకర్, సీతక్క, జూపల్లి కృష్ణారావులు పాల్గొన్నారు.

**వారి కుట్రలు సాగనివ్వం**

బీసీ రిజర్వేషన్ల కోసం తుదివరకు పోరాడతామని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. దిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. గాంధేయ పద్ధతిలో పోరాడి అనుకున్నది సాధిస్తామని వివరించారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి లాంటి వారి కుట్రలను సాగనివ్వమని పొన్నం ప్రభాకర్? తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ చావుతప్పి కన్నులొట్టబోయిన చందంగా గెలిచిందని ఎద్దేవా చేశారు. ఉత్తరాదిలో చాలా రాష్ట్రాల్లో బీసీలు ఆ పార్టీని తిరస్కరించారని పొన్నం చెప్పారు. రిజర్వేషన్లు పెంచకుంటే వచ్చే ఎన్నికల్లో బీజేపీ ఓటమి ఖాయమని ఆయన జోస్యం చెప్పారు.

# ప్రపంచ దృష్టిని ఆకర్షించిన ఆగస్టు విప్లవం

భారతదేశ స్వాతంత్ర్య సమరంలో దేశవ్యాప్తంగా శ్వేతజాతీయుల పాలనకు వ్యతిరేకంగా చేపట్టిన “ఆగస్టు విప్లవం”గా పేరు గాంచిన అహింస, అవిధేయత యుత ఉద్యమం ప్రపంచ ప్రజల దృష్టిని ఆకర్షించింది. భారత జాతీయ ఉద్యమం అనేకానేక దేశాల వలస పాలనకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమాలకు ఉత్తేజకంగా నిలిచింది. 1867లో దాదాభాయి నౌరోజి ఈస్ట్ ఇండియా కంపెనీ (భారతీయ తూర్పు సంఘం) స్థాపించారు. సురేంద్రనాథ్ బెనర్జీ ఇండియన్ నేషనల్ అసోసియేషన్ (భారత జాతీయ సంఘం)ను స్థాపించడం జరిగింది. పదవీ విరమణ చేసిన బ్రిటన్ ప్రభుత్వ ఉద్యోగి ఆలన్ హ్యూమ్ ప్రోత్సాహంతో ముంబాయిలో సమావేశమైన 73 మంది భారత ప్రతినిధులు, భారత జాతీయ కాంగ్రెస్ కు అంకురార్పణ గావించారు. పాశ్యాత్య విద్యాభ్యాసకులైన వారు, పాత్రికేయ, విద్యారంగ ప్రముఖులు, కాంగ్రెస్ పార్టీలో సిద్ధాంతాలు లేకుండా బ్రిటిష్ పాలన పట్ల సానుకూలత వ్యక్త పరిచారు. తమ తీర్మానాలను వైస్రాయ్, కొన్ని సార్లు బ్రిటిష్ పార్లమెంటుకు పంపడానికి పరిమితమైనారు. నిజానికీ కాంగ్రెస్ నాడు నగరాలలో నివసించిన శిష్ట జన వర్గానికి మాత్రమే పరిమితమైంది. కాంగ్రెస్ వాదులు తమను తాము స్వామి భక్తులుగా భావిస్తూ, బ్రిటిష్ సామ్రాజ్య భాగంగానే, తమ దేశ పరిపాలనలో భాగస్వామ్యాన్ని ఆశించి మాత్రమే, కార్యకలాపాలు కొనసాగించారు. దాదాభాయి నౌరోజీ బ్రిటీషు వారి హౌస్ ఆఫ్ కామన్స్ కు పోటీ చేసి, గెలిచిన “ప్రప్రథమ భారతీయుని”గా నిలిచారు. తిలక్ మొదటి సారిగా “స్వాతంత్ర్యం నా జన్మ హక్కు” అని ఎలుగెత్తి నినదించిన జాతీయ వాది. తిలక్, భారతీయ సంస్కృతిని, చరిత్రను, విలువలను నిర్లక్ష్యం చేస్తూ, కించపరిచిన బ్రిటిష్ విద్యా వ్యవస్థను తీవ్రంగా నిరసించారు. జాతీయ వాదులకు భావ ప్రకటనా స్వేచ్ఛ లేకుండడాన్ని సహించ లేక పోయాడు. అందుకే స్వరాజ్యమే ఏకైక మార్గమని నమ్మాడు. ప్రజలు , బ్రిటిష్ వారిపై తిరగబడడమే స్వరాజ్య సాధనా మార్గమని విశ్వసించాడు. బిపిన్ చంద్ర పాల్, లాలా లజపతిరాయ్ లు, తిలక్ ను సమర్పించారు. లాల్, బాల్, పాల్ జాతీయ వాదానికి రూపు రేఖల కల్పనలో కృతకృత్యులు కావడం, గాంధీజీ దక్షిణ ఆఫ్రికా నుండి భారత్ రాక, అనంతర సత్యాగ్రహ ఉద్యమ ఆచరణ , అహింసా పూరిత సహాయ నిరాకరణ ఉద్యమ ఫలితంగా లక్షలాది మంది భారతీయులలో పోరాట స్ఫూర్తిని తేగలిగింది. 1919 ఏప్రిల్ 13 నాటి ఆందోళన , జలియన్ వాలా బాగ్ (అమృత్సర్ మారణకాండ) దురంతం డయ్యర్ నేతృత్వంలో 1651 రౌండ్ల కాల్పులకు379 మంది మరణించినట్లు, 1137 మంది గాయాల పాలైనట్లు బ్రిటిష్ అధికారుల, 1499 మంది మృతి చెందిన, భారతీయుల అంచనా సంఘటన, దేశవాసులు క్రోధాగ్నికి రగిలింప చేసింది. మొదటి సహాయ నిరాకరణ 1920 లో స్వరాజ్య సాధనా లక్ష్యంతో కాంగ్రెస్ పునర్ వ్యవస్థీకరణ, 1922 లో గాంధీ 2 ఏళ్ల కారాగార వాసం, 1928లో సైమన్ కమిషన్ సిఫార్స్ తిరస్కరణ, భారత రాజ్యాంగ నిర్మాణానికి, మోతీలాల్ నెహ్రూ ఆధ్వర్యంలో ముసాయిదా సంఘ ఏర్పాటు, 1929 డిసెంబర్ లోగా స్వపరి పాలన హోదా ఇవ్వకుంటే, సత్యాగ్రహ ఉధృత తీర్మానాలు , పెరిగిన రాజకీయ అసంతృప్తి , లాహోర్ లో జరిగిన చారిత్రాత్మక సమావేశంలో సంపూర్ణ స్వతంత్ర సాధన పిలుపుకు క్రమానుగత హేతువులైనాయి. 1930 జనవరి 26న దేశం మొత్తం సంపూర్ణ స్వాతంత్ర్య దినం పాటించాలని నిర్ణయమైంది. దేశ రాజకీయ వాదులు , విప్లవకారులు ఒక్కటి కావడానికి ఈ నిర్ణయం కారణభూతమైంది. 1930 మార్చి 22 నుంచి ఏప్రిల్ 6 వరకు ఉప్పు సత్యాగ్రహంగా విలువబడే 400కి.మీ.ల కాలినడక దండియాత్ర, 1931లో గాంధీ – ఇర్విన్ ఒప్పందం కుదిరినా, భగత్ సింగ్ ఆయన ఇరు సహచరులు సుఖదేవ్, రాజ గురులకు మరణ శిక్షలతో దేశవ్యాప్త నిరసనలు వెల్లువెత్తాయి. 1932 లో గాంధీ తిరిగి సత్యాగ్రహాన్ని చేపట్టారు. అనంతర పరిణామాలలో ఇలా దశాబ్దకాలం పాటు కొనసాగిన వివిధ రూప ఆందోళనలు, సత్యాగ్రహాలు, నిరసనలు, బాంబుల దాడులు, దహనాలు క్రమంలో 1942 ఆగస్టు,8 న చారిత్రాత్మక సంఘటనలో ముంబాయి గొవాలియా బ్యాంక్ మైదానంలో “కరో యా మరో” అని నినదించిన గాంధీజీ, భారత దేశం విడిచి పోవాలని (క్విట్ ఇండియా ) హెచ్చరిక జారీ చేస్తూ, ఉద్యమ ఉధృతికి శ్రీకారం చుట్టారు. ఆగస్టు 9న ఉద్యమం ప్రారంభమైంది. సుదీర్ఘ అహింసాయుత ఉద్యమాల ఫలితంగా 1947 ఆగస్టు 15న భారతీయుల చిరకాల స్వప్నం సాకారమైంది. స్వాతంత్ర్యం సిద్ధించింది.

# సామాజిక జీవితాన్ని అక్షరబద్ధం చేసిన యశోదారెడ్డి

ఆమె తెలంగాణ గర్వించ దగిన సాహితీ మూర్తి. తెలంగాణ సజీవ భాషను తన రచనల్లో వాడి పలువురి మన్ననలు పొందిన సాహితీవేత్త. ఆకాశవాణిలో తెలంగాణ మాండలికంలో ప్రసంగం చేసిన తొలి రచయితగా పేరు గడించారు. తెలుగు ప్రాచీన సాహిత్యంపై ఆమె చేసిన ప్రసంగాలు బహు పండిత ప్రశంసా పాత్రాలు అయినాయి. ఆమె పలు రచనలు మన్ననలకు నోచుకున్నాయి. ఆమే ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షురాలుగా పని చేసి గుర్తింపు పొందిన పాకాల యశోదారెడ్డి. “పాకాల యశోదారెడ్డి సంస్కృతాంధ్ర భాషల్లో విదుషీ మణి, పరిశోధకురాలు, సాహిత్య విమర్శకురాలు. వచన కవిత్వం కూడా వ్రాసారు. ఆమె వేదికలమీద అనర్గళంగా ఉపన్యసించి మంచి వక్తగా పేరు తెచ్చుకున్నారు. ఆమె వాగ్ధాటికి శ్రోతలు తన్మయులయ్యే వారు. అచ్చమైన తెలుగు, సుదీర్ఘమైన సంస్కృత సమాసాలతో కూడిన ప్రసంగాలు విన ఇంపుగా ఉండేది. ఆమె దివాకర్ల వేంకటవధాని శిష్యురాలు. 1950 దశకారంభం నుంచే ఆమె ఆలిండియా రేడియోలో “మహాలక్ష్మి ముచ్చట్లు” అని వినిపించేది. యశోదా రెడ్డి (ఆగష్టు 8, 1929 – అక్టోబర్ 7, 2007) ప్రముఖ రచయిత్రి. ఉస్మానియా విశ్వ విద్యాలయం తెలుగు శాఖలో ఆచార్యులుగా పనిచేసి, పదవీ విరమణ గావించారు. పలు సాహిత్య విమర్శనా గ్రంథాలు రాశారు. కథా సంపుటాలను వెలువరించారు. పాకాల యశోదారెడ్డి 1929, ఆగష్టు 8 న పాలమూరు జిల్లా ( నాగర్‌కర్నూల్ జిల్లా), బిజినేపల్లిలో సరస్వతమ్మ, కాశిరెడ్డి దంపతులకు ఆమె జన్మించారు. యశోదారెడ్డి మూడవ తరగతి వరకు మహబూబ్ నగర్ లో, ఉన్నత పాఠశాల విద్యను హైదరాబాద్, నారాయణగూడ లోని బాలికల ఉన్నత పాఠశాలలోను పూర్తి చేశారు. రాజబహద్దూర్ వెంకట్రామిరెడ్డి ప్రోత్సాహంతో కళాశాల విద్య కొసాగించి, ఉస్మానియా విశ్వ విద్యాలయం నుండి తెలుగు, సంస్కృత భాషలలో స్నాతకోత్తర విద్య పూర్తి చేశారు. జర్మన్ భాషలో, భాష శాస్త్రంలో డిప్లొమా చేశారు. ఉస్మానియా విశ్వ విద్యాలయం లోనే తెలుగులో హరివంశాలు” అను అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ పట్టా పొందారు. 1976లో అలీఘర్ విశ్వ విద్యాలయం నుండి డి.లిట్ అందుకున్నారు. యశోదారెడ్డికి హిందీ, ఉర్దూ, కన్నడ భాషల్లో ప్రావీణ్యంతో పాటు, జర్మన్ భాష తో కూడా పరిచయం ఉండేది. ఆమె భర్త ప్రపంచ ప్రఖ్యాత చిత్రకారుడు పి. టి. రెడ్డి గా సుపరిచితులైన పాకాల తిరుమల్ రెడ్డి. జె.జె.ఆర్ట్ కళాశాలలో చదువుకుని, కొన్నాళ్ళు లాహోర్లో పనిచేసి హైదరాబాదు తిరిగి వచ్చిన తిరుమలరెడ్డి, ఆమె వక్తృత్వ ప్రతిభను చూసి, పి.టి.రెడ్డి ఆకర్షితుడై 1947లో ప్రేమ వివాహం చేసుకున్నారు. తిరుమల్ రెడ్డి గీసిన అనేక చిత్రాలకు ఆమే స్ఫూర్తి. యశోదారెడ్డి కూడా స్వతహాగా కళాపిపాసి. ఆమె రకరకాల ఇత్తడి విగ్రహాలను హాబీగా సేకరించే వారు. పి.టి రెడ్డి సాంగత్యంతో వాటిలోని కళానైపుణ్యాన్ని, వైటభవాన్ని ఆమె గుర్తించ గలిగేవారు. భర్త చిత్రకళా ప్రదర్శన ఏర్పాటు చేసినపుడు ఒక కార్యకర్తగా పని చేసి అది విజయవంతం అయ్యేందుకు దోహదపడేది. 1955లో హైదరాబాద్, కోఠి మహిళా కళాశాలలో అధ్యాపకురాలిగా ఉద్యోగ జీవితం ప్రాంభించారు. తరువాత రీడర్‌గా, ప్రొఫెసర్‌గా ఉస్మానియా విశ్వ విద్యాలయంలో పనిచేసి, ఎందరో పరిశోధకులకు మార్గదర్శియై, 1989లో పదవీ విరమణ పొందారు. ఆమె ధర్మశాల, ఎచ్చమ్మ కథలు తదితర కథా సంపుటాలను వెలువరించారు. యశోదా రెడ్డి వందకు పైగా కథలు వ్రాసినా వాటిలో 63 మాత్రమే పుస్తక రూపంలో రావడం జరిగింది. ఆమె ప్రచురించిన మూడు కథా సంపుటాల్లో, మావూరి ముచ్చట్లు (1973) కథా సంపుటి 1920–40 నాటి తెలంగాణ గ్రామీణ జీవన విధానాన్ని చిత్రీకరిస్తే, ఎచ్చమ్మ కథలు (1999) 1950–70 నాటి తెలంగాణ సంస్కృతికి ప్రతీకలు, ధర్మశాల (2000) కథా సంపుటి 1980–1990 నాటికి తెలంగాణ సమాజంలో వచ్చిన మార్పులకు దర్పణం పట్టింది. ఈ మూడు కథా సంపుటాల్లో ఈమె తెలంగాణ భాషను, యాసను, సంస్కృతిని, సామాజిక జీవితాన్నిఅక్షర బద్ధం చేశారు. మావూరి ముచ్చట్లు, ఎచ్చమ్మ కథలు, పాలమూరు జిల్లా మాండలికంలో వ్రాస్తే, ధర్మశాల కథా సంపుటిని మాత్రం వ్యవహారిక తెలుగు భాషలో లిఖించారు. యశోదారెడ్డి కథలు తెలంగాణ జనజీవన సంస్కృతిను, తెలంగాణా మాండలిక నుడికారానికి అద్దం పడతాయి. ఎచ్చమ కథలకు ముందుమాటలో “ఒక జాతి సంస్కృతిలో ఆ జాతి జీవన విధానం ప్రతిఫలిస్తుంది. ఈ సంస్కృతీ సర్వస్వం ఆ జాతి భాషలో నిక్షిప్తమై జీవిస్తుంది. ఆ భాష ఆ జాతికి ప్రత్యేకమైన ఆచార వ్యవహార, ఆర్థిక, రాజకీయ, సామాజిక మూలధాతువులను జీర్ణించుకొని రససిద్ధిని పొంది జాతీయాల్లో, పలుకుబళ్లలో, సామెతల్లో పొందుపడి ప్రభుత్వాన్ని నెరుపుతుంది. ఒక భాషలో ఒక నానుడి కానీ, సామెత కానీ, జాతీయం కానీ అలవోకగా పుట్టదు. ఆయా జాతీయులు, తలలు పండినవారి అనుభవాన్ని వీడబోసి నిగ్గుదేల్చిన సారమే ఈ నుడికారపు ఇంపుసొంపులు. అందుకే అవి భాషకు జీవనాడి. ప్రాణ ధాతువుల వంటివి అని అభిప్రాయడిన యశోదారెడ్డి...తన కథల నిండా తెలంగాణ నుడికారపు సొంపులకు పెద్దపీట వేశారు. యశోదారెడ్డి కథారచయిత్రిగానే కాకుండా కవయిత్రిగా కూడా ప్రసిద్దులే. ఆమె రాసిన కవితలు అనేక పత్రికలలో ముద్రించ బడ్డాయి. స్వయంగా తానే తన కవితలను ‘ ఉగాదికి ఉయ్యాల , భావిక అనే రెండు సంపుటాలగా వెలువ రించారు. మలేషియాలో జరిగిన తెలుగు సమ్మేళనంలో కవయిత్రిగా పాల్గొని, ప్రశంసలందు కున్నారు. పారిజాతా పహరణం, ఉత్తర హరివంశం, తెలుగు సామెతలు, ఆంధ్ర క్రియా స్వరూపమణి దీపిక మొదలగు పుస్తకాలకు సంపాదకత్వం వహించి, విలువైన పీఠికలను రాసి, వెలువరించారు. ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ, లలిత కళా అకాడమీ, సంగీత అకాడమీలలో సభ్యురాలిగా పని చేశారు. ఆంధ్ర సారస్వత పరిషత్, జానపద కళా సాహిత్య సంస్థలతో ఆమెకు అనుబంధం ఉండేది. యశోదారెడ్డి 2007, అక్టోబర్ 7 న హైదరాబాదులో మరణించారు.

# మహిళలకు స్ఫూర్తి ప్రదాత

శతాబ్దాల శ్వేత జాతీయుల పాలనలో అష్టకష్టాలు అనుభవించి, ఆంగ్లేయుల దాస్య శృంఖలాలను తెంచు కునేందుకు ఎందరో పోరాట పటిమను, తెగువను చూపించారు. భారత స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను సైతం అర్పించారు. తమ సర్వస్వం స్వాతంత్ర సాధనకోసం త్యాగం చేసిన వారు ఎందరో ఉండగా, మగ వారితో సమానంగా కొంత మంది మహిళలు కూడా తెగించి స్వేచ్ఛా భారతం కోసం పోరాటం సల్పిన ఘన చరిత్ర ఉంది. సాంప్రదాయాలకు, కట్టుబాట్లకు అధిక ప్రాముఖ్యత ఇచ్చే రోజుల్లో మహిళలు స్వతంత్ర పోరాటంలో పాల్గొని భారతదేశ పౌరుషాన్ని చాటిన సందర్భాలు మరచి పోలేనివి. తాము అబలలము కామని, త్యాగాలకు వెరవమని నిరూపించి, తెగించి బ్రిటీషర్లతో పోరాడారు. స్వాతంత్ర్య పోరాటంలో భాగస్వాము లయ్యారు. అలాంటి వారిలో ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధురాలు, సంఘ సేవకు రాలు సూర్యదేవర రాజ్యలక్ష్మీ దేవి ముఖ్యులు. సూర్యదేవర రాజ్యలక్ష్మీదేవి (మే 18, 1914 – ఆగష్టు 8, 2010) కృష్ణాజిల్లా నందిగామ తాలూకా వీరుల పాడులో మే 18, 1914లో వాసిరెడ్డి సీతా రామయ్య, సుబ్బమ్మ దంపతులకు జన్మించారు. ఆమె గురువు అతను కవి, పండితుడు జంగా హనుమ య్య చౌదరి ఉత్తమ విషయ పరిజ్ఞానాన్ని బోధించి, విద్వత్తు కలిగించారు. సూర్య దేవర నాగయ్యతో రాజ్యలక్ష్మీ దేవికి పదేళ్ళ వయస్సులో వివాహ మై, ఆమెక 16 ఏళ్ళకు అత్తవారింటికి వచ్చేవరకు విద్యా వ్యాసంగాలు కొన సాగించారు. వీరులపాడులో గ్రంథాలయాన్ని వినియోగించు కుని, తాపీధర్మారావు, కందుకూరి వీరేశలింగం పంతులు, గురజాడ అప్పారావు, త్రిపురనేని రామ స్వామి చౌదరి వంటి సంఘ సేవకులు రచించిన గ్రంథాలను రాజ్యలక్ష్మీదేవి ప్రతి రోజూ తెచ్చుకుని చదివి అవగాహన చేసుకునేవారు. ఇవన్నీ ఆమెలో స్వతంత్ర్య భావాలను, స్వేచ్ఛాభిలాషను పెంచాయి. 1920లో గాంధీజీ ఇచ్చిన పిలుపు విని దేశసేవకు నడుం బిగించారు. 1930లో ఉప్పు సత్యా గ్రహంలో పాల్గొనాలని అనుకున్నా, ఆమె జెట్కలుశిక్ష అనుభవించటానికి, సత్యా గ్రహం చేయటానికి భర్త, ఇంట్లో పెద్దలు అంగీకరించలేదు. రాట్నంపై నూలు వడకటం, హిందీ నేర్చుకోవటం, ఖాదీ ధారణ అక్కడ పరిపాటి. ఉద్యమం ప్రచారం చేస్తూ రాజ్యలక్ష్మీదేవి దగ్గర బంధువెట్కన అన్నపూర్ణమ్మతో శాసనోల్లంఘన చేయతల పెట్టారు. జాతీయ గీతాన్ని ఆలపిస్తూ శాసనధిక్కార నినాదాలు ఊరేగింపుగా వెళ్లగా పోలీసులు అరెస్టు చేశారు. శిక్ష గురించి న్యామూర్తుల ఇళ్ళలో సైతం స్త్రీలు వీరికి అండగా నిలవడంతో ఆ శిక్ష రద్దు చేసి నామమాత్రపు శిక్షను విధించగా, రాజ్యలక్ష్మీదేవిని రాయవేలూరు జెట్కలుకు తరలించారు. రాజ్యలక్ష్మి ఖాదీ ప్రచారం, మహిళా ఉద్యమం, రాజకీయ కార్యకలాపాలు కొనసాగిస్తూ, కష్టపడి చదివి రాష్ట్రభాష పరీక్షలో ఉత్తీర్ణత సాధించారు.అస్పృశ్యతా నివారణ కోసం ఆమె తన వంతు కృషి చేశారు. హరిజన స్త్రీలను అందరితో పాటు గౌరవించేవారు. 1940లో వ్యక్తి సత్యాగ్రహం ఆరంభమైంది. గుంటూరు జిల్లాలో ఆ సత్యా గ్రహం చేయడానికి అనుమతి లభించిన తొలిస్త్రీ రాజ్యలక్ష్మి. 1941 జనవరి 30లో బాపట్ల తాలూకాలోని బ్రాహ్మణ కోడూరులో ఆమె సత్యాగ్రహం చేశారు. పోలీసులు అరెస్ట్ చేసి, రెండు నెలల జెట్కలు శిక్ష, వందరూపాయల జరిమానా విధించారు. ఆమె జెట్కల నుండి విడుదలెట్క మద్రాసులోని ఆంధ్ర మహిళా సభకు చేరుకున్నారు. తరువాత తెనాలి వెళ్ళి ట్యుటోరియల్ కాలేజిలో చేరి బెనారస్ మెట్రిక్యులేషన్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించారు. ఆమె చేబ్రోలు కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఉండి మహిళా భ్యున్నతికి దేశాభ్యు దయానికి పాటు పడ్డారు. క్విట్ ఇండియా ఉద్యమంలో రాజ్యలక్ష్మీదేవిని శాసనధిక్కార శాఖ సభ్యురాలిగా నియమించారు. ఆమె రహస్యంగా జిల్లాలన్నీ తిరిగి ప్రజలచే శాసన ధిక్కారం చేయించారు. పోలీసుల నుండి ఆమెను దేశభక్తులు కాపాడే వారు. రాజ్యలక్ష్మీదేవి 1941లో చేబ్రోలులో జాతీయ మహిళా విద్యాలయాన్ని స్థాపించారు. ఆ తరువాత అక్టోబరు 1945లో ఆంధ్ర రాష్ట్ర మహిళా రాజకీయ పాఠశాలను ప్రారంభించారు. భారత దేశానికి 1947 ఆగష్టు 15వ తేదీన స్వాతంత్ర్యం సిద్ధించినా, నెట్కజాము ఏలు బడిలో ఉన్న వారికి విముక్తి కలగలేదు. రాజ్యలక్ష్మీదేవి విరాళాలు, చందాలు పోగుచేసి నెట్కజాం వ్యతిరేక పోరాట నాయకు లకు తమ సంఘీభావాన్ని తెలిపారు. రాజ్యలకీదేవి వ్యక్తి గతంగా నెట్కజాం వెళ్ళి ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. హైదరాబాదు సంస్థానం స్వతంత్ర భారత దేశంలో విలీనమయ్యే వరకు ఆమె అక్కడి వారితో కలసి పోరాటం సాగించారు. 1950లలో తెలుగు దేశం అనే పత్రిక నడిపారు. మహిళాభ్యుదయ సంస్థలో మల్లాది సుబ్బమ్మ తదితరు లతో కలిసి మద్యపానానికి వ్యతిరేకముగా పోరాటం చేశారు. రాజ్యలక్ష్మి ఆగష్టు 8, 2010 న మరణించారు.

## వరదాయిని వరలక్ష్మీ దేవి

“నమస్తేస్తు మహామాయే, శ్రీపీతే సుర పూజితేబీ శంఖ చక్ర గదా హస్తే, మహాలక్ష్మీ క నమోస్తుతే”. శంఖ చక్ర గద ధారణియైన మహా లక్ష్మీ దేవి సంపద, భూమి, శిక్షణ, ప్రేమ, కీర్తి, శాంతి, సంతోషం, శక్తి లాంటి అష్టైశ్వర్య ప్రదాయిని. అష్టసంపదలు ఒసంగే జగన్మంగళ దాయిని. అష్టైశ్వర్యాలు కలుగజేసే రూపం వరలక్ష్మిగా ఆరాధనీయం. కొలిచిన వారికి కొంగు బంగారమై వరాలనిచ్చే జగజ్జనని వరలక్ష్మి.

అన్ని లక్ష్మీ పూజల కన్నా, వరలక్ష్మీ పూజ ఉన్నతమైనదని శాస్త్ర వచనం. వరలక్ష్మీ దేవత విష్ణు మూర్తి భార్య. వైకుంఠ నాథుని జన్మ నక్షత్రమైన శ్రవణ నక్షత్రంతో కూడిన పౌర్ణమి కల శ్రావణ మాసంలో వరలక్ష్మిని ఆరాధిస్తే, విశేష ఫలమని భావన. ఆయురారోగ్య ఐశ్వర్య సంతోషాదులు లక్ష్మీదేవిని అత్యంత ప్రియమైన శుక్రవారం పూజిస్తేనే కలుగుతాయని శ్రీ సూక్తం వివరిస్తున్నది. వరలక్ష్మిని షోడ శోపచార పూజలతో సేవిస్తే, అష్ట ఐశ్వర్యాలు, అయిదవతనం, సత్సంతానం, సంతానాభివృద్ధి కలకాలం ఉండగలవని శాస్త్ర వచనాలు. సకల కోరికెలు ఈడేరాలని, సర్వమంగళ సంప్రాప్తి కలగాలని, నిత్య సుమంగళిగా వర్ధిల్లాలని ఈ వ్రతాన్ని వివాహితులు వ్రతాన్ని ఆచరిస్తారు. వరాలు యిచ్చే దేవతగా వరలక్ష్మీ దేవిని కొలుస్తారు. ఈ పూజలు ఆంధ్ర ప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో అధికంగా స్త్రీలు కొలుస్తారు. ఈ పండగను ముఖ్యంగా వివాహమైన మహిళలు నిర్వహిస్తారు. శ్రావణ శుక్ల పక్షంలో పౌర్ణమికి ముందు అరు దెంచే శుక్రవారం సువాసినులు వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించడం హిందూ సంప్రదాయం మంచి భర్త, సత్సంతానం కలుగాలని అమ్మాయిలు పూజిస్తారు. ఈ రోజున దేవతను పూజిస్తే అష్టలక్ష్మీ పూజలకు సమానం అనే నమ్మకంతో కుటుంబ సభ్యులు కూడా పాలుపంచు కుంటారు. దేవతను పూజిస్తే అష్ట ఐశ్వర్యాలు... సంపద, భూమి, శిక్షణ, ప్రేమ, కీర్తి, శాంతి, సంతోషం, శక్తి వంటివి లభిస్తాయని ప్రగాఢ విశ్వాసం. కైలాస నాథుడు, పార్వతీదేవికి వరలక్ష్మీ వ్రతాచరణ గురించి వివరించినట్లు స్కంద పురాణంలో ఉంది. లోకంలో స్త్రీలు సక లైశ్వర్యాలు, పుత్రపౌత్రాదులను కలిగేందుకు ఏదైనా వ్రతం గురించి తెలపాలని పార్వతీ దేవి, పరమ శివుని కోరగా, వరలక్ష్మీ వ్రతాన్ని అభయంకరుడుదైన శంకరుడు వివరించారు. ఈ సందర్భంలోనే భర్తపట్ల ఆదరాన్ని అత్తమామల పట్ల గౌరవాన్ని ప్రదర్శించిన మగధ రాజ్య అంతర్గత కుండిన నగర వాసియైన పరమ సాధ్వి చారుమతి ఉత్తమ ఇల్లాలిగా ప్రవర్తించిన నేపథ్యాన్ని వివరించారు. మహాలక్ష్మిని చారుమతి చిత్తశుద్ధితో పూజించిన క్రమంలో వర లక్ష్మి ఆమెకు స్వప్న సాక్షాత్కారమై, శ్రావణ పౌర్ణమి ముందు వచ్చే శుక్రవారం తనను ఆరాధిస్తే, కోరిన వరాల్ని ఒసంగెదనని వరమిచ్చినట్లు కథనం. ముందుగా గణపతిని పూజించి కలశం లోనికి అమ్మవారిని ఆవాహన గురించి షోడశోపచార పూజ, అథాంగ పూజ చేయాలి. శరణ్యే త్రయంబకే దేవీ నారాయణి నమోస్తుతే”!! అంటూ పూజ చేయాలి. అష్టోత్తర శత నామాల యుక్త దూప, దీప, నివేదన, తాంబూలాలను సమర్పించి, కర్పూర నీరాజనం, మంత్రపుష్పం, మంగళ హారతి సమ ర్పణ గావించి, తొమ్మిది దారపు పోగులతో తొమ్మిది ముడులను వేసి, మధ్యన పంచ పుష్పాలు కట్టి తోర గ్రంధి చేసి తోర గ్రంధి పూజ, తోర గ్రంధి మంత్ర పఠనం చేయాలి. “లక్ష్మీం క్షీరసముద్ర రాజ తనయాం, శ్రీరంగ ధామేశ్వరీం, దాసీభూత సమస్త దేవ వనితాం లోకైక దీపాంకురాం, శ్రీమన్మంద కటాక్ష లబ్ధ విభవ, బ్రహేంద్ర గంగాధరాం, త్వాం త్రిలోక్య కుటుంబినీం సరసిజాం, వందే ముకుంద ప్రియాం” అని స్తుతించాలి. నవ సూత్ర ధారణను కుడి చేతికి చేయాలి. ఫలభక్ష్య పానీయ పాయసాదులను అమ్మవారికి సమర్పించి, చివరగా వాయన దాన మంత్రంతో ముత్తయిదువను మహాలక్ష్మిగా భావించి, తాంబూలం అందించాలి. భక్తితో వేడుకొంటే వరాలందించే తల్లి వరలక్ష్మీ దేవి. వరలక్ష్మీ వ్రతం చేసినను, ఈ వ్రతం చేసినప్పుడు చూసినా కూడా సకల సౌభాగ్యాలు, సిరిసంపదలు, ఆయురారోగ్యైశ్వర్యాలు కలిగుతాయని సూత మహాముని శౌనకాది మహర్షులకు వివరించినట్లు పురాణ కథనం. ఈ వ్రతాన్నిఆచరించడానికి ఏ నిష్ఠలు, నియమాలు, మడులు అవసరం లేదు. నిశ్చలమైన భక్తి, ఏకాగ్రచిత్తం ఉంటే చాలు. వరలక్ష్మీవ్రతం ఎంతో మంగళకరమైంది. ఈ వ్రతాచరణ వల్ల లక్ష్మీదేవి కృప కలిగి సకల శుభాలు కలుగుతాయి. సంపదలంటే కేవలం ధనం మాత్రమేకాదు. ధాన్య సంపద, పశు సంపద, గుణ సంపద, జ్ఞాన సంపద మొదలైనవి ఎన్నో ఉన్నాయి. ‘వర’ అంటే శ్రేష్ఠమైన అర్థం కూడా ఉంది.

## క్యూ ఆర్ కోడ్ తో సేవలు

ఖమ్మం, ఆగస్టు 7, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ప్రజల సమస్యల పరిష్కారానికి వినూత్నంగా క్యూఆర్ కోడ్ ఆధారిత ఆన్‌లైన్ పోర్టల్‌ను ప్రారంభించారు. ఇకపై ప్రజలు ఎమ్మెల్యే కార్యాలయం వద్ద వేచి ఉండాల్సిన అవసరం లేకుండా, ఎప్పుడైనా, ఎక్కడి నుంచైనా తమ ఫిర్యాదులను నమోదు చేయవచ్చు. ఈ పోర్టల్ ద్వారా పేరు, గ్రామం, సమస్య వివరాలతో పాటు అవసరమైన పత్రాలను కూడా అప్‌లోడ్ చేయవచ్చు. దరఖాస్తులను పర్యవేక్షించేందుకు 24 మందితో కూడిన కాల్ సెంటర్ కూడా ఏర్పాటు చేశారు.ప్రజలు తమ సమస్యలు చెప్పుకునేందుకు ఎమ్మెల్యేల ఇళ్లు లేదా కార్యాలయాల వద్ద గంటల తరబడి క్యూ కట్టడం సర్వసాధారణం. ఎమ్మెల్యే ఎప్పుడు అందుబాటులో ఉంటారో తెలియక, ఉదయాన్నే వచ్చి వేచి చూసినా ఒక్కోసారి కలిసే అవకాశం లభించదు. ఈ నిరీక్షణకు, ప్రజల ఇబ్బందులకు ముగింపు పలకాలని సంకల్పించిన ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు ఒక వినూత్న పరిష్కారాన్ని ముందుకు తెచ్చారు. కేవలం ఒక క్యూఆర్ కోడ్ ద్వారా ప్రజలు తమ సమస్యలను ఎప్పుడైనా, ఎక్కడి నుంచైనా ఫిర్యాదు చేసేలా ఒక ప్రత్యేక ఆన్‌లైన్ పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు.ఈ నూతన విధానం ద్వారా ప్రజలు తమ మొబైల్ ఫోన్‌లోని క్యూఆర్ కోడ్ స్కానర్‌తో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద అతికించిన కోడ్‌ను లేదా వాట్సాప్ గ్రూపుల ద్వారా పంపే పీడీఎఫ్‌లోని కోడ్‌ను స్కాన్ చేయగానే పోర్టల్ తెరుచుకుంటుంది. అందులో దరఖాస్తుదారులు తమ పేరు, ఊరు వంటి ప్రాథమిక వివరాలతో పాటు ఎదుర్కొంటున్న సమస్యను స్పష్టంగా వివరించవచ్చు. అంతేకాదు, సమస్యకు సంబంధించిన పత్రాలను కూడా సులభంగా అప్‌లోడ్ చేసి దరఖాస్తును సమర్పించవచ్చు. ఇలా దరఖాస్తు చేసిన ఫిర్యాదులను ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ఎక్కడున్నా వెంటనే పరిశీలించి, వాటి పరిష్కారానికి కృషి చేస్తారు.ఈ ఫిర్యాదుల పరిష్కారాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు, ప్రజల సందేహాలను నివృత్తి చేసేందుకు ఎమ్మెల్యే ఒక ప్రత్యేక కాల్ సెంటర్‌ను కూడా నిర్వహిస్తున్నారు. హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే ఈ కాల్ సెంటర్‌లో మండలానికి ముగ్గురు చొప్పున మొత్తం 24 మంది సిబ్బంది పనిచేస్తారు. వీరు దరఖాస్తుల స్థితిని పర్యవేక్షిస్తూ, పరిష్కార ప్రక్రియను వేగవంతం చేస్తారు.

# బరితెగిస్తున్న మద్యం మాఫియా

కాకినాడ, ఆగస్టు 7,అబ్కారీ శాఖ, మద్యం దుకాణదారుల మధ్య అంబేద్కర్ కోనసీమ జిల్లాలో వార్ జరుగుతోంది. ఇది చివరకు జిల్లా అబ్కారీశాఖ కార్యాలయం ముందు నిరసనకు దిగేలా చేసింది. బాబోయ్ వీళ్ల లంచాలు దోపిడీని మేము తట్టుకోలేకపోతున్నాం. నెలకు లక్ష రూపాయలు తెచ్చి ఇవ్వాలంటే ఎక్కడ తేవాలంటూ బహిరంగ విమర్శలకు మద్యం షాపు యజమానులు దిగారు. ఏకంగా దుకాణాలు బంద్ చేసి ఆపై షాపుల తాళాలు పట్టుకొచ్చి ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో అప్పగించి నిరసనకు దిగడం పెద్ద హైడ్రామాను తలపించింది.ఇదిలా ఉంటే మద్యం షాపుల పరిధిలో అనధికార బెల్ట్‌షాపులను విచ్చలవిడిగా నడుపుతున్నరని, ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు అమ్ముతుంటే చూస్తూ కూర్చోవాలా అన్నది ఎక్సైజ్‌శాఖ అధికారుల వాదన. మొత్తం మీద అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురంలో మాత్రం వీరి మధ్య యుద్ధం మామూలుగా జరగడం లేదని స్థానికులు చెవులు కొరుక్కుంటున్నారు.మద్యం దుకాణదారులమైన తమ నుంచి ఇష్టానుసారంగా డబ్బులు వసూళ్లు చేస్తున్నారంటూ మద్యం దుకాణదారులు తమ షాపులకు తాళాలు వేసి జిల్లా ఎక్సైజ్ శాఖ కార్యాలయం వద్ద? ధర్నాకు దిగారు. లక్షల రూపాయలు వెచ్చించి మద్యం షాపులు దక్కించుకున్న తమను ఎక్సైజ్ శాఖ అధికారులు తరచూ వేధింపులకు గురి చేస్తున్నారంటూ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని వైన్ షాపు నిర్వహకులు సోమవారం ఆందోళన చేపట్టారు. షాపులకు తాళాలు వేసి అమలాపురంలోని ఎక్సైజ్ శాఖ కార్యాలయం వద్దకు చేరుకుని తాళాలు ఎక్సైజ్ ఆఫీసులో ఇచ్చేసిన మద్యం షాపుల నిర్వాహకులు తమ నిరసన వ్యక్తం చేశారు.ఎక్సైజ్ అధికారుల వేధింపులు భరించలేకపోతున్నామని ప్రతి నెల షాపునకు రూ. లక్ష ఇవ్వాలని ఎక్సైజ్ అధికారుల డిమాండు చేస్తున్నారంటూ ఆరోపించారుప్రతినెల ఎక్సైజ్ అధికారులకు మామూళ్లు ఇవ్వకపోతే ఇబ్బందులకు గురి చేస్తున్నారంటూ మద్యం వ్యాపారాలు వాపోయారు. తరచూ తమపై ఎక్స్‌సైజ్ అధికారులు బెదిరింపులకు పాల్పడుతున్నారని కార్యాలయం అందోళన చేపట్టారు. షాపుల వద్ద మద్యాన్ని కొనుగోలు చేసే వారిని సైతం అరెస్టులు చేసి షాపులపై కేసులు కడుతున్నారని, ఇలాగైతే షాపులు మేము నడపలేమని ఎక్సైజ్ సిఐ కు తాళాలు అప్పగించి షాప్ యజమానులు తమ నిరసన తెలిపారుమద్యం దుకాణాల పరిధిలో విచ్చలవిడిగా అనధికార బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్నారని, ఎమ్మార్పీ రేటు కంటే అధికంగా లిక్కర్ విక్రయాలు జరుగుతున్నాయని, మా దాడుల్లో దొరికిన పలువురిపై కేసులు నమోదు చేశామని చెబుతున్నారు. అయితే ఈ దాడుల నేపథ్యంలోనే మద్యం దుకాణదారులు తమపై కక్షకట్టి నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నరని మండిపడుతున్నారు. మద్యం దుకాణదారుల నుంచి తాము లక్షల రూపాయలు వసూళ్ల చేస్తున్నారని కొందరు మద్యం దుకాణదారులు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమని చెప్పుకొస్తున్నారు.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో మద్యం షాపు నిర్వహకులమైన తమ నుంచి భారీ ఎత్తులో మామూళ్లు వసూళ్లకు అధికారులు పాల్పడుతున్న?రని మద్యం షాపుల నిర్వాహకులు మండిపడుతున్నారు. మేమంతా సిండికేట్‌గా ఏర్పడి లక్షల రూపాయలు పోగేసి అధికారులుకు ఇవ్వాలట.. ఎమ్మార్పీ రేటు కంటే అధికంగా అమ్ముకున్నా మాట్లాడరట అని చెప్పు కొస్తున్నారని మద్యం షాపు నిర్వాహకులు చెబుతున్నారు. దీనిపై ఎక్సైజ్ సూపరింటెండెంట్ వివరణ కోరగా ఇది నిరాధారమైన ఆరోపణలని కొట్టి పడేశారు.. మద్యం దుకాణాల పరిధిలో విచ్చలవిడిగా బెల్టషాపులను నిర్వహిస్తున్నారన్న సమాచారంతో మాత్రమే తాము దాడులు చేశామని ఆయన చెప్పారు.

# సెప్టెంబర్ 1 నుంచి కొత్త బార్ పాలసీ

విజయవాడ, ఆగస్టు 7, మద్యం పాలసీ అనగానే దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వాలైనా ఆదాయం గురించి చూస్తాయని... కానీ మద్యం పాలసీ అంటే ఆదాయమే కాదని సీఎం చంద్రబాబు అన్నారు. ప్రజల ఆరోగ్యమే ముఖ్యమనే విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని స్పష్టం చేశారు.ఆల్కహాల్ కంటెంట్ తక్కువ ఉన్న మద్యం ద్వారా మద్యం వినియోగదారుల ఆరోగ్యాన్ని చాలా వరకు కాపాడవచ్చు అని సీఎం అన్నారు. మద్యం పాలసీ అంటే ఆదాయం మాత్రమే అని భావించొద్దని...ప్రజల ఆరోగ్యాలు ప్రధానమైన అంశమనే విషయాన్ని కూడా గుర్తుపెట్టుకోవాలని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో నాణ్యత లేని మద్యం కారణంగా కొన్ని లక్షల కుటుంబాలు నష్టపోయాయన్న విషయాన్ని గుర్తుచేశారు. పేదల ఇల్లు, ఒల్లు గుల్ల కాకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు. సీఎం చంద్రబాబు సచివాలయంలో ఆబ్కారీ శాఖపై రివ్యూ చేశారు. మంత్రులు కొల్లు రవీంద్ర, కొండపల్లి శ్రీనివాస్, అధికారులు ఈ సమీక్షకు హాజరయ్యారు. ప్రస్తుతం ఉన్న బార్ పాలసీ గడువు తీరడంతో.... సెప్టెంబర్ 1 నుంచి కొత్త బార్ పాలసీ రావాల్సి ఉంది. అధికారులు సీఎంకు కొత్త పాలసీపై ప్రతిపాదనలు వివరించారు.మంత్రివర్గ ఉపసంఘం ఇచ్చిన నివేదిక, ప్రతిపాదనల ఆధారంగా కొత్త పాలసీకి రూపకల్పన చేసినట్లు సీఎం తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 840 బార్లు ఉన్నాయి. కొత్త పాలసీలో లాటరీ పద్దతి ద్వారా బార్లకు అనుమతులు ఇస్తారు. 50 వేల లోపు జనాభా ఉంటే రూ.35 లక్షలు, 5 లక్షల లోపు జనాభా ఉంటే రూ.55 లక్షలు, 5 లక్షల పైన జనాభా ఉంటే రూ.75 లక్షల చొప్పున లైసెన్స్ ఫీజు ఏడాదికి పెట్టాలనే సూచన మంత్రివర్గ ఉప సంఘం నుంచి వచ్చింది.కొత్త పాలసీలో అప్లికేషన్ ఫీజ్, లైసెన్స్ ఫీజు ద్వారా రూ.700 కోట్ల ఆదాయం వస్తుందని అధికారులు అంచనా వేశారు. ప్రతి బార్ కు కనీసం 4 అప్లికేషన్లు రావాలనే నిబంధనను పెట్టనున్నారు. బార్ పాలసీలో కూడా గీత కులాలకు 10 శాతం బార్లు దక్కేలా చూడాలని సీఎం స్పష్టం చేశారు. లిక్కర్ షాపుల్లో ఎలా అయితే 10 శాతం వారికి ఇచ్చారో... అదే విధంగా బార్లలో కూడా ఆ వర్గాలకు బార్లు కేటాయించనున్నారు.పొరుగు రాష్ట్రాల పరిధిలో సరిహద్దుల్లో లిక్కర్ సేల్స్ పెరగడానికి గల కారణాలు కూడా అధికారులు సీఎంకు వివరించారు. ఏపీలో రేట్లు తగ్గడం, అన్ని బ్రాండ్లు అందుబాటులో ఉండడం, నాణ్యమైన మద్యం దొరకడంతో మన రాష్ట్రానికి చెందిన మద్యం వినియోగదారులు ఇక్కడే మద్యం కొనుగోలు చేస్తున్నారని చెప్పారు. దీంతో మన దగ్గర సరిహద్దు ప్రాంతాల్లోని లిక్కర్ షాపుల్లో సేల్స్ పెరగగా.... పొరుగు రాష్ట్రాల్లో సేల్స్ తగ్గాయని అధికారులు తెలిపారు.గతంలో మన రాష్ట్రంలో నాణ్యమైన మద్యం లేకపోవడం, అధిక ధరలు, మంచి బ్రాండ్లు దొరక్క పోవడం వల్ల పొరుగు రాష్ట్రాలకు వెళ్లి మద్యం తాగేవాళ్లని గుర్తు చేశారు. మరోవైపు దీన్ని సొమ్ము చేసుకోవడానికి అక్రమంగా ఇతర రాష్ట్రాల నుంచి మద్యం తెచ్చే వాళ్లని... ఇప్పుడు ఆ సమస్య లేకుండా పోయిందని అధికారులు చెప్పారు. అయితే ఇప్పుడు 12 జిల్లాల్లో పూర్తి స్థాయిలో ఐడీ లిక్కర్ ఫ్రీ జిల్లాలుగా ప్రకటించామని... ఈ నెలలో మరో 8 జిల్లాలను ఇల్లిసిట్లీ డిస్టిల్డ్ లిక్కర్ ( ఐడి లిక్కర్) ఫ్రీ జిల్లాలుగా ప్రకటిస్తామన్నారు. సెప్టెంబర్ నాటికి మిగిలిన 6 జిల్లాలను కూడా ఐడీ లిక్కర్ ఫ్రీ జిల్లాలుగా ప్రకటిస్తామని అధికారులు సీఎంకు వివరించారు.

# 14 శాతం విజయం

విజయవాడ, ఆగస్టు 7, సంపద సృష్టించి వాటితో పథకాలు, అభివృద్ధి పనులు చేస్తామని చంద్రబాబు ఎన్నికల ప్రచారంలో చెప్పారు. తొలి ఏడాదిలో ఈ విషయంలో 14 శాతం విజయాన్ని సాధించారు. జీఎస్టీని వసూళ్లలో 14 శాతం వృద్ధి కనిపించింది. ఆంధ్రప్రదేశ్‌లో ఐదు సంవత్సరాల పాటు ఓ రకమైన నీరసం కనిపించింది. ప్రజలకు ఉపాధి ఉండేది కాదు. ఇసుక కొరతతో నిర్మాణాలు ఉండేవి కావు. ప్రభుత్వ పనులు లేకపోవడం, ఆర్థిక వ్యవహారాలు సాగకపోవడంతో వ్యవస్థ అంతా నీరసంగా ఉండేది. ఎవరిలోనూ ఉత్సాహం ఉండేది కాదు. చిరు వ్యాపారుల నుంచి పెద్ద వ్యాపారుల వరకూ అంతా ఉస్సూరుమంటూ ఉండేవారు. అక్రమ మద్యం వ్యాపారులు, ఇసుక స్మగ్లింగ్ చేసే బిజినెస్ మాత్రమే సాగేవి. వాటిని వైసీపీ నేతలు చూసుకునేవారు. కానీ వైసీపీని పాతాళంలోకి నెట్టేసిన ఏడాదికే ఏపీలో స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. ఎక్కడ చూసినా పనులు జరుగుతున్నాయి. ప్రజలకు ఉపాధి పెరిగింది. ఆర్థిక కార్యకలాపాలు ఊపందుకున్నాయి.ఆంధ్రప్రదేశ్ జీఎస్టీ వృద్ధి పెద్ద రాష్ట్రాల్లో అత్యధికంగా ఉంది. గత ఏడాది జూలైతో పోలిస్తే ఈ ఏడాది జూలైలో జీఎస్టీ వసూళ్లు 14శాతం పెరిగినట్లుగా తాజాగా లెక్కలు వచ్చాయి. మంత్రి నారా లోకేష్ ఈ విషయాన్ని సోషల్ మీడియాలో ప్రకటించారు. పెద్ద రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో ఏపీ ముందు ఉంది. జీఎస్టీని పెరుగుదల .. అంటే.. ఆర్థిక వ్యవహారాలు, లావాదేవీల్లో భారీగా పెరుగుదల ఉండటమే. ఇవి ఎంత ఎక్కువగా ఉంటే ప్రజలకు అంత ఎక్కువగా ఉపాధి అవకాశాలు లభిస్తాయి. వారికీ ఉపాధి అందుతుంది.ప్రభుత్వం తరపున అభివృద్ధి పనులకు ఖర్చు పెట్టే నిధుల్లో 30 శాతం వరకూ పన్నుల రూపంలో ప్రభుత్వానికే వస్తాయి. అందుకే అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం ప్రభుత్వాలకు ఎంతో మేలు చేస్తుంది. ప్రస్తుతం అమరావతి, పోలవరం సహా రాష్ట్రంలో రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. నిధుల సమీకరణకు .. ఎన్ని మార్గాలుంటే అన్ని మార్గాల ద్వారా నిధులు సేకరించి పనులు చేయిస్తున్నారు. గ్రామాల్లో, నగరాల్లో చిన్న చిన్న సందుల్లోనూ సిమెంట్ రోడ్లు వేస్తున్నారు. ఇలాంటి పనుల వల్ల ఎంతో మందికి ఉపాధి లభిస్తుంది. ప్రభుత్వానికి ఆదాయం పెరుగుతుంది..ఏపీలో వ్యాపారవర్గాలకూ హుషారు వచ్చింది. గతంలో ప్రభుత్వం సంక్షేమ పథకాల పేరుతో..ఐదు వేలో.. పదివేలో అకౌంట్లలో వేసినప్పుడు ఆ డబ్బులతో మాత్రమే ప్రజలు కొనుగోళ్లు చేసేవారు. ఉపాధి అవకాశాలు తక్కువగా ఉండేవి. అయితే ఇప్పుడు అన్ని చోట్లా వ్యాపార వ్యవహారాలు పెరుగుతున్నాయి. రైతులకు ప్రభుత్వం తరపున మద్దతు లభిస్తోంది. మొత్తంగా ఏపీ ఇప్పుడు కాస్త తేరుకుంటోంది. గతంలోలా హుషారుగా పరుగెత్తేందుకు శక్తిని కూడదీసుకుంటోంది. మూడేళ్లలో ఎవరూ ఊహించనంత అభివృద్ధిని చేసి చూపించాలని ప్రభుత్వం పట్టుదలగా ఉంది. సంపద సృష్టి అంటే.. ప్రభుత్వ ఆదాయం పెంచడమే కాదు.. ప్రజల ఉపాధిని పెంచడం కూడా.

# పెరుగుతున్న దూరం...

గుంటూరు, ఆగస్టు 7, ఏపీలో అధికారం పోయిన తర్వాత బీజేపీకి దగ్గరయ్యేందుకు తీవ్రప్రయత్నాలు చేస్తున్నారు మాజీ సీఎం జగన్. బెంగుళూరు వేదికగా అక్కడి నేతల ద్వారా తనవంతు ప్రయత్నాలు చేశారు. ఈ విషయంలో బీజేపీ నుంచి ఎలాంటి సంకేతాలు రాలేదు. దీంతో జగన్ జిల్లాల పర్యటనకు శ్రీకారం చుట్టారు. దాని ద్వారా బల ప్రదర్శన చేశారు. జగన్‌కు మద్దతుగా ఉండే ఏపీలో కొందరు బీజేపీ నేతలు హైకమాండ్‌కి దృష్టికి పంపించినట్టు సమాచారం. ఎన్నికల్లో ఓడినా, మాజీ సీఎంకు ప్రజల్లో ఆదరణ ఉందన్నది అందులోని సారాంశం. ఈ విషయం లో కమలనాథుల నుంచి ఎలాంటి సంకేతాలు వచ్చేయో తెలీదు. మంత్రి సత్యకుమార్ ఎదురుదాడి చూసి షాకయ్యారు వైసీపీ నేతలు. ఏపీలో కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత వైసీపీ నేతలకు కౌంటరిస్తున్నారు టీడీపీ-జనసేన నేతలు. కానీ బీజేపీ నుంచి ఎలాంటి కౌంటర్లు పడలేదు. హైకమాండ్ సంకేతాలు ఏమో తెలీదుగానీ మంత్రి సత్యకుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. మద్య కుంభకోణం సూత్రధారి జగన్ అరెస్టు కానున్నారంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. అంతేకాదు కూటమి ఏడాది పాలనపై చర్చకు సిద్ధమేనంటూ ఎటాకింగ్ మొదలుపెట్టారు. ఉన్నట్లుండి మంత్రి సత్యకుమార్ కామెంట్స్‌పై వైసీపీలో అప్పుడే చర్చ మొదలైంది. మంత్రి మాటల వెనుక బీజేపీ హైకమాండ్ ఉండవచ్చని అంటున్నారు. అందువల్లే నేరుగా లిక్కర్ స్కామ్‌లో జగన్ అరెస్టు కావడం ఖాయమని ఓపెన్‌గా చెప్పారని అంటున్నారు. మంత్రి సత్యకుమార్ గురించి చెప్పనక్కర్లేదు. హోంమంత్రి అమిత్ షాకు సత్యకుమార్ నమ్మినబంటుగా చెబుతారు ఆ పార్టీ నేతలు. సమయం, సందర్భం వచ్చినప్పుడు ఆఫ్ ద రికార్డులో చెబుతుంటారు. అందువల్లే మొన్నటి ఎన్నికల్లో ఆయన ధర్మవరం నుంచి గెలవడం, ఆ తర్వాత చంద్రబాబు కేబినెట్‌లో మంత్రి కావడం చకచకా జరిగిపోయిందని అంటున్నారు. దీనికితోడు లిక్కర్ కేసు వ్యవహారం వైసీపీని కకావికలం చేసింది. దాని మూలాలు ఏకంగా అధినేత మెడకు చుట్టుకున్నాయి. జరిగిన.. జరుగుతున్న పరిణామాలను గమనించిన బీజేపీ పెద్దలు మంత్రి సత్యకుమార్ ద్వారా ఎదురుదాడికి దిగేలా చేశాయని అనుకుంటున్నారు వైసీపీ నేతలు. ఈ లెక్కన వైసీపీకి కమలం నుంచి కష్టాలు తప్పవని అంటున్నారు. రాబోయే రోజుల్లో ఇంకా ఏం జరుగుతుందో చూడాలి.

# విశాఖ రాయ్ పూర్ గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే

విజయనగరం, ఆగస్టు 7, కేంద్రం ఏపీకి ఎనలేని ప్రాధాన్యమిస్తోంది. కీలక ప్రాజెక్టులను మంజూరు చేస్తోంది. ముఖ్యంగా రైల్వే తో పాటు జాతీయ రహదారులకు సంబంధించిన ప్రాజెక్టులను ఏపీకి కేటాయిస్తోంది కేంద్రం. భవిష్యత్తులో అమెరికా తరహాలో ఏపీ రోడ్లు ఉంటాయని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇటువంటి పరిస్థితుల్లో విశాఖ రాయ్ పూర్ గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే నిర్మాణం పనులు వేగవంతం అయ్యాయి. ప్రధాని నరేంద్ర మోడీ 2022 నవంబరులో ఈ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మొత్తం 464 కిలోమీటర్ల దూరం ఉన్న ఈ రహదారిని 2024 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే వివిధ కారణాలతో ఈ రోడ్డు నిర్మాణం పూర్తి కాలేదు. దీంతో ఈ ఏడాది డిసెంబర్ వరకు గడువు పొడిగించారు. అయితే తాజా పరిస్థితుల దృష్ట్యా వచ్చే ఏడాదికి ఈ పనులు పూర్తయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఎట్టి పరిస్థితుల్లో గడువులోగా రహదారి నిర్మాణ పనులు పూర్తి చేయాలని జాతీయ రహదారుల సంస్థ నిర్ణయించినట్లు తెలుస్తోంది.మూడేళ్ల కిందట ఈ హైవే నిర్మాణ పనులు ప్రారంభం అయ్యాయి. ప్యాకేజీ 4 కింద విజయనగరం జిల్లా కంటకాపల్లి, విశాఖ జిల్లా సబ్బవరం మధ్య 19.562 కిలోమీటర్ల పొడవునా పనులు జరుగుతున్నాయి. అయితే ఓ రెండు కిలోమీటర్లు మినహా రోడ్డు పనులు తుది దశకు వచ్చాయి. రూ.638 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ఈ ప్యాకేజీ పనులు జరుగుతున్నాయి. మరోవైపు ఉత్తరావల్లి కంటకాపల్లి మధ్య రెండు కిలోమీటర్ల హైవే పనులు ఇప్పటివరకు మొదలు పెట్టలేదు. అయితే ఇక్కడ పరిహారం సమస్య ఉంది. నిర్వాసితులు కోర్టుకు వెళ్లారు. కోర్టు పరిధిలో ఉండడం వల్లే ఇక్కడ రోడ్డు పనులు ప్రారంభం కాలేదు. ఇంకోవైపు విశాఖ అరకు నేషనల్ హైవే పక్కన గాంధీనగర్ దగ్గర లింక్ రోడ్డు పనులు కొనసాగుతున్నాయి. అలాగే కొత్తవలస కిరుండాల్ రైల్వే లైన్ పై ఫ్లై ఓవర్ నిర్మాణం కూడా జరుగుతోంది.ఇదే మార్గంలో గులివిందాడ, కొండ దాబాలు ప్రాంతంలో నేషనల్ హైవే పనులు నిలిచిపోయాయి. అక్కడ టోల్ ప్లాజా నిర్మాణం వల్ల పనులకు ఆటంకం కలిగింది. సమీపంలో బ్రిడ్జి నిర్మాణం కూడా ఆగిపోయింది. అయితే విద్యుత్ లైన్ల మార్పు, భూ సేకరణ సమస్యల వల్ల ఆగినట్లు తెలుస్తోంది. వీలైనంత త్వరగా వాటిని పరిష్కరించి పనులు మొదలు పెడతామని అధికారులు చెబుతున్నారు. గులివిందాడ దగ్గర్లో 400 కె.వి విద్యుత్ లైన్ మార్చాల్సి ఉండగా.. దీనికి అనుమతులు రావడంతో త్వరలో పనులు మొదలు పెడతామంటున్నారు అధికారులు. బ్రిడ్జి కోసం హైవేకు ఇరువైపులా స్తంభాలు వేశారు. అయితే అక్కడ 400 కే.వి విద్యుత్ లైన్ ను మార్చాల్సి ఉంది.విశాఖ నుంచి రాయపూర్ వరకు నిర్మిస్తున్న ఈ రహదారి.. మధ్యలో విజయనగరం, పార్వతీపురం మన్యం మీదుగా వెళుతుంది. మధ్యలో ఒడిస్సా కూడా ఉంటుంది. ఈ హైవే అందుబాటులోకి వస్తే ఒడిస్సా తో పాటు చత్తీస్గఢ్ వెళ్లేందుకు ప్రయాణించే సమయం తగ్గుతుంది. 12 గంటల్లో కాకుండా ఆరు గంటల్లోనే వెళ్లొచ్చు. విశాఖ నుంచి పారిశ్రామిక ఉత్పత్తులు, వనరులు తరలించేందుకు ఎంతగానో దోహదపడనుంది.

# హైదారాబాద్ లోనే ఇంకా ఏపీ ఆఫీసులు

అమరావతి, ఆగస్టు 7 రాష్ట్ర విభజన జరిగి 11 సంవత్సరాలు దాటుతోంది. కానీ ఇంతవరకు విభజన హామీలు అమలుకు నోచుకోవడం లేదు. సమస్యలు పరిష్కరించడం లేదు. రాజకీయ భిన్న ప్రభుత్వాలు, విభేదించే నాయకుల పుణ్యమా అని విభజన హామీలు అమలుకు నోచుకోవడం లేదు. ముఖ్యంగా తెలంగాణ నుంచి ఏపీకి రావాల్సిన రెండు కార్యాలయాల జాడలేదు. దీంతో ఏపీ ప్రజలు పడుతున్న బాధలు వర్ణనాతీతం. ప్రధానంగా ఆధార ప్రాంతీయ కార్యాలయం, జనాభా లెక్కల సేకరణ కార్యాలయం ఇప్పటికీ తెలంగాణ నుంచి పనిచేస్తున్నాయి. దీంతో ఏ చిన్న సమస్యకు పరిష్కారం కావాలన్నా.. హైదరాబాదులోని ప్రాంతీయ కార్యాలయాలకు సంప్రదించాల్సి వస్తోంది. అసలు ఈ కార్యాలయాలు ఏపీలో కార్యకలాపాలు ప్రారంభించేలా చేయడంలో పాలకులు విఫలమయ్యారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఆ వచ్చే ఏడాది ద్వితీయార్థంలో జనగణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. అయితే జనాభా లెక్కల సేకరణ కార్యాలయం తెలంగాణ నుంచే పని చేస్తుంది. ఏపీ జనగణన ఆపరేషన్ డైరెక్టర్గా ఐఏఎస్ అధికారి నివాస్ ను నియమిస్తూ జూలై 16న కేంద్ర హోం శాఖ నోటిఫికేషన్ ఇచ్చింది. అందులోనూ హైదరాబాద్ కేంద్రంగా పనిచేయాలని నిర్దేశించిందిరాష్ట్ర విభజ జరిగినా.. ఏపీ మాత్రం దేశంలో పెద్ద రాష్ట్రంగానే ఉంది. విభజన హామీల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు ఏపీకి తరలించాల్సి ఉంది. 11 ఏళ్లు గడుస్తున్న కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు మాత్రం ఏపీ వైపు చూడడం లేదు. దానికి కారణం లేకపోలేదు. ఏపీకి రాజధాని లేకపోవడమే ప్రధాన కారణం. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 12 రాష్ట్రాల జనాభా గణన కార్యాలయాలకు సొంత వెబ్ సైట్లు ఉన్నాయి. అందులో ఆయా రాష్ట్రాలు, జిల్లాల వారిగా జనాభా లెక్కల వివరాలు, గెజిట్ నోటిఫికేషన్లు ఉంటాయి. మన పక్కనే ఉన్న తమిళనాడు, ఒడిస్సా, కర్ణాటక కార్యాలయాలకు సైతం వెబ్సైట్లు ఉన్నాయి. తెలంగాణలో కొనసాగుతున్న ఏపీకి సంబంధించిన కార్యాలయానికి మాత్రం సొంత వెబ్సైట్ లేదు. ఇది ముమ్మాటికి ఇబ్బందికరమే.ప్రస్తుతం దేశ పౌరుడికి గుర్తింపు ఆధార్ విశిష్ట ప్రాధికార పత్రంగా దానికి గుర్తింపు ఉంది. అయితే ఆధార్ వ్యవహారాలను పర్యవేక్షించే యుఐడిఏఐ ప్రాంతీయ కార్యాలయం కూడా ఏపీలో లేదు. ఏపీకి సంబంధించిన ప్రాంతీయ కార్యాలయం హైదరాబాదులో కొనసాగుతోంది. దేశవ్యాప్తంగా యుఐడిఏఐ కి ఎనిమిది ప్రాంతీయ కార్యాలయాలు ఉన్నాయి. ప్రజల సౌలభ్యం కోసం ఆర్వోల పరిధిలో రాష్ట్ర కార్యాలయాలు ఏర్పాటు చేశారు. అయితే దక్షిణాది రాష్ట్రాల్లో ఏర్పాటైన ఈ కార్యాలయం.. ఏపీలో మాత్రం లేదు. ప్రజలకు ఏవైనా సమస్యలు ఉన్నా హైదరాబాదులోని అధికారులనే సంప్రదించాలి. ఫోన్ చేసి అడిగితే అధికారులు అందుబాటులో లేరనే సమాధానం వస్తుంటుంది. దీంతో ప్రజలు చాలా అసౌకర్యానికి గురవుతున్నారు.

# ట్రబుల్ షూటర్ కోసం.. హైరానా

నెల్లూరు, ఆగస్టు 7, విజయసాయి రెడ్డి విషయంలో జగన్ ఎటూ తేల్చుకోలేకపోతున్నారా? వైసీపీలోకి రీఎంట్రీ కి గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేకపోతున్నారా? అసలు వైసీపీ అధినేత మదిలో ఏముంది? సాయి రెడ్డి విషయంలో ఎలాంటి ఆలోచనతో ఉన్నారు? ఇప్పుడు పొలిటికల్ వర్గాల్లో ఇదే చర్చ నడుస్తోంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పునాది నుంచి ఉన్నారు విజయసాయిరెడ్డి. అధినేత కష్టసుఖాల్లో సైతం పాలుపంచుకున్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు అహర్నిశలు శ్రమించారు. అటువంటి నేత ఇటీవల పార్టీకి దూరమయ్యారు. ఇంతవరకు ఏ పార్టీలో కూడా చేరలేదు. అయితే ఇప్పుడు విజయసాయిరెడ్డిని పార్టీలోకి రప్పించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా అటు విజయసాయి రెడ్డికి, ఇటు జగన్మోహన్ రెడ్డికి మధ్య సన్నిహితంగా ఉన్న రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. అయితే విజయసాయిరెడ్డి పై కొంతమంది నేతల అభ్యంతరం ఉండడంతోనే జగన్ నిర్ణయం తీసుకోవడంలో ఆలస్యం జరుగుతోందన్న ప్రచారం నడుస్తోంది.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావంలో విజయసాయిరెడ్డి పాత్ర స్పష్టంగా ఉంది. సాయి రెడ్డి వైయస్సార్ కుటుంబ ఆడిటర్ గా ఉండేవారు. అలా జగన్మోహన్ రెడ్డికి దగ్గరయ్యారు. జగన్ తో పార్టీ అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నారు. అవినీతి కేసుల్లో 16 నెలల పాటు జైలు జీవితం అనుభవించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏర్పాటుకు బీజం వేసింది విజయసాయిరెడ్డి అని అప్పట్లో టాక్ నడిచింది. అందుకు తగ్గట్టుగానే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అండగా నిలబడ్డారు విజయసాయిరెడ్డి. తొలిసారి పార్టీ అధికారంలోకి రాకపోయినా.. ఇబ్బందికర పరిస్థితులు ఎదురైనా.. ఢిల్లీ స్థాయిలో లాబీయింగ్ చేసి.. పార్టీ అధికారంలోకి వచ్చేందుకు కారణమయ్యారు. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు తన హవాను చెలాయించారు. అయితే ఈ ఎన్నికల్లో ఓటమి తర్వాత ఒక ప్రత్యేక పరిస్థితుల్లో బయటకు వెళ్లారు విజయసాయిరెడ్డి.అయితే ప్రస్తుతం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సంక్లిష్ట పరిస్థితుల్లో ఉంది. పార్టీకి దారుణ పరాజయం ఎదురయింది. కూటమి ప్రభుత్వ ఉక్కు పాదం మోపుతోంది. జగన్ చుట్టూ ఉన్న నేతలంతా అరెస్టు అయ్యారు. రాష్ట్రంలో ఇతర పార్టీల నుంచి సహకారం లేదు. జాతీయ స్థాయిలో సైతం మద్దతు తెలిపేవారు కరువయ్యారు. జాతీయ పార్టీలతో లాబీయింగ్ చేసే నేత కూడా కనిపించకుండా పోయారు. విజయసాయిరెడ్డి లేని లోటు స్పష్టంగా కనిపిస్తోంది. ఇదే విషయాన్ని జగన్ మోహన్ రెడ్డి సన్నిహిత నేత ఆయనకు గుర్తు చేసినట్లు తెలుస్తోంది. పార్టీలోకి విజయసాయిరెడ్డిని తీసుకొస్తే మంచిదని ఆయన సలహా ఇచ్చినట్లు సమాచారం. అయితే జగన్మోహన్ రెడ్డి మాత్రం ఈ విషయంపై ఏమీ మాట్లాడలేదని తెలుస్తోంది. అయితే ఏదైనా విషయాన్ని ముఖం మీద తేల్చేయడం జగన్ కు ఉన్న అలవాటు. దీంతో విజయసాయిరెడ్డి విషయంలో ఆలోచన చేస్తున్నట్లు అర్థమవుతోంది.అయితే విజయసాయిరెడ్డి విషయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోని చాలామంది నేతలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. కాకినాడ సి పోర్టు కేసు విచారణకు హాజరైన ఆయన మాట్లాడిన తర్వాతే.. మద్యం కుంభకోణం కేసులో సిట్ చర్యలను వేగవంతం చేసింది. నేతల అరెస్టు ప్రారంభమైంది. కేవలం విజయసాయిరెడ్డి ఇచ్చిన సమాచారంతోనే ప్రత్యేక దర్యాప్తు బృందం పట్టు బిగించిందన్న అనుమానాలు ఉన్నాయి. అటువంటి నేతను ఎలా పార్టీలోకి తీసుకుంటారని చాలామంది అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. అందుకే జగన్మోహన్ రెడ్డి విజయసాయిరెడ్డి విషయంలో ఎలా అడుగు ముందుకు వేయాలో తెలియడం లేదు. అందుకే తన నిర్ణయాన్ని వాయిదా వేసినట్లు ప్రచారం నడుస్తోంది. మొత్తానికి అయితే పరిస్థితులు చూస్తుంటే విజయసాయిరెడ్డి వైసీపీలోకి రీఎంట్రీ ఖాయమని తెలుస్తోంది.

## పెంచికలపేట రోడ్డుకు మంత్రి శ్రీధర్ బాబుతో మహర్దశ.
## ప్రారంభం కానున్న రోడ్డు పనులు.

కమాన్ పూర్ రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తో పెంచికల పేట రోడ్డుకు మహర్దశ కలగనుంది.మంత్రి శ్రీధర్ బాబు ఆదేశాలతో పెంచికల పేట రోడ్డు పనులకు నేడో రేపో పనులకు మోక్షం కానుంది. ఇటీవల వ్యవసాయ మార్కెట్ కమిటీ సన్మాన సభలో సింగల్ విండో చైర్మన్ ఇనగంటి భాస్కరరావు మాట్లాడుతూ పెంచికలపేట రోడ్డు పనులు ప్రారంభం కాక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని పనులు ప్రారంభమయ్యేలా మంత్రి శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్లారు. మూడు కిలోమీటర్ల రోడ్డుకు నాలుకోట్ల 5 లక్షలు మంజూరైనట్లు మంత్రి ఆ సభలో తెలియజేశారు. అలాగే ఎఫ్ సి ఐ గేట్ వరకు మరో ఏడు కోట్ల 9 లక్షలతో ప్రతిపాదనలు పంపించడం జరిగిందని మంత్రి సభలో తెలియజేశారు. ఆ నిధులు సైతం త్వరలో విడుదలవుతాయని మంత్రి సభలో తెలియజేశారు .కమాన్ పూర్ మండల కేంద్రంలోని శ్రీపాదరావు విగ్రహం నుండి పెంచికల్ పేట్ జంక్షన్ ( గ్రామ పంచాయతీ కి వెళ్లి రహదారి మూలమలుపు) వరకు డబుల్ రోడ్డు నిర్మాణం పనులు మరికొద్ది రోజుల్లో ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నట్లు తెలిసింది. ఇటీవల ఆ రహదారి నిర్మాణ కాంట్రాక్ట్ సంస్థ కు చెందిన పిడిఆర్ ప్రతినిధి విజయేందర్ రెడ్డి వారితో పాటు ఇంజనీర్ అనుదీప్ రహదారిని పరిశీలించారు. ఈ రహదారి నిర్మాణానికి రూ, 4 కోట్ల 5 లక్షల నిధులు మంజూరు అయ్యాయి. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఇప్పుడు ఈ రహదారి నిర్మాణంలో థార్ రోడ్డుతో పాటు సిమెంట్ బిట్ రోడ్లు కొన్ని చోట్ల వేయాల్సి ఉంది. ఈ క్రమంలో ఇప్పట్లో సిమెంట్ రోడ్డు పనులు నిర్వహించడం పూర్తి చేసినంకా వర్షాలు తగ్గాక థార్ రోడ్డు పనులు చేపట్టే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ఈ రహదారి నిర్మాణానికి నిధులు మంజూరుయై నెలలు గడుస్తున్న ఇంకా పనులు చేపట్టడం లేదని పీ. ఏ. సీ. ఎస్ చైర్మన్ ఇనగంటి భాస్కర్ రావు రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్లగా.. ఆ కాంట్రాక్టర్ తో ఫోన్ లో మాట్లాడి త్వరిత గతిన పనులు ప్రారంభించి పూర్తి చేయాలని సూచించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే ఆ కాంట్రాక్ట్ సంస్థ త్వరలోనే పనులు చేపట్టెందుకు సిద్దమైనట్లు తెలుస్తోంది.

# మళ్లీ జిల్లాల పునరవ్యవస్థీకరణ

అనంతపురం, ఆగస్టు 7, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొత్త జిల్లాల ఏర్పాటు.. జిల్లాలు సరిహద్దులు, పేర్లు మార్పు.. మండలాల మార్పులు, చేర్పులపై కసరత్తు చేస్తోంది. ఇటీవల ఏడుగురు మంత్రులతో మంత్రివర్గ ఉపసంఘాన్ని కూడా ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో అనగాని సత్యప్రసాద్, నిమ్మల రామానాయుడు, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్, పి.నారాయణ, వంగలపూడి అనిత, బీసీ జనార్దన్‌రెడ్డిలు సభ్యులుగా ఉన్నారు. తాజాగా కేబినెట్ భేటీలో జిల్లాలకు సంబంధించిన అంశాలన్ని చంద్రబాబు ప్రస్తావించారు. ఈ మేరకు నెల రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆ కేబినెట్ సబ్ కమిటీని ఆదేశించారు.ఈ మేరకు జిల్లాల పేర్ల మార్పు, ప్రధాన కేంద్రాలు, డివిజన్‌లు, సరిహద్దులు, మండలాల అంశంపై కమిటీ పరిశీలన ఎంతవరకు వచ్చిందని ఆరా తీశారట. అలసు ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించారా అని అడిగారట. కొత్త జిల్లాల ఏర్పాటులో గత ప్రభుత్వం కొన్ని తప్పులు చేసిందన్న చంద్రబాబు.. వాటిని సరిదిద్దాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారట. ఈ నెల 12 తర్వాత ఉపసంఘం సమావేశం అవుతుందని మంత్రి అనగాని సత్యప్రసాద్ సీఎంకు వివరించారట. అయితే డిసెంబర్ నాటికి ఈ సమస్యల్ని ఓ కొలిక్కి రావాలని ఆలస్యం చేయొద్దని సూచించారట. ఈ ఉప సంఘం జిల్లాల పేర్ల మార్పు, సరిహద్దుల మార్పు, ప్రధాన కార్యాలయాల మార్పు వంటి అంశాలను పరిశీలిస్తుంది. వీటితో పాటుగా డివిజన్లు, మండలాల అంశాలను కూడా పరిశీలిస్తుంది. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను కూడా ఉపసంఘం పరిశీలించి నివేదికను తయారు చేయనుంది.ఏపీలో పలు కొత్త జిల్లాల ఏర్పాటు, పేర్లు మార్పు, జిల్లాలు, మండలాలకు సంబంధించిన డిమాండ్‌లు తెరపైకి వచ్చాయి. ప్రధానంగా ప్రకాశం జిల్లాలో పశ్చిమ ప్రాంతాన్ని మార్కాపురం కొత్త జిల్లాగా ఏర్పాటు చేయాలనే డిమాండ్ గత ఐదేళ్లుగా వినిపిస్తోంది. ఈ మేరకు ఎన్నికల ప్రచారంలో కూడా చంద్రబాబు కొత్త జిల్లా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. యర్రగొండపాలెం, కనిగిరి, మార్కాపురం, గిద్దలూరు, దర్శి నియోజకవర్గాలు కలిపి జిల్లా ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఉంది. ఈ అంశం కూడా ప్రస్తుతం తెరపైకి వచ్చింది

అన్నమయ్య జిల్లాకు సంబంధించి రాయచోటి కాకుండా రాజంపేట ప్రధాన కేంద్రంగా ఉండాలనే డిమాండ్ వినిపిస్తోంది. పశ్చిమ గోదావరి జిల్లాకు నర్సాపురాన్ని ప్రధాన కేంద్రంగా ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.. కానీ భీమవరాన్ని పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కేంద్రంగా ప్రకటించారు. ఇటు శ్రీసత్యసాయి జిల్లాకు సంబంధించి హిందూపురాన్ని జిల్లా కేంద్రంగా చేయాలని ప్రజలు అడుగుతున్నారు. హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ కూడా ఇదే డిమాండ్ వినిపిస్తున్నారు. ప్రస్తుతం శ్రీసత్యసాయి జిల్లా ప్రధాన కేంద్రంగా పుట్టపర్తి ఉంది.కొత్త 26 జిల్లాల్లో ఒక గిరిజన జిల్లా ఉంటుందని చెప్పిన గత ప్రభుత్వం.. రెండు జిల్లాలను ప్రకటించింది. పాడేరు ప్రధాన కేంద్రం అల్లూరి సీతారామరాజు.. పార్వతీపురం ప్రధాన కేంద్రంగా మన్యం జిల్లా ఏర్పాటైంది. అయితే మన్యం జిల్లా పేరు మార్చాలనే డిమాండ్ తెరపైకి వచ్చింది. రెవెన్యూ డివిజన్ల విభజనపై కూడా వినతులు వస్తు?న్నాయి. వీటితో పాటుగా పలు రెవెన్యూ డివిజన్లు, మండలాల అంశాలు కూడా తెరపైకి వచ్చాయి.. వాటిని సరిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

## సింగరేణి కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి.

## ఐఎన్టియుసి కేంద్ర కార్యదర్శి గడ్డం తిరుపతి యాదవ్.

కమాన్ పూర్ సింగరేణి దీర్ఘకాలిక సమస్యల ను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఐఎన్టీయూసీ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన, పలు సమస్యల పరిష్కారానికైసంస్థ చైర్మన్ కు వినతి పత్రం ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్ ఆదేశాలతో ఓసి1 కార్మికులతో కేంద్ర కార్యదర్శి గడ్డం తిరుపతి యాదవ్ మేనేజర్ కు సమస్యల వెల్లువ అందజేశారు. సింగరేణి కార్మికులు చాలా రోజులనుండి ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారానికి సింగరేణి కోల్ మెన్స్ లేబర్ యూనియన్ ఐఎన్టియూసి సెక్రెటరీ జనరల్ బి.జనక్ ప్రసాద్ ఆదేశాలు, ఆర్జిత్రీ ఏరియా ఉపాధ్యక్షులు కోటా రవీందర్ రెడ్డి సూచన మేరకు కేంద్ర కార్యదర్శి గడ్డం తిరుపతి యాదవ్ ఆధ్వర్యంలో ఓసీ1 గనిలో ఉద్యోగులు నల్ల రిబ్బన్ బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతూ మేనేజర్ ద్వారా సంస్థ చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ గారికి వినతి పత్రం అందజేశారు. సంస్థలో పనిచేస్తున్న కార్మికులు సమస్యల సాధనకై ఐఎన్టియుసి గతం నుండి పోరాటం చేస్తున్నట్లు పేర్కొంటూ ఈ వినతి పత్రంలో పలు ముఖ్యమైన సమస్యలైన మెడికల్ అటెండెన్స్ రూల్స్ ను మార్చాలని, జులై 31న జరిగిన మెడికల్ బోర్డులో కార్మిక లోకానికి తీవ్ర అన్యాయం జరిగిందని ఆ బోర్డును రద్దుచేసి తిరిగి నిర్వహించాలని, అండర్ గ్రౌండ్లో అన్ఫిట్ అయిన మైనింగ్ స్టాఫ్, ట్రేడ్ మెన్ మరియు ఈపి ఆపరేటర్లకు సర్ఫేస్ లో సూటబుల్ జాబ్ ఇవ్వాలని, ఎన్నో ఏళ్ల నాటి సొంతింటి కలను నిజం చేయడానికి తగు చర్యలు తీసుకోవాలని, కార్మికుడి సంవత్సర జీతంలో మూడు నెలలు ఆదాయపు పన్ను కట్టడానికే సరిపోతున్నదని, అధికారుల లాగా పేర్క్స్ పై ఆదాయపు పన్ను మాఫీ చేయాలని, సింగరేణిలో రానున్న కొద్ది సంవత్సరాల్లో అనేక భూగర్భగనులు మూతపడే అవకాశం ఉన్నందున తక్షణం నూతన గనుల ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని, 18 నెలలుగా నిర్వహించని సేఫ్టీ ట్రైపార్టైట్ మీటింగ్ ను ఏర్పాటు చేయాలని, ఏరియాలో చాలా క్వాటర్లు శిథిలావస్థకు చేరినందున వెంటనే నూతన క్వాటర్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని, నూతన బదిలీ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని, మెరుగైన క్యాడర్ స్కీమ్ విధానాన్ని ప్రవేశపెట్టి నూతన ప్రమోషన్ పాలసీని తీసుకురావాలని, ఏరియా ఆసుపత్రులలో నాణ్యమైన మందులు అందుబాటులో ఉండేలా తగు చర్యలు తీసుకోవాలని, రిఫరల్ సిస్టంను మార్చాలని మైన్ యాక్సిడెంట్ కు గురైన కార్మికుడిని ముందుగా డిస్పెన్సరీకి తీసుకువెళ్లడం తర్వాత వెంటనే ఏరియా ఆసుపత్రి నుండే డైరెక్టుగా రిఫరల్ చేసేలా తగు చర్యలు తీసుకోవాలని, 35% లాభాల వాటాను వెంటనే ప్రకటించాలని, ఎన్నో ఏళ్లుగా కార్మికులు ఎదుర్కొంటున్న మారుపేర్ల సమస్యను వెంటనే తీర్చాలని, వివిధ కారణాల వలన ఉద్యోగాలను కోల్పోయిన డిస్మిస్డ్ కార్మికులకు మరొక అవకాశం ఇవ్వాలని, కార్మికులు తీవ్ర మానసిక వేదనకు గురవుతున్న దాదాపు 3700 విజిలెన్స్ కేసులను లోక్ అదాలత్ ఏర్పాటు చేసి ఒకేసారి పరిష్కరించేలా తగు చర్యలు తీసుకోవాలని, మహిళా కార్మికుల ప్రత్యేక అవసరాల దృష్ట్యా అన్ని గనులు మరియు విభాగాలల్లో ప్రత్యేక టాయిలెట్స్ మరియు రెస్ట్ రూమ్లు ఇతర సదుపాయాలు ఏర్పాటు చేయాలని సమస్యల పరిష్కారాన్ని డిమాండ్ చేస్తూ పేర్కొన్నారు. అలాగే ఆర్జీత్రీ మరియు అడ్రియాలా ఏరియాలోని రోడ్డు మరమ్మతులు, నీటి సమస్యలు, సీఎంపిఎఫ్ చిట్టిలలో అవకతవకలు, ఆపరేటర్ల పదోన్నతి, ఏఎల్పి గనిలో మరుగుదొడ్లు, తాగునీటి సమస్యలు, మౌలిక సదుపాయాలు, ఓసీ1 యస్‌డిలో సైకిల్ షెడ్డు నిర్మాణం, ఓసి1 గనికి 8వ కాలనీ నుంచి వచ్చే రోడ్డు మరమ్మతులు, ఓసీ1 గనిలో యంత్రాల పనితీరు, కొరత తదితర సమస్యలను విన్నవించి పరిష్కార దిశలో సత్వర చర్యలు తీసుకోవాలని ఉద్యోగుల సమక్షంలో మేనేజర్ గారికి విన్నవించారు. ఈ కార్యక్రమంలో గని పిట్ కార్యదర్శి గునిగంటి వెంకటస్వామి, ఏరియా కోశాధికారి కొలిపాక సారయ్య, నాయకులు సయ్యద్ సలీం, ఎం ప్రభాకర్ రెడ్డి, రవికుమార్, చంద్రయ్య, రామచంద్రారెడ్డి, ప్రవీణ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# చైనా పర్యటనకు మోడీ...



న్యూఢిల్లీ, ఆగస్టు 7, భారత్ మంచితనాన్ని ఆసరాగా చేసుకుని పన్నుల పేరుతో బెదిరిస్తున్న ట్రంప్‌కు షాకిచ్చిందేకు ప్రధాని మోదీ రెడీ అయ్యారు. ఇప్పటికే రష్యాతో స్నేహం వదులుకునేది లేదని ఇండియా స్పష్టం చేసింది. ఇప్పుడు చైనాతోనూ సన్నిహితమవుతోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎస్‌సీఓ సమ్మిట్ కోసం చైనాకు వెళ్లనున్నారు. గల్వాన్ ఘర్షణ తర్వాత మొదటి సారి భారత ప్రధానమంత్రి బీజింగ్ యాత్రకు వెళ్తున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 1, 2025 వరకు చైనాలోని టియాంజిన్‌లో జరిగే షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) సమ్మిట్‌లో పాల్గొనేందుకు చైనా సందర్శించనున్నారు. ఇది 2020 జూన్‌లో గల్వాన్ లోయలో భారత , చైనా సైనికుల మధ్య జరిగిన హింసాత్మక ఘర్షణ తర్వాత మొదటి పర్యటన. ఈ ఘర్షణలో 20 మంది భారత సైనికులు , కనీసం నలుగురు చైనా సైనికులు మరణించారు, దీని తర్వాత భారత్–చైనా సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. మోదీ పర్యటన ఈ సందర్శన రెండు దేశాల మధ్య సంబంధాలలో మెరుగుదలకు సూచన అనుకోవచ్చు. 2020 జూన్ 15న లడఖ్‌లోని గల్వాన్ లోయలో లైన్ ఆఫ్ యాక్చువల్ కంట్రోల్ (ఎల్ఏసీ) వెంబడి భారత, చైనా సైనికుల మధ్య జరిగిన ఘర్షణ 45 సంవత్సరాలలో రెండు దేశాల మధ్య మొదటి తీవ్ర ఉద్రిక్త ఘటనగా నిలిచింది. ఈ ఘర్షణలో భారత్ 20 మంది సైనికులను కోల్పోగా, చైనా అధికారికంగా నలుగురు సైనికుల మరణాన్ని ధృవీకరించింది. ఈ సంఘటన ద్వైపాక్షిక సంబంధాలను చారిత్రక కనిష్ఠ స్థాయికి దిగజార్చింది, దీని ఫలితంగా భారత్ చైనా యాప్‌లపై నిషేధం, పెట్టుబడులపై కఠిన నియంత్రణలు, రెండు దేశాల మధ్య నేరుగా విమాన సర్వీసుల రద్దు వంటి చర్యలు తీసుకుంది. ఈ ఘర్షణ తర్వాత, రెండు దేశాలు ఎల్ఏసీ వెంబడి ఉద్రిక్తతలను తగ్గించేందుకు పలు దఫాల సైనిక, దౌత్యపరమైన చర్చలు జరిపాయి. 2024 అక్టోబర్‌లో రష్యాలో జరిగిన బ్రిక్స్ సమ్మిట్‌లో ప్రధానమంత్రి మోదీ, చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ మధ్య జరిగిన సంక్షిప్త సమావేశం ద్వైపాక్షిక సంబంధాలను మెరుగుపరచడానికి అవకాశంగా మారిందది. ఈ సమావేశంలో, ఎల్ఏసీ వెంబడి మిగిలిన ఉద్రిక్తతలను పరిష్కరించేందుకు ప్రత్యేక ప్రతినిధుల (ఎస్ఆర్) సంభాషణలను పునఃప్రారంభించాలని నిర్ణయించారు. ఎస్‌సీఓ సమ్మిట్, భారత్, చైనా, రష్యా, పాకిస్తాన్, ఇరాన్, ఇతర సభ్య దేశాల నాయకులను ఒక వేదికపై తీసుకొస్తుంది, ఇది ఉగ్రవాదం, వాణిజ్యం, కనెక్టివిటీ, ప్రాంతీయ భద్రత వంటి అంశాలపై సహకారాన్ని ప్రోత్సహిస్తుంది. మోదీ ఈ సమ్మిట్‌లో పాల్గొనడం ద్వారా, ఉగ్రవాదంపై భారత్ గట్టి వైఖరిని, ముఖ్యంగా సరిహద్దు దాటిన ఉగ్రవాదంపై దృష్టి సారించనున్నారు. ఈ సమ్మిట్‌లో చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్, పాకిస్తాన్ ప్రధాని షెబాజ్ షరీఫ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ వంటి నాయకులతో మోదీ ఒకే వేదికను పంచుకోనున్నారు. ాఅూ సమ్మిట్‌లో మోదీ రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో కూడా షేక్ హ్యాండ్ చేయనున్నారు. అమెరికా ఎన్ని ఆంక్షలు పెట్టినా భారత్ వెనక్కు తగ్గడం లేదు. 25 శాతం టారిఫ్‌తో పాటు రష్యా నుంచి ఆయిల్ కొంటే పెనాల్టీ వేస్తామని ట్రంప్ హెచ్చరించారు.. అయినా భారత్ వెనక్కు తగ్గలేదు. రష్యాతో చమురు మైత్రి దశాబ్దాల నుంచీ కొనసాగుతోందని.. దానిని వదులుకోబోమని చెప్పింది. ఇప్పుడు షాంఘైలో మరోసారి పుతిన్‌ను కలిసి అమెరికాకు స్పష్టమైన సందేశం ఇవ్వాలని భారత్ అనుకుంటోంది.భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ జూలై 13–15, 2025లో చైనా సందర్శించి, చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ, ఉపాధ్యక్షుడు హాన్ జెంగ్‌లతో సమావేశమై, ఎస్‌సీఓ సమ్మిట్‌కు మార్గం సుగమం చేశారు. జైశంకర్ ఈ సందర్శనలో, 2024 అక్టోబర్‌లో మోదీ–జీ సమావేశం తర్వాత ద్వైపాక్షిక సంబంధాలలో కనిపిస్తున్న మెరుగుదలను కొనసాగించాలని, కైలాస్ మానససరోవర యాత్ర పునఃప్రారంభం వంటి సానుకూల చర్యలను స్వాగతించారు

# గ్రేట్ అమెరికానా... గ్రేవ్ అమెరికానా...

మేక్ అమెరికా గ్రేట్ అగైన్' నినాదంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రపంచ దేశాలపై భారీగా ప్రతీకార సుంకాలు విధిస్తున్నారు. తమ దేశ ఆర్థిక పరిస్థితి మెరుగుపర్చుకోవాలని చూస్తున్నారు. ఎవడేమైపోతే నాటకేంటి అనుకుంటూ.. మిత్ర దేశాలను శత్రువుగా మార్చుకుంటున్నారు. ఇప్పటికే భారత్, చైనా వంటి దేశాల నుంచి దిగుమతులపై 25 శాతం వరకు సుంకాలు విధించారు. అయితే, ఈ ధోరణి అమెరికా ఆర్థిక వ్యవస్థపై విపరీత పరిణామాలను కలిగించే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ సుంకాలు అమెరికా స్టాక్ మార్కెట్లను దెబ్బతీసిన దాఖలాలు ఇప్పటికే కనిపించాయి, దీర్ఘకాలంలో ఇవి ఆర్థిక సంక్షోభానికి దారితీసే ప్రమాదం ఉంది.25 శాతం సుంకాలు విధించడం వల్ల దిగుమతి వస్తువుల ధరలు గణనీయంగా పెరుగుతాయి, దీని ఫలితంగా అమెరికాలో ద్రవ్యోల్బణం స్వల్పకాలంలో 2.4 శాతం, దీర్ఘకాలంలో 1.2 శాతం పెరిగే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ ధరల పెరుగుదల సామాన్య అమెరికన్లపై ఏడాదికి సుమారు రూ.2 లక్షల అదనపు ఖర్చును మోపుతుంది. దిగుమతులు తగ్గినప్పటికీ, అమెరికా సొంతంగా ఈ వస్తువులను ఉత్పత్తి చేయలేకపోతే, అధిక ధరలకు దిగుమతులు చేసుకోవడం తప్పనిసరి అవుతుంది. ఈ భారం అమెరికా వినియోగదారులపైనే పడుతుంది, జేపీమోర్గాన్‌చేజ్ ఇన్‌స్టిట్యూట్ అంచనా ప్రకారం, ఈ సుంకాల వల్ల అమెరికా కంపెనీలపై సుమారు రూ.7 లక్షల కోట్ల భారం పడవచ్చు. ఈ ఒత్తిడిని తట్టుకోవడానికి కంపెనీలు రెండు మార్గాలను ఎంచుకోవచ్చు. ఒకటి, వస్తువుల ధరలను పెంచడం.. రెండు, లాభాలను తగ్గించుకోవడం. ధరలు పెంచితే, వినియోగదారులపై భారం మరింత పెరుగుతుంది, లాభాలు తగ్గితే, కంపెనీల ఆర్థిక స్థిరత్వం దెబ్బతింటుంది. ఈ రెండు పరిస్థితులు అమెరికా ఆర్థిక వృద్ధిపై ప్రతికూల ప్రభావితం చూపుతాయి.ట్రంప్ సుంకాలకు ప్రతిగా ఇతర దేశాలు కూడా అమెరికాపై ప్రతీకార సుంకాలు విధించే అవకాశం ఉంది. ఇది అమెరికా ఎగుమతులను తగ్గించి, ఆర్థిక వ్యవస్థలో కీలక రంగాలను బలహీనపరుస్తుంది. నిపుణుల అంచనా ప్రకారం, అంతర్జాతీయ వాణిజ్యం 50 శాతం వరకు క్షీణించవచ్చు. అమెరికా ఎగుమతులు తగ్గడం వల్ల ఉపాధి అవకాశాలు, ఆర్థిక ఉత్పత్తి, మొత్తం జీడీపీపై తీవ్రమైన ప్రభావం పడుతుంది. ఈ వాణిజ్య యుద్ధం అమెరికా ఆర్థిక వ్యవస్థను మరింత ఒత్తిడిలోకి నెట్టవచ్చు. సుంకాల వల్ల జీడీపీ తగ్గడం, ద్రవ్యోల్బణం పెరగడం వల్ల అమెరికన్ డాలర్ విలువ బలహీనపడే అవకాశం ఉంది. కొందరు నిపుణులు డాలర్ విలువ 50 శాతం వరకు తగ్గవచ్చని అంచనా వేస్తున్నారు. ఈ సందర్భంలో బ్రిక్స్ దేశాలు (బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా) స్వంత వాణిజ్య కరెన్సీని అభివృద్ధి చేసే అవకాశం ఉంది, ఇది డాలర్‌ను ప్రపంచ రిజర్వ్ కరెన్సీగా ఉన్న స్థానం నుంచి దిగజార్చవచ్చు. ఇది అమెరికా ఆర్థిక వ్యవస్థకు దీర్ఘకాలిక నష్టం కలిగిస్తుంది. దీంతో గ్రేట్ అమెరికా కాస్త గ్రేవ్(శ్మశానం) అమెరికాగా మారే ప్రమాదం ఉంది అమెరికా అధ్యక్షుడు.. ప్రస్తుత అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ తన అసహనం మరోసారి చూపించారు. భారత్‌పై ఇప్పటికే విధించిన 25 శాతం దిగుమతి సుంకాలను రెట్టింపు చేస్తూ.. వాటిని 50 శాతానికి పెంచనున్నట్లు ట్రంప్ ప్రకటించారు. ఈ ప్రకటన భారత్‌కు ఆర్థికంగా భారీ షాక్‌గా మారనుంది.వైట్‌హౌస్‌కు చెందిన వర్గాల ప్రకారం.. రష్యా నుంచి భారత్ భారీగా చమురు దిగుమతి చేస్తోందన్న కారణంతో ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అమెరికా విధించిన ఆంక్షలను పక్కనబెట్టి, భారత్ రష్యాతో వాణిజ్య సంబంధాలు కొనసాగిస్తోందన్నదే ప్రధాన కారణంగా పేర్కొంటున్నారు.భారతీయ ఉత్పత్తులపై 50 శాతం దిగుమతి సుంకం విధిస్తే.. టెక్స్‌టైల్, ఆటోపార్ట్స్, కెమికల్స్, స్టీల్, ఫార్మాస్యూటికల్స్ వంటి రంగాలు తీవ్రంగా ప్రభావితమవుతాయి. ఇప్పటికే అమెరికా మార్కెట్‌లో పోటీ పెరుగుతున్న నేపథ్యంలో, ఈ సుంకం పెంపుతో భారత దిగుమతులు మరింత ధర పెరిగి, వినియోగదారులకు దూరమవుతాయి. ట్రంప్ నిర్ణయం అంతర్జాతీయ రాజకీయ వర్గాల్లో కూడా చర్చనీయాంశంగా మారింది. రష్యా?ఉక్రెయిన్ యుద్ధంతో ఇప్పటికే ప్రపంచ వాణిజ్యంలో గందరగోళం నెలకొన్న సమయంలో, భారత్‌పై ఈ విధమైన ఆర్థిక ఒత్తిడిని పెంచడం ప్రస్తుత పరిణామాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది.ఇందుకు సంబంధించి అధికారికంగా భారత ప్రభుత్వం నుంచి స్పందన ఇంకా రాలేదు. అయితే గతంలో కూడా ఇలాంటి పరిస్థితుల్లో భారత్ సంయమనం పాటిస్తూ వ్యూహాత్మకంగా వ్యవహరించిన సందర్భాలున్నాయి. తాజా నిర్ణయం నేపథ్యంలో కూడా కేంద్రం ఆర్థిక, విదేశాంగ శాఖలు తగిన చర్యలు తీసుకుంటాయని భావిస్తున్నారు.ట్రంప్ మరోసారి తన 'అమెరికా ఫస్ట్' విధానాన్ని పదిమార్లు బలంగా వెల్లడించారు.

అయితే ప్రపంచ మిత్ర దేశాలతో సంబంధాలు పాడుచేయడం ఎంతవరకు సరైన విధానమో అనేది ప్రశ్నార్థకంగా మారింది. భారత్‌పై పెరిగిన ఈ సుంక భారం.. రెండు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలకు గండికొడతుందా? లేక భారత్ వ్యూహాత్మకంగా దీన్ని అధిగమిస్తుందా? అన్నది చూడాల్సి ఉంది.

# వీసా కష్టాలు

హైదరాబాద్, ఆగస్టు 7, ట్రంప్ ప్రభుత్వం అమెరికాలో అక్రమంగా ఉండేవారిని నియంత్రించేందుకు కొత్తగా వీసా బాండ్ విధానం ప్రవేశ పెట్టింది. ఎంపిక చేసిన దేశాల పర్యాటకులు, వ్యాపార వీసాదారులకు దాదాపు రూ.13 లక్షల వరకు బాండ్ చెల్లించాల్సి ఉంటుంది. గడువులోగా తిరిగి వెళితే ఆ డబ్బు తిరిగి వస్తుంది.

ఈ విధానం ఆగస్టు 20 నుంచి అమల్లోకి రానుంది. దీనిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మరి ఈ కొత్త నిబంధనలు ఎలాంటి పరిణామాలకు దారితీస్తాయో వేచి చూడాలి.అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ రెండోసారి పదవీ బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి చాలా దూకుడుగా వ్యవహరిస్తున్నారు. అమెరికాలో అక్రమంగా ఉండేవారిని వారి స్వస్థలాకు పంపించిన ఆయన కఠిన నియమ నిబంధనలు తీసుకు వస్తున్నారు. అయితే తాజాగా అమెరికాలో అక్రమంగా ఉండేవారిని (వీసా ఓవర్‌స్టే) నియంత్రించేందుకు మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. బీ1, బీ2 వీసా దరఖాస్తుదారుల కోసం కొత్తగా 12 నెలల పాటు అమలు చేయనున్న వీసా బాండ్ పైలట్ కార్యక్రమాన్ని అమెరికా విదేశాంగ శాఖ ప్రారంభించింది. ఈ కొత్త నిబంధనల ప్రకారం, ఎంపిక చేసిన కొన్ని దేశాల నుంచి వచ్చే పర్యాటకులు, వ్యాపార వీసాదారులకు 15,000 డాలర్లు (భారత కరెన్సీలో సుమారు రూ.13 లక్షలు) వరకు బాండ్ చెల్లించాల్సి ఉంటుంది. ప్రయాణికులు అమెరికా నుంచి గడువులోగా తిరిగి వెళ్లినట్లయితే ఈ బాండ్ మొత్తాన్ని వారికి తిరిగి చెల్లిస్తారు.ఈ కొత్త పైలట్ కార్యక్రమం ఆగస్టు 20వ తేదీ నుంచి అమల్లోకి రానుంది. వీసా గడువు ముగిసిన తర్వాత కూడా అమెరికాలో ఉండిపోయే వారి సంఖ్యను గణనీయంగా తగ్గించడమే లక్ష్యంగా ఈ విధానాన్ని తీసుకువచ్చారు.

ఈ కొత్త విధానం పౌరులు అమెరికాలో అక్రమంగా ఉండటానికి ప్రయత్నించకుండా నిరోధించగలదని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేస్తోంది. అయితే ఏ దేశాలకు ఈ నిబంధన వర్తిస్తుందనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు. గతంలో వీసా గడువు ముగిసిన తర్వాత కూడా అమెరికాలో ఉండిపోయే వారి శాతం ఎక్కువగా ఉన్న దేశాలకు ఈ నిబంధనలు వర్తించవచ్చని నిపుణులు భావిస్తున్నారు.ఈ బాండ్ విధానం వల్ల అమెరికాకు ప్రయాణించాలనుకునే వారికి ఆర్థికంగా పెద్ద భారం పడనుంది. పర్యాటక వీసా కోసం దరఖాస్తు చేసేవారు కూడా 15,000 డాలర్ల వరకు అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తం చాలా మందికి అందుబాటులో లేకపోవచ్చు. ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాల నుంచి వచ్చే పర్యాటకులకు, విద్యార్థులకు, చిన్న వ్యాపారవేత్తలకు ఇది ఒక పెద్ద ఆర్థిక సవాలుగా మారనుంది. ఈ నిర్ణయం వీసా దరఖాస్తు ప్రక్రియను మరింత సంక్లిష్టంగా మార్చడంతో పాటు అమెరికా పట్ల అంతర్జాతీయ పర్యాటకులలో ఉన్న ఆకర్షణను తగ్గించే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.ట్రంప్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వలస విధానాలు, వీసా నిబంధనలను కఠినతరం తేశారు. ఈ తాజా నిర్ణయం కూడా అదే విధానంలో భాగమని విశ్లేషకులు చెబుతున్నారు. అయితే ఈ విధానంపై ఇప్పటికే పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇది అంతర్జాతీయ ప్రయాణాలకు ఆటంకం కలిగించడమే కాకుండా, విదేశాల నుంచి అమెరికాకు వచ్చే టాలెంట్, పెట్టుబడులను కూడా ప్రభావితం చేస్తుందని కొందరు వాదిస్తున్నారు. ఈ పైలట్ కార్యక్రమం 12 నెలల పాటు అమలులో ఉంటుంది. దాని ఫలితాల ఆధారంగా భవిష్యత్తులో శాశ్వత విధానాన్ని రూపొందించాలా వద్దా అనేది ప్రభుత్వం నిర్ణయిస్తుంది. చూడాలి మరి ముమ్మందు ఏం జరగనుంది అనేది.

## తహసిల్దార్ జ్యోతి ఆత్మకు శాంతి కలగాలి.



కమాన్ పూర్ తహసిల్దార్ జ్యోతి ఆత్మకు శాంతి కలగాలని అంతర్గాంతహసిల్దార్ గెజిటెడ్ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు తూము రవీందర్ పటేల్ కోరారు. ఈ మేరకు ఆమె సంతాప సభను అంతర్గంలో బుధవారం నిర్వహించారు. పని ఒత్తిడి వల్ల అధికారుల వత్తిళ్ల వల్లనే మంగళవారం రాత్రి జ్యోతి గుండెపోటుతో మరణించిందని తూము రవీందర్ ఆరోపించారు. గతంలో పాలకుర్తి తాసిల్దారుగా వచ్చి విధులను నిర్వహిస్తున్నప్పుడు కూడా పై అధికారులు ఒత్తిడి గురి చేస్తున్నట్లుగా తనకు గతంలో తెలపడం జరిగిందని తూము రవీందర్ తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు ఇద్దరు అధికారులు గుండెపాడుతో మరణించడం జరిగిందని అలాగే ఉద్యోగులు అధికారుల ఒత్తిడికి లోను కాకుండా ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని ఈ సందర్భంగా అన్నారు. అలాగే ఉద్యోగులకు భద్రత కరువైందని తూము రవీందర్ పటేల్ అన్నారు. ఇప్పటికైనా అధికారులు ఉద్యోగస్తులపై ఒత్తిడి తీసుకురావద్దని ఆయన కోరారు.

# 1100 కిలోమీటర్ల కొత్త రహదారులు

హైదరాబాద్, ఆగస్టు7, తెలంగాణలో రహదారుల అభివృద్ధికి కేంద్రం భారీ ప్రణాళికలు సిద్ధం చేసింది. రాష్ట్ర ఆర్థికాభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని కేంద్ర రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ (మోర్త్) 15 కొత్త జాతీయ రహదారులను నిర్మించనుంది. మొత్తం 1,123 కిలోమీటర్ల పొడవు గల ఈ ప్రాజెక్టులకు రూ.33 వేల కోట్లు ఖర్చు కానుంది. రాబోయే మూడేళ్లలో ఈ పనులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ రహదారుల నిర్మాణం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు, ఉపాధి కల్పనకు ఊతమిస్తుంది.తెలంగాణ రహదారులకు మహర్దశ పట్టనుంది. రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో రహదారులు కీలకం కాగా.. తెలంగాణలో కొత్తగా 15 జాతీయ రహదారులు నిర్మించేందుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్రంలో కొత్త జాతీయ రహదారులు, బైపాస్ రోడ్లు, వంతెనల నిర్మాణానికి కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ (మోర్త్) భారీ ప్రణాళికలు రూపొందించింది. మొత్తం 15 కొత్త ఎన్‌హెచ్ ప్రాజెక్టులను చేపట్టనుంది. వీటిలో 12 పనులకు ఇప్పటికే డీపీఆర్ (వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక) కన్సల్టెన్సీ కోసం బిడ్‌లను ఆహ్వానించింది. మిగిలిన మూడు పనులకు త్వరలో బిడ్‌లు పిలవనుంది.ఈ ప్రాజెక్టుల మొత్తం పొడవు 1,123 కిలోమీటర్లు కాగా.. ప్రాథమిక అంచనాల ప్రకారం దీనికి రూ.33 వేల కోట్లు ఖర్చు అవుతుంది. కన్సల్టెన్సీ నివేదికలు వచ్చిన తర్వాత త్వరలోనే పనులు ప్రారంభించి, రాబోయే మూడేళ్లలో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ రహదారులు అందబాటులోకి వస్తే.. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పుంజుకోనుంది. ఆయా ప్రాంతాల్లో భూముల ధరలకు రెక్కలు రానున్నాయి. కొత్త పరిశ్రమలు ఏర్పాటు, ఉద్యోగ కల్పన కూడా జరగనుంది. రహదారుల నెట్‌వర్క్ గణనీయంగా మెరుగుపడి, ప్రజలకు ప్రయాణాలు మరింత సురక్షితంగా, వేగంగా మారతాయి.

ముఖ్యమైన ప్రాజెక్టుల వివరాలు

నిజామాబాద్-జగ్‌దల్‌పూర్ (ఎన్‌హెచ్-63): నిజామాబాద్-జగ్‌దల్‌పూర్ సెక్షన్‌లో రోడ్డు పనులు, బ్రిడ్జిల నిర్మాణం, బోధన్-నిజామాబాద్ సెక్షన్‌ను విస్తరించి వంతెనలు ఏర్పాటు.

జడ్చర్ల-కోదాడ (ఎన్‌హెచ్-167): జడ్చర్ల నుంచి కోదాడ వరకు నాలుగు వరుసల రహదారిగా నిర్మాణం, మహబూబ్‌నగర్ బైపాస్ రహదారి.

హైదరాబాద్-మెదక్ (ఎన్‌హెచ్-765డీ): హైదరాబాద్ ఓఆర్ఆర్-మెదక్ మధ్య నాలుగు లేన్ల రహదారి, మెదక్ బైపాస్ నిర్మాణం.

నకిరేకల్-తానంచర్ల (ఎన్‌హెచ్-365): నకిరేకల్-తానంచర్ల సెక్షన్‌లో రహదారి, బ్రిడ్జి నిర్మాణం, సూర్యాపేట-జనగామ మధ్య నాలుగు వరుసల రహదారి, ఖమ్మం-సత్తుపల్లి మధ్య రహదారి.

రుద్రంపూర్-భద్రాచలం (ఎన్‌హెచ్-30): రుద్రంపూర్-భద్రాచలం మధ్య నాలుగు వరుసల రహదారి, కొత్తగూడెం, పాల్వంచ బైపాస్‌ల నిర్మాణం.

మన్నెగూడ-రావులపల్లి (ఎన్‌హెచ్-163): మన్నెగూడ-రావులపల్లి మధ్య నాలుగు వరుసల రహదారి, హైదరాబాద్-భూపాలపట్నం మధ్య రహదారుల ఉన్నతీకరణ, వంతెనల నిర్మాణం.

కల్యాణ్-నిర్మల్ (ఎన్‌హెచ్-61): కల్యాణ్-నిర్మల్ సెక్షన్‌లో నాలుగు వరుసల రహదారి.

పరకాల-భూపాలపల్లి (ఎన్‌హెచ్-353సీ): పరకాల, భూపాలపల్లి బైపాస్ రహదారుల నిర్మాణం.

ఖమ్మం-వరంగల్ (ఎన్‌హెచ్-563): ఖమ్మం నుంచి వరంగల్ వరకు నాలుగు లేన్ల రహదారి నిర్మాణం

# ఉపాధి హామీ అమల్లోకి కొత్త రూల్

హైదరాబాద్, ఆగస్టు 7, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు అడ్డుకట్ట వేయడానికి తెలంగాణ ప్రభుత్వం కొత్తగా ఈకేవైసీ విధానాన్ని ప్రవేశపెడుతోంది. ఆగస్టు 15 నుంచి ఈ విధానం అమలులోకి వస్తుంది. ఈ కొత్త పద్ధతిలో కూలీలను ఫీల్డ్ అసిస్టెంట్లు రెండు సార్లు ఫోటోలను తీసి వాటిని సరిపోల్చి మాత్రమే వేతనాలు మంజూరు చేస్తారు. నకిలీ హాజరు, తప్పుడు ఫోటోల అప్‌లోడ్ వంటి మోసాలను నివారించి వేతనాల చెల్లింపుల్లో పారదర్శకత తీసుకురావడమే దీని ముఖ్య ఉద్దేశంమహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న అక్రమాలకు అడ్డుకట్ట వేయడానికి తెలంగాణ ప్రభుత్వం కఠిన చర్యలు చేపడుతోంది. నేషనల్ మొబైల్ మానిటరింగ్ యాప్ లో నకిలీ ఫోటోలు అప్‌లోడ్ చేసి వేతనాలు పొందుతున్నారనే విషయం ప్రభుత్వ దృష్టికి రావడంతో.. త్వరలో ఈకేవైసీ విధానాన్ని అమలు చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ నిర్ణయించింది. ఈ కొత్త విధానంలో కూలీలు పనికి వచ్చినప్పుడు, నాలుగు గంటల తర్వాత రెండుసార్లు క్షేత్ర సహాయకులు ఫోటోలు తీయాలి.ఈ రెండు ఫోటోల్లోని వ్యక్తులు ఒకేలా ఉంటేనే వేతనాలు మంజూరు చేస్తారు. లేకపోతే వేతనాలు నిలిపివేయబడతాయి. ఉపాధి కూలీలు ఈ విషయాన్ని గమనించాలని అధికారులు సూచిస్తున్నారు. ఈ విధానం ఆగస్టు 15 నుంచి అమలులోకి రానుంది. దీనిపై సిబ్బందికి త్వరలో శిక్షణ ఇవ్వనున్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాను తీసుకుంటే.. 4 లక్షలకు పైగా ఉపాధి కూలీలు ఉన్నారు. చాలా గ్రామాల్లో ఒకరికి బదులు మరొకరు పనులకు వెళ్లి వేతనాలు పొందుతున్నారని సామాజిక తనిఖీల్లో వెల్లడైంది. ప్రజాప్రతినిధుల బంధువులు, క్షేత్ర సహాయకుల కుటుంబీకులు కూడా మస్టర్లలో తప్పుడు హాజరు నమోదు చేస్తున్నట్లు గుర్తించారు.ఈ అక్రమాలను అరికట్టడానికి కేంద్రం ఔటీఓ యాప్‌ను తీసుకొచ్చినా.. కొందరు దానిని కూడా దుర్వినియోగం చేస్తున్నారు. సినీ సెలబ్రెటీలు, రాజకీయ నాయకుల ఫోటోలను అప్‌లోడ్ చేసి వేతనాలు పొందుతున్నారు. ఈ కొత్త వఐజఅ విధానం ద్వారా ఈ అక్రమాలకు పూర్తిగా అడ్డుకట్ట వేయవచ్చని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ చర్యల ద్వారా వేతనాల చెల్లింపుల్లో పూర్తి పారదర్శకత వస్తుందని, నిజమైన కూలీలకు మాత్రమే ప్రయోజనం కలుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది.ఇక గతంలో విధుల నుంచి తొలగించబడిన ఫీల్డ్ అసిస్టెంట్లకు (ఈం) తెలంగాణ ప్రభుత్వం శుభవార్త అందించనుంది. వారిని తిరిగి ఉద్యోగంలోకి తీసుకునేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ మేరకు, వారిని తొలగించిన సర్క్యులర్‌ను రద్దు చేసి, తిరిగి విధుల్లోకి తీసుకునే అవకాశాలను పరిశీలించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ఇటీవల అధికారులను ఆదేశించారు. ఈ నిర్ణయం తమను తిరిగి ఉద్యోగంలోకి తీసుకోవాలని చాలా కాలంగా ఎదురుచూస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లలో ఆనందాన్ని నింపింది. దీనిపై త్వరలో అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది.

# వేములవాడ ఆలయానికి 693 కోట్లు

కరీంనగర్, ఆగస్టు 7, తెలంగాణ సర్కార్ వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి భారీగా నిధులు కేటాయించింది. దక్షిణ కాశీగా పేరుగాంచిన ఈ ఆలయాన్ని యాదాద్రి తరహాలో అభివృద్ధి చేయనున్నారు. ఇందుకోసం దాదాపు 693 కోట్ల రూపాయలు కేటాయించింది. ఈ మొత్తంతో భక్తుల సౌకర్యార్థం పార్కింగ్ స్థలం, షాపింగ్ కాంప్లెక్స్ వంటి అనేక అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఈ పుణ్యక్షేత్రం రూపురేఖలు ఎలా మారనున్నాయో తెలియాలంటే కొన్నాళ్ల పాటు వేచి చూడక తప్పదు. ఇక ఆలయం అభివృద్ధి కోసం ప్రభుత్వం నిధులు కేటాయించడపై భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత.. అధికారంలోకి వచ్చిన పార్టీలు రాష్ట్ర అభివృద్ధితో పాటుగా.. అనేక ఇతర అంశాలపై కూడా దృష్టి సారిస్తున్నాయి. మరీ ముఖ్యంగా ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ.. భారీగా నిధులు కేటాయిస్తున్నాయి. గతంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు.. యాదాద్రి కోసం కేసీఆర్ ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు రేవంత్ సర్కార్ కూడా ఇలాంటి నిర్ణయమే తీసుకుంది. వేములవాడ ఆలయ అభివృద్ధి కోసం భారీగా నిధులు కేటాయించింది. ఆ వివరాలు.తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం రూ.693.25 కోట్లు కేటాయించింది. వేముల వాడ ఆలయ అభివృద్ధితో పాటు గుడికి వచ్చే భక్తులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించడంపై తెలంగాణ సర్కార్ దృష్టి సారించింది.

యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహ్మ స్వామి ఆలయం మాదిరిగా.. వేములవాడ రాజన్న ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు అధికారులు ప్రణాళికలు రెడీ చేస్తున్నారు.వేములవాడ ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం రూ.693.25 కోట్లు కేటాయించింది. ఈమొత్తం నుంచి తొలి విడతలో భాగంగా విడుదల చేసిన రూ.108.25 కోట్లతో ఆలయంలో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. రెండో విడతలో రూ.285 కోట్లు.. మూడో విడతలో రూ.100 కోట్లు విడుదల చేయనుంది. అలానే 2027-28 సంవత్సరంలో నాలుగో విడతలో రూ.250 కోట్ల నిధులు మంజూరు చేయనున్నారు.ఈమొత్తం నిధులతో.. సుమారు 20 ఎకరాల విస్తీర్ణంలో ఆలయానికి వచ్చే భక్తుల వాహనాలు నిలిపి ఉంచేందుకు పార్కింగ్ స్థలాన్ని అభివృద్ధి చేయనున్నారు. అలానే భక్తులకు సౌకర్యాల కల్పించడం కోసం వివిధ అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. రాజరాజేశ్వర స్వామి ఆలయాన్ని మాత్రమే కాక.. పరిసర ప్రాంతాల్లోని ఆలయాలను కూడా పునరుద్దరించనున్నారు. స్వామి వారి ఆలయ ప్రాంగణ సమీపంలోని దుకాణాలు, ఇతర వ్యాపారాలు నిర్వహించే వారికి ప్రత్యేక షెడ్లు, షాపింగ్ కాంప్లెక్స్ లను నిర్మించాలని భావిస్తున్నారు. ఇప్పటికే రేవంత్ సర్కార్ వేములవాడ ఆలయం కోసం వందేళ్లకు సరిపడా మాస్టర్ ప్లాన్‌ని రెడీ చేసిన సంగతి తెలిసిందేరాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో వెలసిన శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంలో పరమేశ్వరుడు.. సతీసమేతంగా లింగ రూపంలో దర్శనమిస్తాడు.

ఈ ఆలయం దక్షిణ కాశీగా ప్రసిద్ధి పొందింది. వేములవాడలోని ఈ రాజరాజేశ్వర స్వామి ఆలయాన్ని పశ్చిమ చాళుక్యుల కాలంలో క్రీస్తు శకం 750-973 మధ్య కాలంలో నిర్మించినట్లు చరిత్రకారులు చెబుతున్నారు. ఈ ఆలయం కోడె మొక్కులకు ప్రసిద్ధి చెందింది.

## విలీనం ప్రచారంతో విలవిల

అదిలాబాద్, ఆగస్టు 7, భారతీయ జనతా పార్టీ తన ప్రాభావాన్ని చాటుకునే ప్రయత్నంలో భాగంగా బీఆర్ఎస్ పై విలీనాస్త్రం సంధించింది. పార్టీలో అంతర్గత పోరు, కేసులతో సతమతమవుతూ క్రమక్రమంగా క్షీణిస్తున్న దశలో చేరికల పర్వానికి తెరలేపింది. దక్షిణ తెలంగాణలోని ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాపై కన్నువేసింది. అక్కడ గతంలో క్రియాశీలకంగా వ్యవహరించి, కేసీఆర్ కు బలమైన మద్దతునిచ్చే నాయకత్వంను తమవైపుకు తిప్పుకునేందుకు వేసిన పాచిక పారింది. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి పోటీ చేసి ఓడిన ఎమ్మెల్యే లను చేర్చుకునేలా వేసిన ప్లాన్ విజయవంతమైంది. పార్టీ అధికారంలో ఉండగానే వీరిని బీజేపీ వైపు ఆకర్షించేందుకు చేసిన ప్రయత్నం చివరి క్షణంలో కేసీఆర్ గండికొట్టిన విషయం తెలిసిందే. కానీ ఆ ఎపిసోడ్ లో ఉన్న అప్పటి ఎమ్మెల్యేలందరూ ప్రస్తుతం మాజీలుగా బీజేపీ కి జై కొట్టడం ఆశ్చర్యానికి దారితీస్తోంది.దక్షిణ తెలంగాణ లోని జిల్లాల్లో గతంలో బిఆర్ఎస్ పార్టీ నుంచి ఎన్నికైన నాయకులు తమ నివాసాన్ని దాదాపు హైదరాబాద్ కు మార్చుకున్నారు. దీంతో స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించలేక, వారు పట్టుకోల్పోయి గత ఎన్నికల్లో ఓటమి చవిచూశారు. అయితే గత ఒకటిన్నర సంవత్సరాలుగా పార్టీలో అంతర్యుద్ధం, లుకలుకలతో పాటు, కవిత జైలుపాలు కావడం, పార్టీ కార్యకలాపాలు తగ్గుముఖం పట్టడం, వరుస కేసుల్లో పార్టీ పెద్ద నాయకులు విచారణలు ఎదుర్కోవడం అనే అంశాలతో పాటుపార్టీ బీజేపీ తో విలీనమౌతున్నది అనే ప్రచారం హోరెత్తింది.జరుగుతున్న పరిణామాలను దృష్టిలో పెట్టుకొని ముందు చూపు ప్రదర్శించాలనే ఆలోచన చేస్తున్న సమయంలో బీజేపీ లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. తాము పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు అధినాయకుడు కేసీఆర్ దృష్టికి తీసుకువచ్చినా, వారిని కేసీఆర్ ఆపేందుకు ప్రయత్నం చేయలేదంటే పార్టీ పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవచ్చు.కేసీఆర్ మౌనం వహించడం, ఫాంహౌస్ కు పరిమితం కావడం వల్ల పార్టీకి మరింత నష్టం వాటిల్లుతుందని ఆయనకు, పార్టీకి అత్యంత సన్నిహితులు మీడియాలో నెత్తినోరు మొత్తుకొంటున్నారు.

# కాళేశ్వరం... శాపమా...వరమా

హైదరాబాద్, ఆగస్టు 7, రెండేళ్ల క్రితం వరకు తిరుగులేని శక్తిగా వెలుగొందిన భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ ఇప్పుడు ఇంటాబయటా పెనుసవాళ్లను ఎదుర్కొంటోందన్న చర్చ రాజకీయ వర్గాల్లో విస్తృతంగా జరుగుతోంది. ముఖ్యంగా కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలు, అంతర్గత కలహాలు, పార్టీ నాయకత్వం ప్రజాక్షేత్రంలోకి రాకపోవడం వంటి పరిణామాలు బీఆర్ఎస్ బలహీనపడుతుందనే అభిప్రాయానికి బలం చేకూరుస్తున్నాయి. ఈ పరిణామాలన్నీ పార్టీ హార్డ్‌కోర్ కార్యకర్తలు, అభిమానులను కలవరపెడుతున్నాయి.బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉండగా ప్రతిష్టాత్మకంగా భావించిన కాళేశ్వరం ప్రాజెక్టు ఇప్పుడు ఆ పార్టీకి పెను శాపంగా మారింది. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికలో ప్రాజెక్టులో జరిగిన అవకతవకలకు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యక్షంగా బాధ్యత వహించాలని పేర్కొనడం కేసీఆర్ ప్రతిష్టను తీవ్రంగా దెబ్బతీసింది. ఒక ప్రాజెక్ట్ వైఫల్యం, దానిపై వచ్చిన అవినీతి ఆరోపణలు పార్టీ నైతిక బలంపై ప్రభావం చూపుతాయి. ఈ నివేదిక బీఆర్ఎస్ కేడర్‌లో ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసిందన్నది నిర్వివాదాంశం. వీటికి తోడు గొర్రెల స్కామ్, ఫోన్ ట్యాపింగ్ కేసు, కేటీఆర్‌పై ఫార్ములా కార్ రేస్ కేసు వంటివి కూడా పార్టీకి ప్రతికూలంగా మారాయి.కాళేశ్వరం సంక్షోభం ఒకవైపు ఉండగానే, మరోవైపు బీఆర్ఎస్ అధినేత కుమార్తె, ఎమ్మెల్సీ కవిత వ్యవహారశైలి పార్టీలో గందరగోళానికి కారణమవుతోంది. సొంత పార్టీ నాయకులపై, ముఖ్యంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై పరోక్ష విమర్శలు చేస్తూ ఆమె చేస్తున్న వ్యాఖ్యలు పార్టీలో అంతర్గత ఆధిపత్య పోరును స్పష్టం చేస్తున్నాయి. ఈ కుటుంబ కలహాలు క్యాడర్‌ను అయోమయానికి గురిచేస్తున్నాయి. నాయకత్వంలో ఐక్యత లేకపోవడం పార్టీ పటిష్టతకు పెద్ద అవరోధంగా మారుతుంది. లిక్కర్ కేసులో జైలుకు వెళ్లినప్పుడు తనకు పార్టీ అండగా లేదని పదే పదే చెబుతున్న కవిత, ఇప్పుడు బీసీ రిజర్వేషన్ల కోసం పార్టీకి సంబంధం లేకుండా 72 గంటల నిరాహార దీక్షకు దిగారుఅధికారం కోల్పోయిన తర్వాత ఒక రాజకీయ పార్టీకి ప్రతిపక్ష పాత్ర అత్యంత కీలకం. కానీ బీఆర్ఎస్ ఈ విషయంలో పూర్తిగా విఫలమైందనే విమర్శలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వంపై బలమైన ప్రతిపక్షంగా నిలబడటంలో బీఆర్ఎస్ నాయకత్వం పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ప్రభుత్వ లోపాలను ప్రజల్లోకి తీసుకెళ్లే విషయంలోనూ నిశ్శబ్దంగా ఉంది. ఇది ప్రజల్లో పార్టీపై నమ్మకాన్ని సన్నగిల్లేలా చేస్తోంది. ఇచ్చిన ప్రధాన వాగ్దానాల్లో రైతు రుణ మాఫీ, రైతు భరోసా వంటి వాటిని కూడా కాంగ్రెస్ సంపూర్ణంగా అమలు చేయలేని పరిస్తితి ఉంటే దీనిపై కేవలం మాజీ మంత్రి హరీష్ రావు లాంటి ఒకరిద్దరు నేతలు మాత్రమే ఆందోళన చేశారు. అధికారంలో ఉన్నప్పుడు కుటుంబ పార్టీగా మారిన బీఆర్ఎస్.. ఇప్పుడు ప్రతిపక్ష పాత్ర పోషించేందుకు కుటుంబేతర నేతల వైపు చూడాల్సి వచ్చినా ఎవరూ ఆ స్థాయిలో స్పందించలేని దుస్థితి.బీజేపీలో బీఆర్ఎస్ విలీనం ఊహాగానాలు కూడా పార్టీని మరింత బలహీనపరుస్తున్నాయి. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు తన అనుచరుల వద్ద ఈ ఊహాగానాలను ప్రస్తావిస్తూ పార్టీకి రాజీనామా చేయడం దీనికి తాజా ఉదాహరణ. ఇది పార్టీ నాయకత్వం, భవిష్యత్తుపై ఉన్న సందేహాలకు అద్దం పడుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో పార్టీని నమ్ముకున్న నాయకులు ప్రత్యామ్నాయ మార్గాలను వెతుక్కునే అవకాశం ఉంది. బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేయాలన్న కుట్ర జరుగుతోందంటూ స్వయంగా కేసీఆర్ కూతురు కవిత వ్యాఖ్యానించడం పార్టీ నేతలు ఇతర పార్టీలకు వలస వెళ్లేలా ప్రేరేపించినట్టయింది.బీఆర్ఎస్ రజతోత్సవ సభ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపకపోవడం, కేసీఆర్ ప్రజాక్షేత్రంలోకి రాకపోవడం వంటివి పార్టీ నాయకత్వంలో ఉన్న స్తబ్దతకు నిదర్శనాలు. పార్టీ అధ్యక్షుడిగా, మాజీ ముఖ్యమంత్రిగా కేసీఆర్ క్రియాశీలకంగా వ్యవహరించకపోవడం కార్యకర్తల్లో నిరాశను కలిగిస్తోంది. ఒక బలమైన నాయకుడు లేకపోవడం వల్ల పార్టీని నడిపించేందుకు సరైన దిశానిర్దేశం కొరవడింది.ఈ పరిణామాలన్నీ బీఆర్ఎస్‌కు ఒక సవాల్‌గా మారాయి. కాళేశ్వరం ప్రాజెక్టుపై వచ్చిన నివేదిక, కుటుంబంలో ఆధిపత్య పోరు, బలహీనమైన ప్రతిపక్ష పాత్ర, నాయకత్వ స్తబ్దత వంటి కారణాలు బీఆర్ఎస్‌ను బలహీనపరుస్తున్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. క్షేత్రస్థాయిలో ప్రజల చర్చ కూడా ఇదే రీతిలో సాగుతోంది. పార్టీ తిరిగి పుంజుకోవాలంటే కేసీఆర్ వల్లే సాధ్యమవుతుందని ప్రజలు, కార్యకర్తల నుంచి ఆశాభావం వ్యక్తమవుతోంది. కానీ బీఆర్ఎస్‌లోని ఈ పరిణామాలను కాంగ్రెస్, బీజేపీ సొమ్ము చేసుకునే అవకాశం ఉంది. బీఆర్ఎస్ పార్టీ శ్రేణులను తమ వైపు తిప్పుకోవాలన్న వ్యూహాలను రచించే సూచనలు కనిపిస్తున్నాయి.

# రాజీవ్ స్వగృహ వేలం రూ.100 కోట్లు

హైదరాబాద్, ఆగస్టు 7, సొంత ఇల్లు అనేది ప్రతీ ఒక్కరి కల. దీనిని నెరవేర్చుకోవడానికి చాలా మంది తమ సంపాదనలో సేవింగ్స్ చేసుకుంటున్నారు. ప్రతీ నెల 30 శాతం వరకు డబ్బులను ఆదా చేసుకొని.. ఫ్లాట్ లేదా ఇండిపెండెంట్ హౌస్‌లను కొనుగోలు చేస్తుంటారు. ఇలా వారి సొంతింటి కలను సాకారం చేసుకుంటారు. అయితే ప్రభుత్వం కొన్ని ప్లాట్లను తక్కువ ధరలకు వేలం వేసి విక్రయిస్తున్నారు. దీనిలో వాటిని కొనుగోలు చేసేందుకు పోటీ కూడా ఎక్కువగా ఉంటుంది. దీనిలో భాగంగా మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లాలోని ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలోని రాజీవ్ స్వగృహ ప్లాట్లకు వేలం వేయగా దాదాపు రూ.100 కోట్ల వరకు ఆదాయం వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు.ప్రతి ఒక్కరి కల సొంత ఇల్లు. దీనిని నిజం చేసుకోవడానికి చాలామంది తమ కష్టార్జితంలో కొంత భాగాన్ని పొదుపు చేస్తూ ఉంటారు. సాధారణంగా.. వేతనం పొందే వ్యక్తులు నెలవారీ ఆదాయంలో 30 శాతం వరకు ఆదా చేసి.. ఆ తర్వాత స్థలం లేదా ఇంటిని కొనుగోలు చేస్తుంటారు. ఇదిలా ఉంటే.. ఇల్లు కొనుగోలు చేసే వారికి అదనంగా ప్రభుత్వం తక్కువ ధరలకే ప్లాట్లను వేలం వేయడం వంటి కార్యక్రమాలు ఎంతో సహాయంగా నిలుస్తున్నాయి. తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలోని రాజీవ్ స్వగృహ పథకం ద్వారా వేలం వేసిన ప్లాట్లకు తాజాగా భారీ స్పందన లభించింది. ఈ వేలంలో సుమారు రూ. 100 కోట్లకు పైగా ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు.మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని బహదూర్‌పల్లిలో ఉన్న రాజీవ్ స్వగృహ ప్లాట్ల వేలానికి అనూహ్యమైన స్పందన లభించింది. ఈ విషయాన్ని రాజీవ్ స్వగృహ మేనేజింగ్ డైరెక్టర్ వీపీ గౌతం వెల్లడించారు. మేడ్చల్ ప్రాంతంలో రియల్ ఎస్టేట్ విలువ అంచనాలకు మించి పెరిగిందడంలో ఈ వేలం మరోసారి రుజువు చేసింది. మంగళవారం జరిగిన బహిరంగ వేలంపాటలో మొత్తం 68 ప్లాట్లకు గాను.. తొలి రోజు 50 ప్లాట్లకు వేలం నిర్వహించారు. రాత్రి 8 గంటల వరకు జరిగిన ఈ వేలంపాటలో గరిష్టంగా చదరపు గజం ధర రూ. 46,500 పలికినట్లు గౌతం తెలిపారు. వేలం నిర్వహించిన 50 ప్లాట్ల విక్రయం ద్వారా సుమారు రూ. 100 కోట్ల మేర ఆదాయం వచ్చిందని మేనేజింగ్ డైరెక్టర్ వీపీ గౌతం తెలిపారు.సుమారు 119 మంది ఈ ప్లాట్లను కొనుగోలు చేయడానికి పోటీ పడ్డారు. సగటున ప్రతీ ఒక్క ప్లాట్‌కు 30 మందికి పైగా పోటీ పడ్డారంటే.. వీటికి ఎంత డిమాండ్ ఉందో అర్థం చేసుకోవచ్చు. అంతే కాకుండా.. ఈ ప్లాట్లు ఔటర్ రింగ్ రోడ్డుకు(ఓఆర్ఆర్) అతి సమీపంలో ఉండటం కూడా ఈ భారీ డిమాండ్‌కు ఒక కారణంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న నిపుణులు చెబుతున్నారు. వేలంలో విక్రయించబడని ఈ ప్లాట్లు 200 నుంచి 1000 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్నాయి. వీటిలో కార్నర్ ఫ్లాట్‌కు రూ. 30,000.. మిడిల్, ఇతర ఫ్లాట్లకు రూ. 27,000 కనీస ధరగా నిర్ణయించారు. ఈప్రభుత్వం ఈ రకమైన వేలం ప్రక్రియను చేపట్టడం వల్ల ప్రభుత్వ ఖజానాకు గణనీయమైన ఆదాయం వస్తుంది. మరోవైపు.. రియల్ ఎస్టేట్ వ్యాపార మార్కెట్‌లో పెరుగుతున్న ధరల నేపథ్యంలో.. ప్రభుత్వం తక్కువ ధరలకే ఈ ప్లాట్లను వేలం వేయడం వల్ల సామాన్య ప్రజలకు కూడా సొంతింటి కలను నిజం చేసుకునే అవకాశం లభిస్తుంది. ముఖ్యంగా.. అభివృద్ధి చెందుతున్న నగరాలకు దగ్గరగా ఉన్న ప్రాంతాల్లో భూముల ధరలు పెరగడం.. మౌలిక సదుపాయాలు మెరుగుపడటంతో ఇటువంటి వేలం పాటలు విజయవంతమవుతున్నాయి. హైదరాబాద్‌లోని ఔటర్ రింగ్ రోడ్డు చుట్టుపక్కల ప్రాంతాలు, ముఖ్యంగా మేడ్చల్, శంషాబాద్, నార్సింగి, కీసర వంటి ప్రాంతాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి.

# నల్గొండ బ్రదర్స్ చెరోదారి...

నల్గొండ, ఆగస్టు 7, తనకు మంత్రి పదవి దక్కకపోవడంపై అసంతృప్తితో ఉన్న మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అవకాశం దొరికినప్పుడల్లా తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వంతో పాటు, పార్టీ అధిష్ఠానంపై విమర్శనాస్త్రాలు సంధిస్తూనే ఉన్నారు. మరోవైపు ఆయన సోదరుడు, మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి సీఎం రేవంత్‌రెడ్డికి అండగా నిలుస్తూ.. ఆయనకు మద్దతుగా మాట్లాడుతుండటం రాజకీయవర్గాల్లో కలకలం రేపుతోంది. ఆ క్రమంలో ఈ అన్నదమ్ములు వ్యవహారం ఉమ్మడి నల్గొండ జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది. వైఎస్ శిష్యులుగా పొలిటికల్ ఎంట్రీ ఇచ్చిన కోమటిరెడ్డి సోదరులు. కోమటిరెడ్డి బ్రదర్స్ కాంగ్రెస్ పార్టీలో ఫైర్ బ్రాండ్స్. రాష్ర వ్యాప్తంగా మంచి గుర్తింపు ఉన్న లీడర్స్. ఉమ్మడి రాష్ట్ర కాంగ్రెస్‌లో దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి శిష్యులుగా రాజకీయాల్లోకి వచ్చి నల్లగొండ జిల్లాలో తనదైన ముద్ర వేసుకున్నారు. గతంలో ఇద్దరు ఎం మాట్లాడిన ఎం చేసినా కలిసి కట్టుగా ముందుకు వెళ్ళే వారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడం లేదనే చర్చ జరుగుతుందట. అలా అని వారిద్దరి మధ్య గొడవలు కూడా ఏమి లేవని, ఇద్దరి అభిప్రాయాలు భిన్నంగా ఉన్నాయని వారి సన్నిహితులు అంటున్నారు. అధికారంలోకి రాక ముందు పీసీసీ చీఫ్‌లపై మాటల దాడి. తెలంగాణ ఏర్పాటు తర్వాత కోమటిరెడ్డి బ్రదర్స్ తమదైన శైలిలో రాజకీయం చేశారు. కాంగ్రెస్‌లో కొనసాగుతూనే తమతమ ఎజెండాలు నడిపించారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు పీసీసీ చీఫ్‌లుగా వ్యవహరించిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ,రేవంత్ రెడ్డిలని ఇద్దరు వ్యతిరేకించి మాటల దాడి చేసేవారు.. తర్వాత కాంగ్రెస్‌ను కాదనుకుని రాజగోపాల్‌రెడ్డి పార్టీని వదులుకుని బయటకు వెళ్లి తిరిగొచ్చారు. కానీ ఇప్పుడు కోమటిరెడ్డి వెంకటరెడ్డి మంత్రిగా సీఎం రేవంత్ రెడ్డికి అనుకూలంగా ఉంటే?మంత్రి పదవి రాని రాజగోపాల్ రెడ్డి వ్యతిరేకంగా ఉన్నారనే టాక్ కాంగ్రెస్‌లో నడుస్తోంది. సీఎం ఎవరనేది హైకమాండ్ నిర్ణయిస్తుందని రాజగోపాల్ ట్వీట్. పదేళ్లు తానే సీఎం గా ఉంటా రాసి పెట్టుకో కెసిఆర్ అంటూ పాలమూరు నుంచి సవాల్ విసిరిన రేవంత్ రెడ్డికి ఆ మరునాడే ట్వీట్ ద్వారా కౌంటర్ ఇచ్చే ప్రయత్నం చేశారు రాజగోపాల్ రెడ్డి. కాంగ్రెస్ పార్టీ జాతీయ పార్టీ, ఎవరు సీఎం అనేది పార్టీలో నిర్ణయించి హైకమాండ్ నిర్ణయం తీసుకుంటుందని ట్వీట్ చేశారు. రాజగోపాల్ రెడ్డి చేసిన ట్వీట్‌ను ఎవరూ పట్టించుకోనప్పటికి?ఆయన ట్వీట్ చేసిన మర్నాడే సోదరుడు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. సీఎం రేవంత్‌పై రాజ్‌గోపాల్‌రెడ్డి అసంతృప్తి రాగం వ్యక్తం చేస్తుంటే ఆయన సోదరుడు వెంకట్‌రెడ్డి సీఎంకు మద్దతుగా నిలవడం హాట్ టాపిక్‌గా మారింది. నల్గొండ జిల్లా కేంద్రంలో నిర్మించిన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభించాక సీఎం రేవంత్‌రెడ్డికి ఫోన్ చేశారు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి. తెలంగాణకు మళ్లీ మీరే సీఎం కావాలని ఆకాంక్షించారు. మరోసారి మీరు సీఎం అయ్యేందుకు గణపతి పూజతోపాటు హోమం కూడా చేశానని తన మనోగతాన్ని సీఎంతో పంచుకున్నారు మంత్రి కోమటిరెడ్టి. దీంతో అన్ని పార్టీల నేతలు కోమటిరెడ్డి బ్రదర్స్ పరస్పర వైఖరిపై చర్చించుకుంటున్నారట. అన్న ఇలా తమ్ముడు అలా మాట్లాడటం ఎవరికీ అంతు పట్టడంలేదట. అయితే సీఎం రేవంత్ కు మాత్రం కోమటిరెడ్డి వెంకటరెడ్డి వ్యాఖ్యలు బలాన్ని చేకూర్చినట్టైందనే టాక్ పార్టీ నేతల్లో నడుస్తోందట. మంత్రి పదవి కాపాడుకోవడం కోసం ఒకరు మాట్లాడుతున్నారా?మంత్రి పదవి రాలేదనే కోపంతో మరొకరు మాట్లాడుతున్నారా అనే చర్చ పొలిటికల్ సర్కిల్స్‌లో నడుస్తోందట. మొత్తంగా అన్నదమ్ములిద్దరూ విరుద్ధంగా స్పందించడం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి

# సినియర్ సిటిజన్ మెయింటెనెన్స్ కేసులు ఆన్ లైన్ పోర్టల్ లో నమోదు :: జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ

సినియర్ సిటిజన్ సంరక్షణ చట్టం అమలు కు పకడ్బందీ చర్యలు

సీనియర్ సిటిజన్ సంరక్షణ చట్టం పై పత్రిక ప్రకటన విడుదల చేసిన జిల్లా కలెక్టర్



**రాజన్న సిరిసిల్ల జిల్లా, ఆగస్టు 07: (ప్రజాబలం ప్రతినిధి)** సినియర్ సిటిజన్ మెయింటెనెన్స్ కేసులు ఆన్ లైన్ పోర్టల్ లో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.సీనియర్ సిటిజన్స్ సంరక్షణ చట్టం అమలులో భాగంగా తెలంగాణ సీనియర్ సిటిజన్స్ మెయింటెనెన్స్ కేసులో మానిటరింగ్ సిస్టం తయారు చేయడం జరిగిందని అన్నారు . సీనియర్ సిటిజన్ మెయింటెనెన్స్ కేసులు ఆఫ్ లైన్ లో కాకుండా, ఆన్ లైన్ పోర్టల్ %వ్జు:ెూ//స్టవజఅశీతీఎఱఅ-ఓవఅం.ఎస్ణ్వ.న్గబీఐ.ఱఅ% లో నమోదు చేయాలని అన్నారు. మీసేవ కేంద్రాలలో సీనియర్ సిటిజన్ కేసుల ఆన్ లైన్ ఫైలింగ్ చేపట్టాలని అన్నారు. ఆన్ లైన్ లో కేసు పురోగతి వివరాలు ఎప్పటికప్పుడు తెలుస్తాయని అన్నారు. సిరిసిల్ల జిల్లాలో సీనియర్ సిటిజన్ సంరక్షణ చట్టం అమలుకు పకడ్బందీ చర్యలు అధికారులు తీసుకోవాలని కలెక్టర్ ఈ ప్రకటనలో పేర్కొన్నారు

# మాకు న్యాయం చేయండి...... భూమిపుత్ర సొసైటీ సభ్యులు



గిరిజనులకు జరిగిన అన్యాయాన్ని వెలుగులోకి తెచ్చిన వార్తా కథనాలను తప్పుడు కథనాలని అనడం దుర్మార్గమని చర్ల మండలం మొగళ్ళపల్లి గ్రామానికి చెందిన భూమిపుత్ర గిరిజన మహిళా సొసైటీ సభ్యులు, వారి కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తంచేశారు.మీడియాలో కథనాలు వచ్చిన తర్వాతనే సొసైటీకి సంబంధించిన పుస్తకాలను రేజింగ్ కాంట్రాక్టర్ కమిటీ సభ్యులకు ఇచ్చారని వారన్నారు.ఇసుక రీచ్ మంజూరు అవడానికి రేజింగ్ కాంట్రాక్టర్ కోట్లు ఖర్చు పెట్టారని అందువల్లనే పుస్తకాలు ఆయన దగ్గర ఉంచాడని సొసైటీ అధ్యక్షురాలు తమతో గొడవ పడడం నిజం కాదా,ఆ గొడవ పోలీస్ స్టేషన్ వరకూ చేరడం నిజం కాదా అని వారు ప్రశ్నించారు.గ్రామ పంచాయితీ కార్యాలయంలో జరగవలసిన విచారణ రేజింగ్ కాంట్రాక్టర్ ఇంటి వద్ద జరిగిన విషయం అబద్ధమా, అధికారులు కూడా రేజింగ్ కాంట్రాక్టర్ తో కుమ్మక్కై తమను అన్యాయం చేస్తూ తమకు అనుకూలంగా ఉన్న పత్రికలలో అన్యాయం చేస్తున్న వ్యక్తిని అందరి వాడు అని డబ్బులిచ్చి కథనాలు రాయించుకున్నారని మండిపడ్డారు.అక్రమాలు చేసే వ్యక్తులను ఆహా ఓహో అంటూ రాసే వారు గిరిజనులకు జరిగిన అన్యాయాన్ని తమ పత్రికల్లో ఎందుకు రాయరని ప్రశ్నించారు.

ప్రభుత్వ అధికారులు సైతం పారదర్శకంగా వ్యవహరించడం లేదని ఈ సందర్భంగా ఆరోపించారు భూమిపుత్ర సొసైటీ ఆధ్వర్యంలో జరుగుతున్న అక్రమాలకు సంబంధించిన అన్ని ఆధారాలు తమ వద్ద ఉన్నాయని జిల్లా కలెక్టర్ భద్రాచలం ఐటీడీఏ పీఓ తెలంగాణ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు ఆఫీసర్ మరియు పాత్రికేయులందరి సమక్షంలో బహిరంగ విచారణకు మేము సిద్ధం అని ఈ సందర్భంగా వారు తెలియజేశారు . చర్ల మండలంతో పాటు భద్రాచలం డివిజన్ లో ఉన్న పాత్రికేయులందరూ మొగళ్ళపల్లి వచ్చి వివరాలు తెలుసుకొని తమకు జరిగిన అన్యాయాన్ని బహిర్గత పరచాలని కోరారు

# ప్రభుత్వ విద్యాలయాల విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి శిక్షణ.

**లక్షలు విలువ చేసే ఆన్లైన్ శిక్షణ ఉచితంగా అందజేత.**

**ఉచిత ఆన్లైన్ తరగతులు విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.**

**కలెక్టర్ సందీప్ కుమార్ ఝ.**

**సిరిసిల్ల, తంగళ్ళపల్లి, ముస్తాబాద్ మండలాల్లో ఆన్ అకాడమీ ఆన్లైన్ తరగతులను కేకే మహేందర్ రెడ్డి తో కలిసి ప్రారంభించిన కలెక్టర్.**



**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, ముస్తాబాద్, ( ప్రజాబలం ),** ప్రభుత్వ రెసిడెన్షియల్ విద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థులకు లక్షల విలువైన కార్పొరేట్ స్థాయి శిక్షణ ఉచితంగా అందిస్తున్నామని కలెక్టర్ సందీప్ కుమార్ ఝ తెలిపారు.

సిరిసిల్ల పట్టణంలోని మహాత్మ జ్యోతిబాపూలే బాలికల, బద్దెనపల్లిలోని సోషల్ వెల్ఫేర్, సారంపల్లిలోని ట్రైబల్ వెల్ఫేర్, నేరెళ్లలోని తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్, ముస్తాబాద్ లోని సోషల్ వెల్ఫేర్ స్కూల్ %ం% కళాశాలలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఆన్ అకాడమీ ఆన్లైన్ క్లాస్ లను శుక్రవారం కేకే మహేందర్ రెడ్డి తో కలిసి కలెక్టర్ గురువారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్య ద్వారానే మార్పు సాధ్యమని స్పష్టం చేశారు. ప్రభుత్వ రెసిడెన్షియల్ విద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థుల కోసం ప్రభుత్వం లక్షల విలువ చేసే ఆన్లైన్ శిక్షణ తరగతులు ఉచితంగా ఇస్తుందని వెల్లడించారు. విద్యార్థి పాఠాలు చక్కగా విని నోట్స్ రాసుకోవాలని సూచించారు. రోజు వాటిని మరోసారి చదువుకోవాలని పేర్కొన్నారు. పాఠశాలలో ఏమైనా సందేహాలు వస్తే నివృత్తి చేసుకోవాలని సూచించారు. శిక్షణలో భాగంగా వచ్చే టెస్ట్ సిరీస్ ను ప్రాక్టీస్ చేయాలని కలెక్టర్ తెలిపారు. దీంతో ఐఐటి, జేఈఈ, నీట్ తదితర జాతీయ స్థాయి పరీక్షల్లో రాణించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

దేశంలోని నిపుణులైన టీచర్లచే పిల్లలకు బోధన జరుగుతుందని, ఢిల్లీలో విద్యార్థులకు అందే శిక్షణ నేడు సాంకేతికను వినియోగించుకొని రాజన్న సిరిసిల్ల జిల్లాలోని విద్యార్థులకు కూడా అందిస్తున్నామని కలెక్టర్ తెలిపారు.

ప్రతిరోజు కనీసం రెండు గంటల పాటు ఆన్లైన్ కోచింగ్ తీసుకోవాలని తెలిపారు. విద్యార్థి జీవితంలో 10,11,12 వ తరగతులు మూడు సంవత్సరాలు చాలా కీలక సమయమని, ముఖ్యమైన పాఠ్యాంశాలలో బేసిక్స్ లో ఇంటర్లో ప్రారంభమవుతాయని వివరించారు. విద్యార్థులకు ఏదైనా ఇబ్బందులు ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకొని వస్తే సత్వరమే పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. శిక్షణ తరగతులు సద్వినియం చేసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

కేకే మహేందర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేస్తూ పేదల విద్యపై నిరంతరం కృషి చేస్తూ పెద్ద ఎత్తున పేదలకు నిధులు ఖర్చు చేస్తుందన్నారు. జిల్లాలో పిల్లలకు ఆన్లైన్ తరగతుల ద్వారా ప్రవేశ పరీక్షలకు ఉచితంగా శిక్షణ అందించేందుకు కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపుతున్నారు అని పేర్కొన్నారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝ కు అభినందనలు తెలిపారు.



ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, కళాశాలల ప్రిన్సిపల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ బిల్లుల వ్యవహారంలో ఏఈ సస్పెండ్. జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.



**ఆగస్టు 07, 2025-నిర్మల్ (ప్రజాబలం ప్రతినిధి:** ముధోల్ మండలంలోని ఎడ్ బిడ్ పీఆర్ పనుల్లో నకిలీ బిల్లుల వ్యవహారం వెలుగులోకి రావడంతో అక్కడి అసిస్టెంట్ ఇంజినీర్ (ఏఈ) సురేందర్‌ను సస్పెండ్ చేసినట్లు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు.

ఈ వ్యవహారం తమ దృష్టికి వచ్చాక తదుపరి విచారణకు ఆదేశించినట్లు కలెక్టర్ గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. నకిలీ బిల్లుల వ్యవహారం నిజమేనని తేలినందున ఆయన్ను సస్పెండ్ చేయడం జరిగిందని చెప్పారు.

ప్రభుత్వ ఉద్యోగులు చట్టవిరుద్ధంగా వ్యవహరించకూడదని, భవిష్యత్‌లో ఇటువంటి అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ఉద్యోగులందరూ క్రమశిక్షణతో, నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని సూచించారు.

## పశువులకు వ్యాధులు రాకుండా చర్యలు తీసుకోండి: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**ఆగస్టు 07, 2025-నిర్మల్ (ప్రజాబలం ప్రతినిధి:** పశువులకు వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.

గురువారం లక్ష్మణచాంద మండలం కనకాపూర్ గ్రామంలో నిర్వహించిన పశువుల టీకాలు వేసే కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు.

ఈ సందర్భంగా పశువైద్యులతో కలెక్టర్ మాట్లాడి బ్లూ టంగ్ వ్యాధి నివారణకు ఇచ్చే టీకాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. వ్యాక్సినేషన్‌కు సంబంధించిన రిజిస్టర్లు, నమోదు వివరాలను తనిఖీ చేశారు. వర్షాకాలంలో వ్యాధులు విస్తరించే ప్రమాదం ఎక్కువగా ఉండడంతో, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పశువుల్లో అనుమానాస్పద లక్షణాలు కనిపించిన వెంటనే పశువైద్యులను సంప్రదించాలని రైతులకు సూచించారు. టీకాల కార్యక్రమాలను సమయానికి పూర్తి చేయాలని, పశు రైతులు తమ పశువులకు విధిగా టీకాలు వేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి అంబాజీ, ఎంపిడిఓ రాధా రాథోడ్, పశువైద్య అధికారి శ్రీనివాస్, అధికారులు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు

# కోనరావుపేట లో కమ్యూనిటీ కాంటాక్ట్ లో భాగంగా రోడ్డు భద్రత, మాదకద్రవ్యాల పై అవగాహన.



**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, కోనరావుపేట, ( ప్రజాబలం ),** గురువారం రోజున కోనరావుపేట మండల కేంద్రంలో రోడ్డు భద్రత, మాదకద్రవ్యాల వినాశక ప్రభావం, డయల్ 100 సేవలపై పోలీసులు అవగాహన కల్పించారు. కోనరావుపేట స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్ ఐ. ప్రశాంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రతి పౌరుడు ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని, హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనం నడపడం, మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రమాదకరమే కాకుండా నేరం కూడా. ఇటువంటి ఉల్లంఘనలపై కేసులు నమోదు చేసి కోర్టుకు తరలిస్తామని ఎస్సై తెలిపారు.

అతివేగం, మొబైల్ వాడకం వంటి అలవాట్లే రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణమని పేర్కొన్నారు. ప్రజలంతా పోలీసులతో కలిసి రోడ్డు భద్రత నియమాలను పాటించాలని ఎస్సై కోరారు.

మాదకద్రవ్యాల విషయంలో మాట్లాడుతూ గంజాయి, హెరాయిన్, బ్రౌన్ షుగర్ వంటి మత్తు పదార్థాలు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని నాశనం చేస్తాయి. డ్రగ్స్ వినియోగం వ్యక్తిగత జీవితమే కాకుండా కుటుంబం, భవిష్యత్తును కూడా నాశనం చేస్తుందని హెచ్చరించారు. డ్రగ్స్ వినియోగం లేదా విక్రయాన్ని గమనించిన వారు వెంటనే డయల్ 100 లేదా 1908 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు.

అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100 సేవల వినియోగం పై కూడా ఎస్సై అవగాహన కల్పించారు. ఎటువంటి గొడవలు, చోరీలు, మహిళలపై వేధింపులు, అనుమానాస్పద వ్యక్తుల కదలికలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని పిలుపునిచ్చారు. అయితే తప్పుడు సమాచారం ఇవ్వడం, మధ్య మధ్యలో ఫేక్ కాల్స్ చేయడం నేరమని, అటువంటి వారిపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమానికి గ్రామస్తులు, విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# అంగన్వాడి కేంద్రం-2 సంకపల్లిలో తల్లిపాల వారోత్సవాలు.



**వేములవాడ టౌన్,( ప్రజాబలం ),** గురువారం రోజున వేములవాడ అర్బన్ మండలం సంకపల్లి గ్రామంలో అంగన్వాడి కేంద్రం-2లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడి కేంద్రం టీచర్ దేవలక్ష్మి మాట్లాడుతూ తల్లిపాల వారోత్సవాలను వారం రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తల్లిపాలు బిడ్డకు ఎంత అవసరమో తెలియజేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అని, బిడ్డకు ఆరు నెలల వరకు తల్లిపాలు తప్ప ఏ ఇతర ద్రవ పదార్థాలు తాగించకూడదని తెలిపారు. బిడ్డ పుట్టిన గంటలోనే తల్లి యొక్క పసుపు రంగు చిక్కటి పాలు ( ముర్రుపాలు) అమృతం లాంటివని ఆమె పేర్కొన్నారు. వీటి ద్వారా బిడ్డకు అతి ముఖ్యమైన పోషకాలు లభిస్తాయని తెలిపారు. తల్లిపాలు బిడ్డ శరీరానికి, మెదడుకు కూడా పోషణ ఇస్తుందన్నారు. తల్లిపాలలో ఉన్న పోషక గుణాలు మరియు ఇతర పాలల్లో ఉండవని స్పష్టం చేశారు. మరి ముఖ్యంగా తల్లిపాలు శిశువును న్యూమోనియా, అతిసార వ్యాధి వంటి ప్రమాదకరమైన వ్యాధుల నుండి కాపాడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ దేవలక్ష్మి, ఏఎన్ఎం సంధ్య, ఆశ వర్కర్ రేణుక, ఆయమ్మ మునెమ్మ, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు

# టీమ్స్ ఆసుపత్రి నిర్మాణం పనులను పర్యవేక్షించిన మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి



**ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఆగస్టు 7:**అల్వాల్ లోని వెయ్యి పడకల టీమ్స్ ఆసుపత్రి నిర్మాణం పనులను మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి పరిశీలించారు.

గురువారం అల్వాల్ లోని టీమ్స్ ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించి ఇప్పటి వరకు నిర్మాణం పూర్తయిందని ఇంకా ఎంత పని పెండింగ్లో ఉందని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు నర్సింగ్ కాలేజ్ ఎక్కడ నిర్మిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు.

పరిపాలన పరమైన అనుమతులు కొరకు సంబంధిత కార్యదర్శులతో మాట్లాడుతానని కలెక్టర్ తెలిపారు.

ఆసుపత్రి భవన నిర్మాణం మొత్తము 7 అంతస్తులలో నిర్మాణం జరుగుతుందని డిసెంబర్ 2025 వరకు పూర్తవుతుందని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు కలెక్టర్కు వివరించారు అదేవిధంగా ఆసుపత్రి నిర్వహణకు అవసరమైన భారీ వైద్య పరికరాలు అమర్చేందుకు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు ఈ కార్యక్రమంలో అల్వాల్ ఎమ్మార్వో రాములు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

# మహిళ పట్ల ఫోన్లో అసభ్యకరంగా వ్యవహరించిన వ్యక్తి రిమాండ్ కు తరలింపు.

మహిళలను ప్రత్యక్షంగా గాని, ఫోన్ ద్వారా గాని, సోషల్ మీడియా ద్వారా గాని వేధిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు. వేములవాడ రూరల్ ఎస్సై అంజయ్య.




**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** వేములవాడ రూరల్ మండలం అచ్చన్న పల్లి గ్రామానికి చెందిన సంతోష్ అనే వ్యక్తి ఒక మహిళ పట్ల ఫోన్లో అసభ్యకరంగా మాట్లాడడం, వేధించడం వంటి చర్యల కారణంగా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్ కు తరలించడం జరిగిందని వేములవాడ రూరల్ ఎస్సై అంజయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై అంజయ్య మాట్లాడుతూ మహిళల పట్ల అసభ్యకరంగా వ్యవహరించిన, మహిళలను శారీరకంగా, మానసికంగా హింసించిన, ఫోన్ ద్వారా గాని, సోషల్ మీడియా ద్వారా గాని మహిళలను వేధించిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, మహిళలు వారిపై జరుగుతున్న చర్యలు మౌనంగా భరించవద్దు అని, ధైర్యంగా ముందుకు వచ్చి సంబంధిత పోలీస్ స్టేషన్లో గాని, జిల్లా షీ టీంకు గాని సంప్రదించాలని బాధిత మహిళా మహిళ వివరాలు గోప్యంగా ఉంచుతామని సూచించారు

# హుజురాబాద్ లో కార్డన్ సెర్చ్



**హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి ఆగస్టు 7** కరీంనగర్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఆదేశాల మేరకు గురువారం రోజు తెల్లవారుజామున హుజురాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో హుజురాబాద్ టౌన్ ఏరియాలో గల మామిళ్ల వాడ లో " కమ్యూనిటీ కాంటాక్ట్ " అనే ప్రోగ్రాం ద్వారా ప్రజలతో పోలీస్ కాంటాక్ట్, భద్రత కలిగించే విషయంగా మామిండ్ల వాడలోని అనుమానితులను అనుమానిత ప్రదేశాలను చెక్ చేశారు. గంజాయి మత్తు పదార్థాలు సైబర్ క్రైమ్ వాటిపై అవగాహన కల్పించారు. ఇట్టి చెకింగ్ లో పోలీసు వారు 57 ద్విచక్ర వాహనాలను, 7 ఆటోలను, 8 ట్రాక్టర్లను , రెండు బులోరాలను ఒక కారును సీజ్ అయినది. అనంతరం వాహనదారులకు కౌన్సిలింగ్ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో డిసిపి వెంకటరమణ ,ఏసిపి హుజురాబాద్ మాధవి, హుజురాబాద్ టౌన్ ఇన్స్పెక్టర్ కరుణాకర్ రూరల్ సిఐ జమ్మికుంట టౌన్ ,జమ్మికుంట రూరల్ సిఐ,సబ్ డివిజన్ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీసులు, స్పెషల్ పార్టీ పోలీసులు సబ్ డివిజన్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

# చేనేత కార్మికులకు ఫ్రూట్స్ పంపిణీ జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఆధ్వర్యంలో



**హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి ఆగస్టు 7** జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా గురువారం అర్థ శాస్త్ర విభాగం,జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, ఇన్ చార్జి ప్రిన్సిపాల్ పట్టణంలోని బాలాజీ చేనేత సహకార సంఘం కార్మికులకు ఫ్రూట్స్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఇన్ చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ఓ. కుమార్ మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో చేనేత రంగం పోషించిన పాత్రను కొనియాడారు.అర్థ శాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ కే. రాజేంద్రం మాట్లాడుతూ.. ప్రస్తుతం చేనేత రంగం ఎదుర్కొంటున్న సవాళ్లను వివరించారు. అనంతరం విద్యార్థులు, అధ్యాపకులు 40 మంది చేనేత కార్మికులకు ఫ్రూట్స్ పంపిణీ చేసి జాతీయ చేనేత దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు

# గ్రామీణ వైద్యులకు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు అందించి చట్ట బద్ధంగా రక్షణ కల్పించాలి సి.పి.యం.పార్టీ కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

గ్రామీణ వైద్యులపై రాష్ట్రవ్యాప్తంగా చేస్తున్న టీజీఎంసీ దాడులను ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలి

గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పిట్టల నాగేశ్వరరావు



**ఖమ్మం ప్రతినిధి ఆగస్టు 7 (ప్రజాబలం)** ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండలం మారెమ్మగుడి వద్ద ఉన్న దుశ్యంత్ రెడ్డి ఫంక్షన్ హాలు నందు గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు , రాష్ట్ర ఉపాధ్యక్షులు పిట్టల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జనరల్ బాడీ సమావేశము నిర్వహించారు . ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఖమ్మం జిల్లా సి.పి.యం. పార్టీ కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు , ఖమ్మం నగర బి.ఆర్.యస్ పార్టీ అధ్యక్షులు జిల్లా నాయకులు పగడాల నాగరాజు స్వర్ణ సామాజిక అధ్యయన వేదిక అధ్యక్షులు %ు% తెలంగాణ ఉద్యమనేత కాకి భాస్కర్ ప్రముఖ సీనియర్ అడ్వకేట్ తెలంగాణ ఉద్యమనేత మేకల సుగుణరావు ఐ.ఎన్.టి.యు.సి. వర్కింగ్ ప్రెసిడెంట్ యం.డి. వై. పాషా లు పాల్గొన్నారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్యో నారాయణ అంటూ గ్రామీణ వైద్యులు పేదలకు సేవలు అందిస్తూ వారి మనలను పొందుతూ వస్తుంటే గ్రామీణ వైద్యులపై టి.జి.యం.సి దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు . ఎవరో ఒకరు ఇద్దరు చేసిన తప్పులకు గ్రామీణ వైద్యులు అందరూ ఆ నిందను మోస్తున్నారని దీనిపై దృష్టి చారించి సమగ్ర విచారణ జరిపించి అసలైన నికాసైనా గ్రామీణ వైద్యులకు న్యాయం జరిగేలా చూడాలని అన్నారు . నిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రజా ఆరోగ్యాన్ని కాపాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాటుపడుతున్న గ్రామీణ వైద్యులపై టీజీఎంసీ చేస్తున్న దాడులను ఖండించాలని గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు , రాష్ట్ర ఉపాధ్యక్షులు పిట్టల నాగేశ్వరరావు , కార్యనిర్వాహణ సభ్యుడు అనంతరావు వెంకటాచారి లు పిలుపునిచ్చారు . వైద్యాన్ని ప్రజల దగ్గరకు తీసుకువెళ్లి , ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు, సూచనలు చేసి ఫస్ట్ ఎయిడ్ పరీక్షలు నిర్వహించి వారికి వెన్నుదన్నుగా , అండగా ఉంటున్న గ్రామీణ వైద్యులు నేడు సమాజానికి ఎంతో అవసరం అన్నారు



. అందుకే దేశంలో అన్ని ఉద్యమాలు వచ్చాయి కానీ వైద్య ఉద్యమం రాకపోవడానికి కారణం గ్రామీణ వైద్యులే . ఉమ్మడి జిల్లా నుండి వచ్చిన గ్రామీణ వైద్యులకు సీజనల్ వ్యాధులపై ప్రత్యేక అవగాహనను తెలియజేశారు . గ్రామీణ వైద్యులకు గత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇచ్చిన జీవో 429 , 428 , 1273 లను పునరుద్దరించాలని , గ్రామీణ వైద్యులకు పారామెడికల్ శిక్షణను ఇప్పించి చట్టబద్ధత కల్పించాలని వారు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు అదేవిధంగా గ్రామీణ వైద్యులపై టిజిఎంసి దాడులను ఖండిస్తూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో తీర్మానం చేశారు ఈ సమావేశంలో ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ మణికుమార్ ఎస్ సుదర్శన్ జి వెంకటరామయ్య కార్యదర్శి ఇంటూరి నాగరాజు , ప్రచార కార్యదర్శి బి కృష్ణమూర్తి సహాయ కార్యదర్శులు చంద్రారెడ్డి టి రాము కె. రాములు యల్. శ్రీనివాసరావు జి. వెంకటేశ్వర్లు దాసరి శ్రీనివాసరావు షేక్ హుస్సేన్ మియా రాయల శ్రీనివాసరావు ఎండి మహమూద్ సత్యం తదితరులు పాల్గొన్నా

# లింగంపేట గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం.

## సైబర్ మోసాలు, గంజాయి ముప్పు పై అవగాహన కల్పించిన ఎస్సై రమేష్.



**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, చందుర్తి, ( ప్రజాబలం ),** చందుర్తి మండలం లింగంపేట గ్రామంలో స్థానిక పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చందుర్తి ఎస్సై రమేష్ మాట్లాడుతూ ప్రజలు సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. సోషల్ మీడియా, ఫోన్ కాల్స్ ద్వారా మోసాలు జరుగుతున్న నేపథ్యంలో ఎటువంటి అనుమానాస్పద లింకులు, ఎస్ఎంఎస్లను క్లిక్ చేయవద్దని సూచించారు.

అలాగే గంజాయి దుర్వినియోగం పట్ల యువత తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో గంజాయి వినియోగం పెరుగుతున్నది, దీనివల్ల ఆరోగ్యమే కాకుండా భవిష్యత్తు ప్రమాదంలో పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఎస్ఐ చెప్పారు.

మొబైల్ గల్లంతయినప్పుడు సి ఈ ఐ ఆర్ ( సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటి రిజిస్టర్ ) పోర్టల్ ద్వారా ఫోన్ లాక్ చేయడం, ట్రాక్ చేయడం వంటి విషయాలు కూడా వివరించారు. ప్రజలు ఈ పోర్టల్ గురించి తెలుసుకొని ఉపయోగించుకోవాలని సూచించారు. ఇక త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రజలు తమ ఓటును చక్కగా వినియోగించుకోవాలని, ఎన్నికల సమయంలో ఎలాంటి అక్రమాలకు పాల్పడవద్దని సూచించారు.

ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చందుర్తి ఎస్సై రమేష్ ఇచ్చిన సూచనలను ఆసక్తిగా ప్రజలు విన్నారు

# రీజినల్ రింగ్ రోడ్ భూసేకరణ త్వరితగతిన పూర్తి చేయాలి

## జిల్లా కలెక్టర్ పి.ప్రావిణ్య




**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 07(ప్రజాబలం)**సంగారెడ్డి జిల్లా: సంగారెడ్డి/సంగారెడ్డి జిల్లా పరిధిలో నిర్మించబోయే రీజినల్ రింగ్ రోడ్ భూసేకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య గురువారం అధికారులను ఆదేశించారు,సంగారెడ్డి జిల్లా గిర్మాపూర్ నుంచి యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ వరకు. మొత్తం ఐదు ప్యాకేజీలుగా ఈ రహదారిని నిర్మించనున్నారు. దీని కోసం సంగారెడ్డి జిల్లా పరిధిలో భూమిని సేకరించాలని నిర్ణయించారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య, జిల్లా అధికారుల నుండి రీజినల్ రింగ్ రోడ్డు భూ సకరణ పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు,రైతులకు న్యాయమైన పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు,రీజినల్ రింగ్ రోడ్డు భూసేకరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు,ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ మాధురి, ఆందోల్ ఆర్డీవో పాండు,గజ్వేల్ మేనేజర్ నేషనల్ హైవే అథారిటీ మేనేజర్ శ్రీహరి,ఆర్ అండ్ బి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# హై రిస్క్ ఫ్యాక్టరీల భద్రతపై అవగాహన కార్యక్రమం



**ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఆగస్టు 7:**మేడ్చల్ మల్కాజ్‌గిరి స్థానిక సంస్థల అదనపు జిల్లా కలెక్టర్ అధ్యక్షతన తెలంగాణ ప్రభుత్వ ఫ్యాక్టరీల శాఖ గురువారం మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టరేట్‌లో "హై రిస్క్ కేటగిరీ ఫ్యాక్టరీల స్వీయ ధ్రువీకరణ మరియు జిల్లా స్థాయి కమిటీల ద్వారా ఫ్యాక్టరీల తనిఖీ" పై అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ముఖ్యంగా రసాయన మరియు ఔషధ కర్మాగారాలలో భద్రతపై అవగాహన కల్పించడం ఈ సమావేశం యొక్క లక్ష్యం.

జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా మట్లాడుతూ సిగాచి పరిశ్రమలలో భారీ పేలుడు మరియు అగ్నిప్రమాదాల కారణంగా అధిక ప్రాణనష్టం సంభవించిందని చెప్పారు. ప్రభుత్వం కర్మాగారాలు, పరిశ్రమలు, బాయిలర్లు, కార్మిక, కాలుష్య నియంత్రణ బోర్డు, అగ్నిమాపక సేవల విభాగాలతో కూడిన జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటు చేసి, సెన్సిటైజేషన్ కార్యక్రమం కింద కర్మాగారాలను తనిఖీ చేయాలని ఆదేశించారు. మొదటి దశలోని రసాయన, ఫార్మా కర్మాగారాలను, తదుపరి దశల్లో ఇతర ప్రమాదకర కర్మాగారాలను సందర్శించాలని ఆమె ఆదేశించారు. ప్రమాదాలను నివారించడానికి ప్రస్తుత భద్రతా వ్యవస్థలను మెరుగుపరచాలని ఆమె యాజమాన్యాలను కోరారు. అంతేకాకుండా, ఫ్యాక్టరీ నిర్వహణతో సమన్వయంతో స్థానిక పారిశ్రామిక క్లస్టర్లలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆమె జిల్లా కమిటీని ఆదేశించారు. అన్ని వర్గాల పరిశ్రమలకు సరిపోయే వివిధ భద్రతా మాడ్యూళ్లను అభివృద్ధి చేయాలని ఆమె ఆదేశించారు.

ఫ్యాక్టరీల డైరెక్టర్ శ్రీ వై మోహన్ బాబు తన ప్రసంగంలో, ప్రభుత్వం భద్రతను అమలు చేయడంలో రాజీ పడకుండా ఆదేశాలు జారీ చేసిందని, తనిఖీల సమయంలో యాజమాన్యాలకు ఎటువంటి వేధింపులు ఉండవని అన్నారు. భారీ నష్టాలను తగ్గించి, మానవ ప్రాణాలను కాపాడే చిన్న పెట్టుబడులతో అంతర్నిర్మిత భద్రతా వ్యవస్థలను అభివృద్ధి చేయాలని కూడా ఆయన అన్నారు. డ్రైలకు పేలుడు ఉపశమన ప్యానెల్‌లను ఏర్పాటు చేయడం, భద్రతా ఉపశమన వాల్వ్‌లు మరియు రియాక్టర్లకు పగిలిపోయే డిస్క్‌లు వంటి ఏవైనా లోపాలను వెంటనే సరిదిద్దాలని ఆయన యాజమాన్యాలను అభ్యర్థించారు. ఈ డ్రైవ్ కర్మాగారాల్లో అవగాహనను సృష్టిస్తుందని మరియు భద్రతా వ్యవస్థలను మెరుగుపరుస్తుందని ఆయన హామీ ఇచ్చారు.
ఫ్యాక్టరీ యాజమాన్యాలలో భద్రతా అవగాహన కల్పించడానికి ఇది ఉద్దేశించబడిందని బాయిలర్స్ డైరెక్టర్ శ్రీనివాసరావు సమావేశంలో ప్రసంగించారు.

మేడ్చల్-మల్కాజ్‌గిరిలోని ఫ్యాక్టరీల డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ శ్రీ ఎం. మనోహర్ రెడ్డి తన ప్రారంభోపన్యాసంలో, నేటి సమావేశం యొక్క ప్రాముఖ్యతను వివరించారు మరియు %CII, FICCI, FTCCI, IALA% సభ్యులను , హై రిస్క్ ఫ్యాక్టరీల యాజమాన్యాలను స్వాగతించారు.

బాయిలర్స్ డైరెక్టర్, కార్మిక, కాలుష్య నియంత్రణ మండలి, పరిశ్రమలు, అగ్నిమాపక శాఖల అధికారులు, 100 కి పైగా ఫ్యాక్టరీ యాజమాన్యాలు సమావేశంలో పాల్గొన్నారు

# రైతులకు యూరియా కొరత లేకుండా, అందుబాటులో ఉండేలా చూడాలి.

## బోయినపల్లి మండల సిపిఎం పార్టీ డిమాండ్.



**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, బోయినపల్లి, ( ప్రజాబలం ),** రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలంలో పలు గ్రామాలలో యూరియా సరియైన సమయంలో అందుబాటులో లేకపోవడం వల్ల వరి నాట్లు చాలాచోట్ల ఇంకా పూర్తి కావాల్సి ఉంది. ఖరీఫ్ సీజన్లో రైతులకు యూరియా అందుబాటులో లేకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఇటు పత్తి పంటకి అలాగే వరి సాగుకు మండలంలో పూర్తిస్థాయి యూరియా నిల్వలు లేకపోవడం వల్ల రైతులు చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి దాపురించింది.

ప్రభుత్వ అధికార యంత్రాంగం మేలుకొని బోయినపల్లి మండలంలో రైతులకు యూరియా అందుబాటులో ఉండే విధంగా తగు చర్యలు తీసుకోవాలని మండల సిపిఎం పార్టీ కన్వీనర్ గురజాల శ్రీధర్, రైతాంగం పక్షాన ప్రభుత్వ యంత్రాంగానికి పత్రిక ముఖంగా విజ్ఞప్తి చేయడం జరిగింది

# ప్రభుత్వ పాఠశాలలో రక్షాబంధన్



**హుజూరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి ఆగస్టు 7** ల్లందకుంట మండలం చిన్నకోమటి పల్లి గ్రామంలో గల ప్రాథమికోన్నత పాఠశాల లో బీజేపీ జిల్లా కౌన్సిల్ మెంబర్ గుత్తికొండ రాంబాబు ఆధ్వర్యంలో రాఖీ పౌర్ణమి సందర్భంగా రక్షాబంధన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాల బాలికలకు రాఖీ లు కట్టించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ అక్కా చెల్లి అన్నదమ్ముల అనుబంధానికి ప్రతి కథ రక్షాబంధన్ వేడుకలు పాఠశాలలో నిర్వహించడం ద్వారా తోటి విద్యార్థిని విద్యార్థులకు సోదర భావం కలుగుతుంది అన్నారు

# చేనేత అభివృద్ధి సంక్షేమం కోసం నేతన్న భద్రతా పథకం

**జాతీయ చేనేత దినోత్సవం ర్యాలీని ప్రారంభించిన అదనపు కలెక్టర్.**
**చేనేత కార్మికులు తమ వృత్తిలో అధునాతన పద్ధతులు అవలంబించాలి**
**ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చేనేత వృత్తి మరింత అభివృద్ధి.**
**చేనేత మహిళలు సంఘాలుగా ఏర్పడి ప్రభుత్వ పథకాలలో లబ్ధి పొందాలి.**
**అదనపు కలెక్టర్ (స్థానికసంస్థలు)చంద్రశేఖర్.**



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 07(ప్రజాబలం)**సంగారెడ్డి జిల్లా: సంగారెడ్డి/చేనేత కళాకారుల అభివృద్ధి సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని అదనపు కలెక్టర్ (స్థానికసంస్థలు)చంద్రశేఖర్ అన్నారు. గురువారం జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని చేనేత జౌళీ శాఖ ఆధ్వర్యంలో సంగారెడ్డి ఐటిఐ కళాశాల నుండి కలెక్టరేట్ వరకు చేనేత కార్మికులు ర్యాలీ నిర్వహించారు,ఈ ర్యాలీని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన చేనేత




కార్మికులతో సమావేశం నిర్వహించారు,ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చేనేత కార్మికులు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా తమ వృత్తిలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని నైపుణ్యాన్ని మెరుగుపరచుకోవడం ద్వారా చేనేత కల అంతరించిపోకుండా ఉంటుందన్నారు. చదువుకున్న యువకులు చేనేత వృత్తిలోకి వస్తే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పని సులువు అవడంతోపాటు అనేక నూతన రకాల ఉత్పత్తులు తీసుకువచ్చే అవకాశం ఉంటుందన్నారు. చేనేత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక రకాల పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు,జిల్లాలోని నాణ్యమైన లుంగీలు, తువ్వాలలు, చేతి రుమాలు,మెరినో ఉన్ని బ్లాంకెట్లు, మగ్గాలపై ఉత్పత్తి చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నేతన్న అభయహస్తం కార్యక్రమంలో భాగంగా రూ.168 కోట్ల రూపాయలను ప్రభుత్వం విడుదల చేసినట్లు తెలిపారు. ఈ నిధులతో చేనేత సహకార సంఘాలకు పావుల వడ్డీ రుణాలు కామన్ వర్క్ షెడ్ ఏర్పాటు,40శాతం రాయితీపై నూలు, క్యాష్ క్రెడిట్, లాంటి పథకాల ద్వారా చేనేత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు. చేనేత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం నేతన్న పొదుపు పథకం లో చేనేత కార్మికులు ఎనిమిది శాతం డబ్బులు చెల్లిస్తే ప్రభుత్వం ఎనిమిది శాతం డబ్బులు జమ చేస్తుందన్నారు జిల్లాలో అర్హత కలిగిన 31 మంది చేనేత కార్మికులు ఈ పథకానికి అర్హత పొందినట్లు తెలిపారు,నేతన్న భద్రతా పథకం ద్వారా 18 సంవత్సరాల నుండి 59 సంవత్సరాల మధ్య వల్ల చేనేత కార్మికులు మరియు మరమగ్గాల కార్మికులు మరణించితే వారి నామినీకి జీవిత బీమా సంస్థ ద్వారా ఐదు లక్షల రూపాయల ఇన్సూరెన్స్ డబ్బులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ పథకం లో 54 మంది చేనేత కార్మికులు అర్హత పొందినట్లు తెలిపారు,నేతన్న భరోసా పథకంలో జియో ట్యాగింగ్ నెంబర్ కలిగిన చేనేత కార్మికులకు వారి నిలవారి ఉత్పత్తి సామర్థ్యమును బట్టి సంవత్సరానికి 18000 మరియు అనుబంధ కార్మికులకు 6000 కార్మికుల ఖాతాలు జమ చేస్తున్నట్లు తెలిపారు ఈ పథకంలో జిల్లాలో 31

తెలిపారు,జిల్లాలో 4 చేనేత సహకార సంఘాలలో




74 చేనేత మగ్గాలు జియో ట్యాగింగ్ చేసినట్లు

మంది చేనేత కార్మికులు నమోదైనట్లు తెలిపారు. ప్రభుత్వం చేనేత కార్మికుల సంక్షేమం కోసం చేపట్టిన పథకాలను సద్వినియోగం చేసుకొని చేనేత కార్మికులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ సూచించారు,ఈ పథకాలతో పాటు చేనేత సహకార సంఘాలలో సభ్యులుగా ఉన్న మహిళలు డ్వాక్రా స్వయం సహాయక సంఘాల వలె సంఘాలుగా ఏర్పడి ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా ఉపాధి పొందవచ్చు అని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని తామ వృత్తిలో ఇంకా మెరుగైన పద్ధతులు ఏమేమి చేస్తే చేనేత రంగం అభివృద్ధి చెందుతుందో సమగ్రంగా నివేదిక సమర్పిస్తే జిల్లా కలెక్టర్,జిల్లా మంత్రి దామోదర్ రాజనర్సింహాల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఆయా కార్యక్రమాలు అమలు చేయడానికి చర్యలు తీసుకోనున్నట్లు అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు,ఈ కార్యక్రమంలో సహాయ సంచాలకులు చేనేత మరియు జౌళి శాఖ అధికారి వెంకట్రావు,హెచ్ డబ్ల్యు సి ఎస్ ప్రెసిడెంట్ వర్కల అశోక్, కృష్ణయ్య హెచ్ డబ్ల్యు సి ఎస్ డైరెక్టర్ వరలక్ష్మి, గిపేట నారాయణఖేడ్ చేనేత సహకార సంఘాల సభ్యులు సిబ్బంది, తదితరులు, పాల్గొన్నారు

# వేములవాడ రాజన్న ఆలయంలో ఔట్ సోర్సింగ్ మాఫియా గుట్టురట్టు.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం),** దక్షిణ కాశీగా ప్రసిద్ధి పొందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో తేదీ 06-07-2025 బుధవారం రోజున ఓ తెలుగు దినపత్రికలో వచ్చిన రెండు లక్షల ఇస్తే గుడిలో కొలువు అనే శీర్షికన వచ్చిన వార్త కథనంపై ఆలయ అధికారులు తీవ్రంగా స్పందించారు.

రాజన్న ఆలయమందు ఔట్సోర్సింగ్ ఏజెన్సీల ప్రతినిధులు ఔట్సోర్సింగ్ ఉద్యోగాల పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నట్లుగా ఒక ఆడియో క్లిప్ సోషల్ మీడియా ఎంతో సర్కులేట్ కాబడుతున్నట్టు రాజన్న ఆలయ ఈవో కార్యాలయం దృష్టికి వచ్చింది.

అట్టి ఆడియో క్లిప్ ను దేవస్థానం నందు పని చేయు ఔట్సోర్సింగ్ సిబ్బందితో సంప్రదించి, విచారించగా అట్టి ఆడియో క్లిప్ నందుగల గొంతు రాజన్న దేవస్థానమునకు అవుట్సోర్సింగ్ సిబ్బందిని సరఫరా చేయు ప్రణయన్ హౌస్ కీపింగ్%డ% సెక్యూరిటీ సర్వీసెస్, శాన్వి సర్వీసెస్ ఔట్సోర్సింగ్ ఏజెన్సీ మరియు శివ బాలాజీ కన్సల్టెన్సీలకు సూపర్వైజర్ గా వ్యవహరిస్తున్న బూర్ల లక్ష్మీనారాయణ దిగా భావించి

వేములవాడ రాజన్న ఆలయ కార్యనిర్వహణాధికారి ఆదేశాల మేరకు స్థానిక వేములవాడ పోలీస్ స్టేషన్ నందు ఎఫ్ ఐ ఆర్ బుక్ చేయడం జరిగింది.

తదుపరి పత్రిక నందు వచ్చిన వార్తకు కమిషనర్ దేవాదాయ ధర్మాదాయ శాఖ హైదరాబాద్ రీజినల్ జాయింట్ కమిషనర్ ఎం. రామకృష్ణారావు, మరియు డిప్యూటీ కమిషనర్ టి. వెంకటేష్ ఇట్టి విషయమై విచారణ చేసి రిపోర్టు సమర్పించుటకు ఆదేశించగా, తేదీ 06-07-2025 బుధవారం రోజున దేవస్థానమునకు వచ్చి విచారణ జరిపినరు. ప్రస్తుతం ఈ వ్యవహారం మీద స్థానికంగా తీవ్ర చర్చ సాగుతుంది. రాజన్న ఆలయంలో పారదర్శకత, పరిరక్షణకు కఠిన చర్యలు తీసుకోవాలని రాజన్న భక్తులు ఆలయ అధికారులను డిమాండ్ చేస్తున్నారు.

# ఉచిత సేవలు అందిస్తున్న డాక్టర్ కాశీనాథ్



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి ఆగస్టు 07( ప్రజాబలం )**వికారాబాద్ జిల్లా:మోమిన్ పెట్ మండలం మేకవనంపల్లిలో ఉత్తమ సేవలు అందిస్తున్న డాక్టర్ కాశీనాథ్ చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు అందుబాటులో ఉండి దగ్గు దమ్మువిష జ్వరాల నుండి ప్రజలకు అందుబాటులో ఉండి ఎలాంటి ఫీజు లేకుండా వైద్యం అందిస్తున్న డాక్టర్ కాశీనాథ్ ను ప్రజలుఅభినందిస్తూ నిండు నూరేళ్లు చల్లగా ఉండాలని ప్రజలు సంతోషం వ్యక్తపరిచారు

# విద్యార్థులకు ట్రాఫిక్ పై అవగాహన సదస్సు






**రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి 7 ఆగస్టు 2025**మణికొండ మున్సిపాలిటీ పరిధిలోనీ వీ ఆర్ 4 సహాయోగ్ చారిటబుల్ ట్రస్టు సహకారంతో సొసైటీ ఫర్ సైబర్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్.సి.ఎస్.సి) సభ్యులు నీతా వద్గేరే మరియు సైబరాబాద్ పోలీసు ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్ అధికారులు వి.నవీన్ చారి, మల్లేశ్వర రావు, మస్తాన్ వలి, స్థానిక పోలీస్ శివ నాగేశ్వర్ తది తర అధికారుల ఆద్వర్యంలో గురువారం రోజున మణికొండ గవర్నమెంట్ జిల్లా పరిషత్ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు నిరంజన్ తోడ్పాటుతో 1415 మంది పాఠశాల విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగినదని మేనేజింగ్ ట్రస్టీ అందె లక్ష్మణ్ రావు తెలియ జేసినారు. పాఠశాల విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలను అనుసరించి వాటిని తూచా తప్పకుండా హామీ పరుస్తామని ప్రతిజ్ఞ చేయించడం జరిగినది, తత్ పర్యంతం ట్రాఫిక్ నిబంధనలను విడియో ద్వారా విద్యార్థులకు సవివరంగా తెలియ పరుస్తూ ఎట్టి పరిస్థితుల్లోనూ పిల్లలు వాహనాలను నడుప కూడదని, ప్రమాదవశాత్తూ జరిగే ప్రమాదాలకు గురికావొద్దని, తల్లి తండ్రులకు పుత్ర శోక సంద్రంలో ముంచరాదని, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంగించకుండా, జాగ్రత్తగా మసులుతూ, నిర్లక్షం వలన జరిగే ప్రమాదాల గురించి వారికి తెలియ జేసి మున్ముందు అన్ని రకాల జాగ్రత్తలు పాటిస్తూ, అవసరాన్ని బట్టి రోడ్డుపై పెద్దలకు సహాయ సహకారాలు అందించాలని చెప్పడం జరిగినది. తదనంతరము కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులందరికీ ట్రస్టు ద్వారా బిస్కెట్ ప్యాకెట్లు అందివ్వడం జరిగినదని ట్రస్టు కోశాదికారీ దిలీప్ కక్కడ్, ట్రస్టు సభ్యురాలు సుమ నళిని తెలియ జేసినారు, ఇట్టి కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రహూఫ్, శివరామ్, రజనీ, స్వాతి, అనూపమ, కవీందర్, విజయ్, సత్యం తది తరులు పాల్గొన్నారు

## ఆందోల్ లో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఆకస్మిక తనిఖీలు



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి (ఆగస్టు 07 ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా :** అందోల్ నియోజకవర్గం ఆందోల్ లో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు , మొదట ఆర్డిఓ కార్యాలయాన్ని సందర్శించి కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు, అనంతరం ఆందోల్ లోని భవిత సెంటర్ ను పరిశీలించారు, విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించారు, విద్యార్థులకు అందుతున్న బోధనపై, భోజన సౌకర్యాలపై ఆరా తీశారు,



నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని సూచించారు, అనంతరం భవిత సెంటర్లోని రికార్డులను పరిశీలించారు, సెంటర్ భవనంలోని పరిసరాలను, శుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు, అనంతరం అందోల్ శివారులో ప్రభుత్వం ఏర్పాటు చేసిన శాండ్ బజార్ సందర్శించారు, ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు, ప్రభుత్వం సరఫరా చేసే ఇసుక



నాణ్యత%శ్రీ%తో ఉండాలని సూచించారు, లబ్ధిదారులకు ఇసుక కొరత లేకుండా శాండ్ బజార్లో ఇసుకను ఎప్పటికప్పుడు నిల్వచేసి, అందుబాటులో ఉంచాలని అన్నారు, శాండ్ బజార్లో ఇసుకను కొనేందుకు వచ్చే లబ్ధిదారులకు, ఇబ్బందులు కలగకుండా, ఉండేందుకు విద్యుత్ దీపాలు,అలాగే రోడ్డు, మెరుగైన వసతులను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు..

## తెల్లవారుజామునుంచే యూరియా కోసం రైతుల ఎదురుచూపులు

మహబూబాబాద్ యూరియా కోసం రైతులు పడిగాపులు కాస్తున్నారు. ...తెల్లవారుజామున రెండు గంటలకే ప్రాథమిక వ్యవసాయ కేంద్రాల చేరుకుని, అక్కడే సేద తీరి, అక్కడే మొఖాలు కడుగుతు యూరియా కోసం వేచి చూస్తున్నారు. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ గంగారం ఉమ్మడి మండలాల కు చెందిన రైతుల దుస్థితి ఇది. . ఉమ్మడి మండలాలకు చెందిన రైతులు మొక్కజొన్న పత్తి తో పాటు వరి నాట్లు వేసుకొన్న పంటలకు సకాలంలో యూరియా వేయాలని తెల్లవారుజామున రెండు గంటలకి ప్రాథమిక వ్యవసాయ కేంద్రానికి చేరుకొని అక్కడే సేద తీరి ముఖాలు కడుక్కుంటూ క్యూ లైన్లో అధారు కార్డులు పెట్టి ఎప్పుడు యూరియా ఇస్తారు అంటూ ఎదురు చూస్తున్నారు. గత నెల 25 రోజుల నుండి యూరియా కోసం రైతులు ప్రాథమిక వ్యవసాయ కేంద్రాల చుట్టూ తిరుగుతూ... గంటల తరబడి లైన్లో నిలబడి ఒకటో రెండో యూరియా బస్తాలు దొరికితే ఇంటికి వెళ్లే పరిస్థితి నెలకొంటుంది. రెండు మూడు అంతకంటే ఎక్కువ ఎకరాలు సాగు చేసిన రైతులకు ఆ యూరియా బస్తాలు సరిపోక ఎప్పుడు యూరియా వస్తుంది...ఏప్పుడు యూరియా ఇస్తారు అంటూ ప్రాథమిక వ్యవసాయ కేంద్రాల వద్ద అర్ధరాత్రి నుండి అక్కడే బస చేస్తున్న రైతులు.ఓ పక్క అధికారులు యూరియా కొరత లేదని చెప్తున్నప్పటికీ... సరిపడా యూరియా దొరకక పోవడంతో పంటలు దెబ్బతినే పరిస్థితుల ఉన్నాయని, రైతులందరికి సరిపడ యూరియా అందించాలని రైతులు అధికారులను వేడుకుంటున్నారు.అటు పాలకుల నిర్లక్ష్యం అధికారుల పట్టింపు లేకపోవడం వలన రైతన్న ఆగమయ్యే పరిస్థితి నెలకొంది వ్యవసాయ సీజన్ మొదలయ్యి నెల న్నర అవుతున్నప్పటికి రైతు లకు ఎరువులు సరఫరా చేయడం లో పూర్తిగా విఫలం అయిందని రైతు లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ఘనంగా ప్రారంభం- నిర్వహణ అధ్వానం



సింగూరు గ్రామ పంచాయతీ వద ఉన్న, బోరు

**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి (ఆగస్టు 07 ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా,** పుల్కల్ మండల పరిధిలోని సింగూర్ ప్రాజెక్ట్,వద్ద ఉన్న తెలంగాణ దశాబ్ది సంపద వనంను, పట్టించుకునే వారు కరువయ్యారు, 2023లో దీని ప్రారంభించి, పలు శాఖలో ఉన్నతాధికారులు, మొక్కలు నాటారు, సహజ సిద్ధ వాతావరణనికి చెట్లు అవసరమని ప్రసంగించారు, అనంతరం వాటి నిర్వహణ మరిచారు, దాదాపు నాటిన అన్ని మొక్కలు ఎండిపోయాయి, 2024, వర్షాకాలంలో ఇక్కడ మొక్కలు నాటేందుకు, నర్సరీల నుంచి మొక్కలు తీసుకొచ్చి వదిలేసారు, దీనిపై గతేడాది , జులై 14న పత్రికలో కథనం ప్రచురితమైంది, స్పందించిన అధికారులు, ఇక్కడి నుండి బోర్డులు తొలగించి, స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేశారు, ప్రస్తుతం సంపద వనంలో పశువులనుమేపుతున్నారు, ఫలితంగా ప్రభుత్వ నిధులు నిర్వీర్యం అవుతున్నాయి, ఇంతే కాకుండా ప్రతి మండలంలోని గ్రామాలలో చెట్టు నాటుతున్నప్పటికీ, వాటి సంరక్షణ బాధ్యత పంచాయతీ కార్యదర్శ,ఫీల్డ్ అసిస్టెంట్,మొక్కల సంరక్షణ తీసుకోకపోవడంతో చెట్లు ఎదగడం లేదు ఇప్పటికైనా అధికారులు స్పందించి, గ్రామాలలోని నాటిన ప్రతి మొక్కను సంరక్షించేలా చర్యలు తీసుకోవాలని వివిధ గ్రామాల ప్రజలు కోరుతున్నారు...



సంపద వనంలో మేస్తున్న పశువులు

## సైబరాబాద్ సిపి ఆదేశాలమేర ఇంటి వద్దకే ఎఫ్ఐఆర్ ప్రయోగాత్మకంగా బాలానగర్ పిఎస్ లో అమలు...



**కూకట్పల్లి (ప్రజబలం ) ఆగస్టు 07:** ప్రాథమిక సమాచార నివేదిక (ఎఫ్ఎస్ఐఆర్) కోసంఫిర్యాదుదారులు పోలీసుస్టేషన్ల చుట్టూ తిరుగుతూఉండటం మనం చూస్తుంటాం. సైబరాబాద్ సిపి అవినాష్ మొహం, ఐపీస్, ఆదేశాల మేరకు బాలానగర్ పోలీస్ స్టేషన్ పరధిలో సీఐ నర్సింహా రాజు నేతృత్వంలో ప్రయోగాత్మకంగా వయవృద్ధుల ఫిర్యాదు పై ఎఫ్ఎస్ఐఆర్ నమోదుచేసి పోలీస్ స్టేషన్ నుంచి సీఐ నర్సింహా రాజు, ఎస్ఐ సరితా పటేల్ రెడ్డి, వినోద్ తో కలిసి నేరుగా ఫిర్యాదుదారులు ఇంటికి వెళ్లి వాటిని గురువారం అందజేశారు. ఆశ్చర్యపోయిన ఫిర్యాదుదారులు, గమనించిన స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. సైబరాబాద్ సిపికి, బాలానగర్ సీఐ నర్సింహా రాజుకు, పోలీస్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ నర్సింహా రాజు మాట్లాడుతూ న్యాయం కోసం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు ఎఫ్ఐఆర్ కాపీ కోసం అనేకసార్లు చక్కర్లు కొట్టాల్సిన అవసరం లేకుండా చూసేందుకు వయవృద్ధుల, వికలాంగులు ఇచ్చిన ఫిర్యాదులను పరిశీలించి, ఎఫ్ఎస్ఐఆర్ నమోదుచేసి వారి ఇళ్లకు వెళ్లి అందిస్తే ప్రజలకు పోలీసు వ్యవస్థపై నమ్మకం మరింత విశ్వాసం పెంచాలనే ఉద్దేశంతో ఈ విధానానికి శ్రీకారం చుట్టామన్నారు. అంతేకాక సున్నితమైన కేసులకు సంబంధించిన ఎఫ్ఐఆర్లు మఫ్టీలో ఇంటికి వెళ్లి ఎఫ్ఐఆర్ అందజేస్తామని వివరించారు.

# ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం

### సిరిసిల్లలోని నేతన్న విగ్రహానికి పూలమాలలు వేసిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, కే కే మహేందర్ రెడ్డి

### పాల్గొన్న నేత కార్మికులు, ఆసాములు, యజమానులు, చేనేత జౌళి శాఖ అధికారులు

**రాజన్న సిరిసిల్ల జిల్లా, ఆగస్టు - 07 (ప్రజాబలం ప్రతినిధి)**జాతీయ చేనేత దినోత్సవాన్ని గురువారం సిరిసిల్ల పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిరిసిల్ల పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద ఉన్న నేతన్న విగ్రహానికి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, కే కే మహేందర్ రెడ్డి, ప్రముఖులు పూలమాలలు వేశారు.జై నేతన్న.. జై నేతన్న అనే నినాదాలు చేశారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు ప్రజా ప్రభుత్వం అందిస్తున్న వివిధ ఆర్డర్లు, యార్న్ బ్యాంకు, స్కూల్ యూనిఫాం, విద్యుత్ సబ్సిడీ అంశాలను పలువురు ప్రజా



ప్రతినిధులు గుర్తు చేసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ తోడ్పాటుపై హర్షం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో చేనేత జౌళి శాఖ ఏడీ రాఘవరావు, వస్త్ర పరిశ్రమ

## ఘనంగా సింధూర్ సాముహిక కుంకుమర్చన

ఖమ్మం జలాంజనేయ స్వామి ఆలయంలో దుర్గావాహిని ఆధ్వర్యంలో సింధూర్ సామూహిక కుంకుమార్చన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కుంకుమార్చన కార్యక్రమం లో సుమారు వెయ్యి మంది మహిళలతో సామూహిక కుంకుమార్చన కార్యక్రమం చేపట్టారు. అర్చకులు భక్తి శ్రద్ధలతో అమ్మవారికి అర్చన చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి కుంకుమార్చన కార్యక్రమానికి వచ్చిన మహిళలు. అన్యమత ప్రచారం, ఆడపిల్లలను ఓ కంట కనిపెట్టుకుని ఉండాలని సూచన చేశారు. కుంకుమార్చన కార్యక్రమం లో పాల్గొన్న వారికి నాణెం, పూజా సామాగ్రిని ఉచితంగా అందించిన నిర్వాహకులు. కుంకుమార్చన కార్యక్రమం విశిష్టత గురించి తెలిపిన ఆలయ అర్చకులు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు విశ్వ హిందూ పరిషత్ దుర్గావాహిని అధ్యక్షురాలు కనగంటీ నాగమణి ధన్యవాదాలు తెలిపారు.

# పారిశుధ్య నిర్వహణ పట్ల పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి :: జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ

**ఫీవర్ కేసులకు తప్పనిసరిగా డెంగ్యూ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలి**

**జిల్లాలో డెంగ్యూ మరణాలు సంభవించకుండా జాగ్రత్తలు పాటించాలి**

**ప్రతి ఫీవర్ కేసును వైద్య సిబ్బంది ఫాలో అప్ చేయాలి**

**ఆస్తి పన్ను వసూలు లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలి**

**సీజనల్ వ్యాధుల నియంత్రణ పై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించిన జిల్లా కలెక్టర్**





**రాజన్న సిరిసిల్ల జిల్లా, ఆగస్టు 07:(ప్రజాబలం ప్రతినిధి)**గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ పట్ల పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ తెలిపారు. గురువారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో సీజనల్ వ్యాధుల నియంత్రణ పై ఎం.పి. ఓ., పంచాయతీ కార్యదర్శులు, ఏ.ఎన్.ఎం. లతో రివ్యూ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ, డెంగ్యూ, మల్లేరియా, చికెన్ గున్యా వంటి సీజనల్ వ్యాధులు వ్యాప్తి నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని, ఫీవర్ కేసులకు తప్పనిసరిగా డెంగ్యూ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి గ్రామంలో పారిశుధ్య నిర్వహణ పట్ల అత్యంత ప్రాధాన్యత కల్పిస్తూ సీజనల్ వ్యాధులు వ్యాప్తి అరికట్టాలని అన్నారు.డెంగ్యూ కేసులు నమోదైన ప్రాంతంలో ప్రత్యేకంగా పారిశుధ్య చర్యలు చేపట్టాలని, చుట్టుపక్కల ఇండ్లలో ఫీవర్ సర్వే నిర్వహించాలని అన్నారు. పంచాయతీ కార్యదర్శి బాధ్యతతో గ్రామంలో పిచ్చి మొక్కల తొలగింపు, నీటి నిల్వ ఉండకుండా చర్యలు, అధికంగా నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేయడం వంటి చర్యల చేపట్టాలని అన్నారు.గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని హై రిస్క్ ఏరియాలను గుర్తించి అక్కడ డ్రై డే పకడ్బందీగా జరిగేలా చూడాలని అన్నారు. ప్రతి గ్రామంలో వారానికి రెండు సార్లు మంగళవారం, శుక్రవారం డ్రై డే కార్యక్రమం జరగాలని అన్నారు. ఆశా, ఏ.ఎన్.ఎం లు ఇంటింటి సర్వే నిర్వహించి నీటి నిల్వ వల్ల కలిగే నష్టాలు, దోమల తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సబ్ సెంటర్ అధికారులు వారి పరిధిలో సీజనల్ వ్యాధుల వ్యాప్తి నియంత్రణ జరిగేలా చూడాలని అన్నారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, హెల్త్ సబ్ సెంటర్ పరిధిలో అవసరమైన మేర వ్యాధి నిర్ధారణ కిట్లు అందుబాటులో పెట్టాలని అన్నారు. ప్రతి పీ.హెచ్.సి పరిధి లో లక్ష్యాలు నిర్దేశించుకొని నిర్ధారణ పరీక్షలు చేయాలని అన్నారు.డెంగ్యూ కేసులను తక్కువ చేసి చూపించే అవసరం లేదని, మనం ఎన్ని డెంగ్యూ కేసులు గుర్తించి వారికి అవసరమైన చికిత్స అందిస్తే అంత బాగా పని చేసినట్లుగా పరిగణిస్తామని కలెక్టర్ తెలిపారు.ఔట్ పేషెంట్ వచ్చే ప్రతి ఫీవర్ కేసు రోగి కు తప్పనిసరిగా డెంగ్యూ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని అన్నారు. డెంగ్యూ నిర్ధారణ జరిగిన కేసులలో నిర్దేశిత ప్రోటోకాల్ ప్రకారం చికిత్స అందించడం పరిసర ప్రాంతాల పారిశుధ్య పనులు జరిగేలా చూడాలని అన్నారు.డెంగ్యూ కేసులను రెగ్యులర్ గా ఫాలో అప్ చేయాలని, రక్త కణాలు ఎలా ఉంటున్నాయో పరిశీలించాలని అన్నారు. మన విధులలో చూపెట్టె చిన్న నిర్లక్ష్యం కారణంగా ఒక కుటుంబం సభ్యులను కోల్పోయే ప్రమాదం ఉంటుందని, దయచేసి అధికారులు సిబ్బంది అంతా అప్రమత్తతో విదుదల నిర్వహించాలని అన్నారు.సిరిసిల్ల , వేములవాడ ఆసుపత్రులకు అధికంగా రోగులు వస్తున్నారంటే క్షేత్ర స్థాయిలో పి.హెచ్.సి పని తీరు సరిగ్గా ఉండటం లేదని అర్థం వస్తుందని అన్నారు. ప్రతి పి.హెచ్.సి వద్ద అవసరమైన మందులు, వ్యాధి నిర్ధారణ కిట్లు 20% బఫర్ స్టాక్ తో అందుబాటులో పెట్టుకోవాలని అన్నారు.ప్రతి గ్రామంలో ఆస్తిపన్ను వసూలు లక్ష్యాలను పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో పని చేయాలని.

ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా రజిత, సిరిసిల్ల, వేములవాడ ఏరియా ఆసుపత్రుల సూపరింటెండెంట్ లు పెంచలయ్య, జిల్లా పంచాయతీ అధికారి షరీఫ్డీన్, ఎం.పి.ఓ. లు, పంచాయతీ కార్యదర్శులు, ఏ.ఎన్.ఎం. లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నాలా పనులను పూర్తి చేయాలి
## మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



**సనత్ నగర్ (ప్రజాబలం ప్రతినిధి నరేష్) ఆగస్టు 7** రెండు, మూడు రోజులలో నాలా పెండింగ్ పనులను పూర్తి చేయాలని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులను ఆదేశించారు. అమీర్ పేట డివిజన్ లోని గాయత్రి నగర్ లో చేపట్టిన నాలా నిర్మాణ పనులు పూర్తికాకపోవడం వలన ఇబ్బందులు పడుతున్నామని, మిగిలిన పనులు త్వరగా పూర్తి చేయించాలని కాలనీ వాసులు ఇటీవల మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ను కలిసి విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అదేరోజు అధికారులతో మాట్లాడి పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అందులో భాగంగా గురువారం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యటించి నాలాను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులు పలు విషయాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. నాలా పనులకు అడ్డంకిగా ఉన్న విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ షిఫ్టింగ్ పనులను అధికారులు ప్రారంభించగా, నాలా పై ఉన్న ఆక్రమణలను వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేసి ప్రజల ఇబ్బందులను తొలగించాలని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వర్షాకాలంలో గాయత్రి నగర్ లో వర్షపునీరు రోడ్లపై నిలిచి ప్రజలు పడుతున్న కష్టాలను చూసి శాశ్వత పరిష్కారం చూపాలని నాలా నిర్మాణం పనులు చేపట్టినట్లు వివరించారు. ఈ పనుల పూర్తితో గాయత్రి నగర్ వాసుల ఎన్నో సంవత్సరాల సమస్య పరిష్కారం అయినట్లేనని చెప్పారు. ఎమ్మెల్యే వెంట మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, ఈ ఈ వెంకటేశ్వర్లు, వాటర్ వర్క్స్ జీఎం ప్రభాకర్, టౌన్ ప్లానింగ్, సయ్యద్, ఎలెక్ట్రికల్ ఏడి కిషోర్, డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు హన్మంతరావు, నాయకులు అశోక్ యాదవ్, ప్రవీణ్ రెడ్డి, నామన సంతోష్ కుమార్, కూతురు నర్సింహ, గోపీలాల్ చౌహన్, కట్టా బలరాం, టిల్లు బాయ్, కాలనీ వాసులు వినోద్ తదితరులు పాల్గొన్నారు



## గురుకులాలు ఎవరెస్ట్ స్థాయికి ఎదిగాయి

**ఆరు లక్షల మంది విద్యార్థులకు ఆశ్రమం**

**పేరెంట్స్ అసోసియేషన్ ఖమ్మం జిల్లా నూతన కమిటీ ఎన్నిక**

**తెలంగాణ గురుకులాల పేరెంట్స్ అసోషియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోట లోకేష్**




**ఖమ్మం ప్రతినిధి ఆగస్టు 7 (ప్రజాబలం) ఖమ్మం** దేశంలోనే ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో వెయ్యికి పైగా గురుకుల పాఠశాలలు,ఇంటర్,డిగ్రీ కళాశాల లు ఏర్పాటు చేసిన తెలంగాణ ప్రభుత్వం ,నేడు గురుకులాలు ఎవరెస్ట్ స్థాయికి చేరుకున్నాయని , దాదాపు 6 లక్షల మంది విద్యార్థులకు ఆశ్రమం కల్పిస్తూ బావి భారత పౌరులుగా తీర్చిదిద్దుతున్నాయని తెలంగాణ గురుకులాల పేరెంట్స్ అసోషియేషన్

రాష్ట్ర ఉపాధ్యక్షులు కోట లోకేష్ అన్నారు ఖమ్మం ప్రెస్ క్లబ్ లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ

తెలంగాణ రాష్ట్రం ఏర్పడేనాటికి కేవలం 293 గురుకుల పాఠశాలలు ఉండగా నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం తొమ్మిదేండ్లలో 709 కి పైగా కొత్త గురుకుల పాఠశాలలు కొన్ని ఇంటర్,డిగ్రీ కాలేజీలు ప్రారంభించడం జరిగింది అన్నారు




మొత్తం వెయ్యికి పైగా గురుకులాల్లో సుమారు ఆరు లక్షల మంది విద్యార్థులకు అధునాతన సౌకర్యాలతో నాణ్యమైన ఉచిత విద్యా బోధనతో పాటు భోజన, వసతి సదుపాయలు కల్పిస్తుదని,

ఐఐటీ,ఐఐఎం,నీట్,దేశ విదేశాలలో క్యాట్ మ్యాట్ సాయుధబలగల పరీక్షలలో శిక్షణ నిస్తూ,కంప్యూటింగ్ కోడింగ్, డేటా సైన్స్, మేషన్ లెర్నింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వంటి వాటిలో గురుకులాలు ప్రత్యేక శిక్షణ నిస్తున్నాయని అన్నారు టి జి పి ఎ వ్యవస్థాపక అధ్యక్షులు మోతుకూరి యాదయ్య తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు అంబాల ప్రభాకర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుడిసె పవన్ కుమార్ సారథ్యంలో అసోసియేషన్ కొనసాగుతున్నాయని, అందులో భాగంగా తెలంగాణ గురుకులాలు పేరెంట్స్ అసోషియేషన్ ఖమ్మం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. ఎన్నికైన కమిటీ సభ్యులను అభినందిస్తూ వారికి నియమక పత్రాలను ఈ సందర్భంగా అందజేశారు ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఉమ్మడి నల్గొండ జిల్లా ఇంచార్జ్ వరకాల విజయ కుమారి ఖమ్మం జిల్లా అధ్యక్షులు గొల్లమందల శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శి మతంగి అనిల్ కుమార్ ఉపాధ్యక్షులు ముత్యాల రాజు సహాయ కార్యదర్శి కొల్లి వర్మ ప్రచార కార్యదర్శి దర్శి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## పొలానికి దారి కోసం చెరువు కట్ట కబ్జా.... పట్టించుకోని అధికారులు.




**తూప్రాన్ తెలంగాణ న్యూస్ ఆగస్టు-07 :**బిమెదక్ జిల్లా తూప్రాన్ మండలం యావపూర్ గ్రామంలో చెరువుకట్ట ను చీల్చి తన సొంత పొలముకు దారి చేసుకున్న ఘటన చోటుచేసుకుంది.గ్రామం లోని పెద్దలు కుమ్మరి నర్సింలుకు చెరువు కట్టను చీల్చవద్దని గ్రామస్తులు తెలిపినప్పటికీ పెడచెవిన పెడుతున్నాడని గ్రామ యువ నాయకుడు నర్సింలు ఆరోపించారు.ఇదే విషయాన్ని పెద్దలు చెప్పిన వినకుండా ఎవరేం చేసినా భయపడేది లేదని ఇరిగేషన్ మరియు మండల అధికారుల నుండి అనుమతులు తీసుకున్నానని సమాధాన మిస్తున్నాడని గ్రామంలోని సమాజ సేవకుడు నర్సింలు ఒక ప్రకటన ద్వారా తెలిపారు.చెరువు క్రింది భాగంలో గ్రామంలోని అందరికీ పొలాలు ఉన్నాయని ఈ వ్యక్తి మాత్రం చెరువు కట్టను చెడగొట్టి తన పొలమునకు ఇరువైపులా దారి చేసుకుని రాకపోకలు కొనసాగిస్తున్నాడని,భారీ వర్షాలకు కట్ట కాస్త సన్నగిల్లి తెగిపోయే ప్రమాదం ఏర్పడుతుందని తెలిపారు.తక్షణమే మండల అధికారులు, ఇరిగేషన్ అధికారులు కల్పించుకొని కట్టను చీల్చిన సదరు వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో ప్రతి ఒక్కరు పెద్ద చెరువు కట్టను చీల్చే ప్రయత్నం చేస్తారని దీని ద్వారా చెరువు కట్టకు ప్రమాదం ఏర్పడుతుందని ఆరోపించారు

## నెహ్రూనగర్ బడిలో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు



**రాజన్న సిరిసిల్ల జిల్లా, ఆగస్టు 7 (ప్రజాబలం ప్రతినిధి)**నేడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నెహ్రూ నగర్ లో ముందస్తు రాఖీ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సోదరి,సోదరుల అన్యోన్యతకు రాఖీ పండుగ నిదర్శనమని,రాఖీ పండుగ విశిష్టతను ప్రధానోపాధ్యాయులు కే. గణేష్ తెలియజేశారు.ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థులందరూ ఒకరికి ఒకరు రాఖీలు కట్టుకొని “నేను నీకు రక్ష, నీవు నాకు రక్ష, మనిద్దరం దేశానికి రక్ష” అంటూ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు వాసాల హరిప్రసాద్,నందిని,లావణ్య,ప్రవళిక, కరుణ తదితరులు పాల్గొన్నారు


# ఎలక్షన్ కమిషన్ పై బాంబు రాహుల్ గాంధీ

## వెంటనే ఈ సి అధికారులు వైదోలాగాలి బద్దం సతీష్ గౌడ్ ,డాక్టర్ శ్రీనివాస్ వంజరి

**గోషామహల్ ప్రజాబలం ప్రతినిధి:**తేది 7గురువారం రోజున లోకసభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ న్యూ ఢిల్లీ లో విలేకరుల సమావేశం లో ఎలక్షన్ కమిషన్ పై బాంబు అనే అంశం మీద సమావేశం







నిర్వహించి ఎలక్షన్ కమిషన్ అవకాతవకాలకు పాల్పడడం వల్ల కేంద్రంలో ప్రభుత్వానికి సహకరించిన విషయాన్ని ఆధారాలతో బయటపెట్టడని ప్రజలు అందరూ గమనించారు.భారతదేశంలోని బిజేపీ పాలిత రాష్ట్రాలలో 30శాతం బోకస్ ఓటర్లని ఏర్పాటు చేసుకుని ప్రభుత్వాలు ఏర్పాటు చేశాయి.భారతదేశంలోని మంచి పేరున్న ఎన్నికలు సర్వే నిర్వహించే సంస్థలు వారి సర్వేలు తారుమారు అవడానికి కారణమిదే ఉదాహరణకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో లగడపాటి రాజగోపాల్ సర్వే విఫలమవ్వడంతో సర్వే చేయడమే ముగించినారు.సర్వేలో ఓటరు సర్వేనే ఉంటుంది.దొంగ ఓట్ల సర్వే ఉండదు.కాబట్టి ఈ దొంగ ఓట్లకు సహకరించిన అధికారులను ప్రేరేపించిన రాజకీయ నాయకులను దేశ ద్రోహులుగా ప్రకటించి దేశద్రోహం చట్టం కింద అరెస్ట్ చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు. ఇప్పటికయినా ఎలక్షన్ కమిషన్ అధికారులు స్వచ్ఛందంగా పదవీనుంచి వైదోలాగాలని డిమాండ్ చేస్తున్న బద్దం సతీష్ గౌడ్ టీపీసీసీ బి సి డిపార్ట్మెంట్ మాజీ కార్యదర్శి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు డాక్టర్ శ్రీనివాస్ వంజరి ,నగేష్, రాధా కృష్ణ, చేతన్, నరేందర్, ఇఫతేఖర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు.

# పట్టణ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవం



**రాజన్న సిరిసిల్ల జిల్లా, ఆగస్టు 7 (ప్రజాబలం ప్రతినిధి)**నేడు జాతీయ చేనేత దినోత్సవం పురస్కరించుకొని బి.ఆర్.యస్ సిరిసిల్ల పట్టణ శాఖ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య , పట్టణ అధ్యక్షులు జిందం చక్రపాణి, ఆధ్వర్యంలో సిరిసిల్ల నేతన్న విగ్రహానికి పూలమాలలు వేసి అలంకరించడం జరిగింది

తదనంతరము కొండ లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేయటం జరిగింది . ఇట్టీ కార్యక్రమంలో గూడూరి ప్రవీణ్ ఆకునూరి శంకరయ్య కార్మిక విభాగం అధ్యక్షులు వెంగళ శ్రీనివాస్ , మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్ , అర్బన్ బ్యాంక్ వైస్ చైర్మన్ అడగట్ల మురళి , మహిళా విభాగం అధ్యక్షురాలు బత్తుల వనజ, పార్టీ ప్రధాన కార్యదర్శి మ్యాన రవి, సబ్బని హరీష్, మాజీ కౌన్సిలర్స్ అన్నారం శ్రీనివాస్, దార్నం అరుణ, కల్లూరి రాజు, గెంట్యాల శ్రీనివాస్, దార్ల సందీప్, పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# జిల్లాకు చేరుకున్న బ్యాలెట్ బాక్సుల టీం జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 07 :** జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆదేశాల మేరకు గుజరాత్ రాష్ట్రంలోని జాంనగర్ కలెక్టర్,ద్వారక జిల్లా (దేవభూమి) కంబలియా డిప్యూటీ కలెక్టర్ లను కలిసి ఆయా జిల్లాల నుండి బ్యాలెట్ బాక్సులను సేకరించుకుని బృంద సభ్యులు గురువారం జిల్లాకు చేరుకున్నారని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు తెలిపారు.జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ ఆదేశాల మేరకు 970 బ్యాలెట్ బాక్సులతో దాదాపు 3 వేల 200 కిలోమీటర్లు ప్రయాణించి పోలీసు బందోబస్తుతో బ్యాలెట్ బాక్సులను తీసుకుని వచ్చిన మండల పంచాయతీ అధికారులు అజ్మత్ అలీ,శ్రీపతి బాపు రావు, పంచాయతీ కార్యదర్శి సుమన్, డి పి ఎం నరేందర్, పోలీస్ సిబ్బందిని అభినందించారు.బ్యాలెట్ బాక్స్ లను నస్పూర్ లో గల సి.ఐ.ఎస్.ఎఫ్.క్వాటర్లలో భద్రపరచడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్,బెల్లంపల్లి డివిజనల్ పంచాయతీ అధికారి షేక్ సర్దార్ అలీ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 07** :జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులు, సామాజిక, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని దండేపల్లి మండల కేంద్రంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వార్డులు, మందుల నిల్వలు, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించి రోగులతో ఆసుపత్రిలో అందిస్తున్న సదుపాయాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం వైద్య రంగాన్ని బలోపేతం చేస్తూ అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రజలకు అవసరమైన సదుపాయాలు కల్పించడంతో పాటు మందుల నిల్వలను అందుబాటులో ఉంచి వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని, ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని తెలిపారు.ఆసుపత్రి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. కర్ణపేట గ్రామంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి పాఠశాలలో తరగతి గదులు,వంటశాల, రిజిస్టర్లు,పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధన అందించాలని, ఉపాధ్యాయులు విధుల పట్ల సమయపాలన పాటించాలని,తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి చారించాలని తెలిపారు.లింగాపూర్ గ్రామంలోని ఆదర్శ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి పాఠశాలలో అందిస్తున్న ఆహారం నాణ్యత, సదుపాయాల వివరాలు తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల ఆరోగ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలని,గుణాత్మక విద్యను అందించాలని తెలిపారు.గ్రామంలో పర్యటించి పారిశుధ్య నిర్వహణ కార్యక్రమాలను పరిశీలించారు. అంతర్గత రహదారులు, మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని, ప్రతి రోజు ఇంటింటి నుండి తడి, పొడి చెత్తలను సేకరించి డంపింగ్ యార్డ్ కు తరలించాలని, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, ప్రతి ఇంటికి శుద్ధమైన త్రాగునీటిని అందించాలని తెలిపారు. గ్రామంలోని నర్సరీని సందర్శించి మొక్కల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, వనమహోత్సవం కార్యక్రమం కొరకు అవసరమైన మొక్కలను సిద్ధం చేయాలని, సకాలంలో మొక్కలకు నీటిని అందించాలని నిర్వాహకులను ఆదేశించారు. ధర్మారావుపేట గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించారు.లబ్ధిదారులు నిబంధనల ప్రకారం ఇండ్లు నిర్మించుకోవాలని, బిల్లులు త్వరగా మంజూరు చేసేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. నిరుపేదల కొరకు ప్రభుత్వం అందించిన ఇందిరమ్మ ఇండ్లను లబ్ధిదారులు సద్వినియోగపరుచుకోవాలని తెలిపారు.ద్వారక గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి అధికారులు, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రసాద్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

# పుల్కల్ వైన్స్ లో వరుస చోరీలు

## పోలీసులకు సవాలు విసురుతున్న కేటుగాళ్లు



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి (ఆగస్టు 07 ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా :** మందు ప్రియులను రంజింపజేసే, మద్యం కేంద్రాలనె కేటుగాళ్లు టార్గెట్ గా చేసుకుంటున్నారు, ఆందోల్ తాలూకా పుల్కల్ మండలంలో వైన్స్ దుకాణంలోవరుస చోరీలకు పాల్పడుతూ, పోలీసులకే సవాల్ విసురుతున్నారు దుండగులు, గత నాలుగు రోజుల క్రితం సింగూర్ వద్ద ఉన్న వైన్ షాప్ పైకప్పు రేకులను తొలగించి, దుకాణంలోకి చొరబడ్డారు కేటుగాళ్లు, ఆ షాపులో లక్ష రూపాయల నగతుతోపాటు వివిధ బ్రాండ్లకు చెందిన మద్యం బాటిలను తీసుకొని ఉడాయించారు, ఈ ఘటన మరువక ముందే పుల్కల్ మండలంలోని,






వినాయక వైన్స్ లో , అర్ధరాత్రి సమయంలో దుకాణం పైకప్పు కోసేసి లోపలికి ప్రవేశించి చోరీకి యత్నించారు,గుర్తుతెలియని అగాంతకులు, వైన్స్ దుకాణం లోకి చొరబడ్డ దొంగలు, అందిన కాడికి దోచేశారు, షాప్ గల్లాలోని 30,000 నగదును, ఒక ఫుల్ బాటిల్ మద్యంను తీసుకొని ఉడాయించారు, ఇదంతా సీసీ కెమెరాలో రికార్డు అయింది, అగాంతకుడు తన ఆనవాళ్లు తెలియకుండా ఉండేందుకు, ముఖానికి మాస్క్ చేతులకు గ్లౌజులు వేసుకొని ఆపై వైన్స్ లోని సొత్తును కొల్లగొట్టాడు, ఈ దుండగులు,వరుస చోరీలతో పోలీసులకే సవాల్ విసిరుతున్నారు, ఈ వరుస చోరీలతో పుల్కల్ మండల కేంద్రంలోని జనాలు అడలెత్తిపోతున్నారు, పోలీస్ స్టేషన్కు కూత వేటు దూరంలోనే,ఈ చోరీ ఘటన చోటు చేసుకోవడంతో, స్థానిక పోలీసుల విధి నిర్వహణపై గుసగుసలు వినిపిస్తున్నాయి, నైట్ పెట్రోలింగ్ సిబ్బంది నిర్లక్ష్యంగావ్యవహరిస్తున్నారని,ఆరోపణలు గుప్పుమంటున్నాయి, ఇప్పటికైనా పోలీసు యంత్రాంగం అప్రమత్తమై, రాత్రుల్లు నిగా పెట్టి దొంగలను గుర్తించి అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తున్నారు

# బర్త్ సర్టిఫికెట్ కు దరఖాస్తు చేస్తే.. మరణ ధ్రువీకరణ జారీ

ఖమ్మం అధికారుల నిర్లక్ష్యంగా బతికుండగానే డెత్ సర్టిఫికేట్ జారీ చేసిన ఘటన ఖమ్మం జిల్లా కూనుమంది తహసీల్దార్ కార్యాలయంలో చోటుచేసుకుంది. చేసిన తప్పును సదరు సెక్షన్ అధికారి సరిదిద్దుకోకపోగా తమనే దబాయించి మందలించాడని బాధితులువాపోయారు.బతికున్న కూతురుకు డేట్ సర్టిఫికెట్ ఇవ్వడంతో అవాక్కయ్యారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం మండలంలోని గట్టుసింగారం గ్రామానికి చెందిన కడారి ఉపేందర్, మమత దంపతులు తమ కూతురు మాదవిద్య జనన సర్టిఫికెట్ కోసం పుట్టిన ఆరునెలల తర్వాత దరఖాస్తు చేశారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో రికార్డులు లేనందున తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కార్యదర్శి చెప్పారు. దీంతో బాలిక తల్లితండ్రులుగత ఏడాది డిసెంబరు 17న బాలిక జనన సర్టిఫికెట్ కోసం తహసీల్దార్ కార్యాలయంలో చలానా కట్టారు. అప్పటినుంచి అవి జతపర్చిన ధృవీకరణ పత్రాలు సరిగా లేవంటూ కాలాయాపన చేశారు. అనంతరం ఆగస్టు నాలుగో తేదీన సర్టిపికెట్ చేతికందించారు. బాలిక తల్లి పరిశీలించగా బర్త్ సర్టిఫికెట్ బదులు డెత్ సర్టిఫికెట్ జారీచేసినట్లు గమనించింది. ఇదేంటని ప్రశ్నించడంతో వెంటనే లాక్కొన్న సెక్షన్ ఆఫీసర్ దానిని చింపివేశారు. డెత్ బదులు మరల బర్త్ సర్టిఫికెట్ బందించారు. కానీ అందులో ఎక్కడ డెలివరీ అయిన వివరాలు లేకపోవడంతో.. సర్ హాస్పిటల్ వివరాలు నమోదు చేయాలని అడగ్గా దుర్భాషలాడాడు. దీంతో వారు తహసీల్దారు ను కలిసేందుకు వెళ్లగా అందుబాటులో లేకపోవడంతో ఇంటికి వెళ్లిపోయారు. ఉన్నతాదికారులు విచారణ జరిపించాలని కోరారు. తహసీల్దార్ రవికుమార్ ను వివరణ కోరగా తాను కార్యాలయానికి రాలేదని, కోర్టు పనిమీద హైదరాబాద్ వెళ్లానని తెలిపారు. బాలిక తల్లితండ్రులు ఫోన్లో విషయం తన దృష్టికి తీసుకవచ్చారని తెలిపారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com